16 పేజీలు అణా:　　సంII చందా రు 4:　　R. No. M. 3152.

# జమీన్ రైతు

ఈ వారంలో—


1. నెల్లూరు ముచ్చట్లు.
2. రంగాగారి మీద కేసు.
5. పడవ మునిగింది.
3. ఆరోగ్యము అంశాలు.
4. లఘువిమర్శలు.
5. సంపాదకీయాలు.


—సంపాదకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు.

సంపుటం 11　　శుక్రవారము : నెల్లూరు : 7—6—40.　　సంచిక 23

# పారిస్‌పై జర్మనీ విమానదాడి—

## ఫ్లాండర్సు యుద్ధరంగంలో మిత్రమండలి సేనలు చావు తప్పించుకొని బ్రిటనుకు పారిపోయినాయి

ఫ్రాన్సు, బెల్జియం ఇంగ్లీషు ఛానల్‌లోని రేవు స్థలాలు జర్మనుల వశమైనాయి. కలే రేవును సంరక్షిస్తుండిన 4 వేల సైనికులలో 30 మంది మాత్రమే సురక్షితంగా బ్రిటనుకు తప్పించుకొని వెళ్లినారు.

## ఇటలీ సమరసన్నాహాలు గావిస్తున్నది

## జర్మన్ నగరాలలోని మిలిటరి కేంద్రాలపై మిత్రమండలి విమానదాడి

## జర్మన్ దాడి నెదుర్కొనుటకు బ్రిటను జాగ్రతలు

పి. వి. సుబ్బారావు.

ఏముహూర్తాన హిట్లరు 1—9—39 తేదీన పోలండుమీద యుద్ధం ప్రారంభించాడో గాని, యింతవరకును, దేశం వెంబడి మరోదేశం జర్మనీకి ఆహుతి ఆయిపోతున్నది. పోలండు, డెన్మార్కు, నార్వే, హాలెండు, లగ్జంబర్గు దేశాలు ఫ్రాన్సులో ఇంగ్లీషు ఛానల్ రేవుపట్టణం బొలోను జర్మనులచే ఆక్రమించ బడినసంగతి పాఠకులకు తెలిసినదే వుంది.

బెల్జియం దేశపురాజు అస్త్రసన్యాసం చేసినా మంత్రివర్గం, సైనికులు మిత్రమండలితో కలసి జర్మనీతో యుద్ధము సలుప నిశ్చయించినారని యూ, ఉత్తర ఫ్రాన్సునందును, బెల్జియంలోను, తీవ్రముగ యుద్ధం జరుగుచున్నదని గతవారం తెలుపబడినది. ఈవారంలో బెల్జియం దేశం కూడ పూర్తిగ జర్మనీకి ఆహుతి ఆయింది. ఫ్రాన్సులో ఉత్తరమున సోమునదికి ఉత్తరానవుండే సముద్రతీరప్రాంతాలుకూడ జర్మనుల స్వాధీనమైనాయి. దీంతోకూడ యుద్ధముయొక్క ప్రథమాంకము పూర్తి ఆయింది. ఇకన బ్రిటను, ఫ్రాన్సుల పై దాడితో రెండవఅంకము ఆరంభం కావలసివుంది.

### మిత్రమండలి సేనలు ఛేదింప బడుట:

జర్మనీ బహుచాకచక్యంగా బెల్జియంయుద్ధంలో ప్రవర్తించింది. జర్మను సేనలు ఫ్రాంసులోనికి చొచ్చుకొనివెళ్ళి ఆబివిల్లీ అనే పట్టణం వరకు ఆక్రమించు కొన్నాయి. దీనితోకూడా ఉత్తరాన ఫ్రాంసు, బెల్జియం రంగములందుండే మిత్రమండలి సైన్యాలు జర్మనుసేనలచేత వేరు చేయబడ్డాయి. ఒకరికొకరు సహాయం చేసుకో లేక చిక్కుబడ్డారు.

దక్షిణాన : జర్మనులు ఆబివిల్లీ, అమీన్సు, అరాసు పట్టణాలను ఆక్రమించుకొని బులోను రేవుపట్టణాన్ని స్వాధీన పరుచుకొన్నారు. కలే రేవుపట్టణాన్ని ముట్టడించారు.

### కలే రేవుపట్టణం:

కలేరేవుపట్టణాన్ని జర్మనులు ముట్టడించి ఒక గంటలోగా లోబడవలసిందని బ్రిటిషు సేనానికి సందేశం పంపారు. కాని ఇందుకు బ్రిటిషు సేనాని అంగీకరించక ప్రతిఘటించాడు. 4 వేల మంది సైనికులు 4 రోజులు అసంఖ్యాకమగు శత్రునివహానికి లొంగియ్యకుండా కలేను రక్షించినారుట. 4 వ తేదిన బ్రిటిషుప్రధాని కామన్సు సభలో కలే ముట్టడిని గురించి తెలుపుచు 4 వేల మందికిగాను గాయాలు తగులనివారు 30 మంది మాత్రమే కలేనుండి బ్రిటనుకు తిరిగివచ్చారని, మిగిలిన 3770 మంది గతేమైందో తెలేదని తెలిపినాడు.

★

### ఫ్లాండర్సు యుద్ధం:

ఉత్తరాన మిత్రమండలివారికిని జర్మనులకును ఫ్లాండర్సు రంగమందు తీవ్రముగ యుద్ధం కొద్ది రోజులుగా జరుగుచున్నది. ఫ్లాండర్సు కొండలు చాలా ప్రాముఖ్యస్థానం ఆక్రమిస్తున్నాయి. వీటిని పట్టుకోవాలని జర్మనుల ప్రయత్నం. వీటిని ఆక్రమిస్తే అచ్చటనుండి ఫిరంగులను కాల్చి ఎగువనుండే మిత్రమండలి సేవలను ఛేదింపవచ్చు. గత మహాసంగ్రామంలో కూడా యీ కొండలు చాల ముఖ్యస్థానముగా వుండినాయి.

ఈ రంగంలో జర్మనుసైన్యాలు కుడిపైపునుండి, వెనుకనుండి మిత్రమండలిసైన్యాన్ని ముట్టడించాయి. 400 పాయుధ శకటములుగల డివిజను వంతున 9 పాయుధ శకటముల జర్మను డివిజనులు మిత్రమండలి సైన్యాలపైకి వచ్చినాయి. బెల్జియంలోని సైన్యానికిని, ఫ్రాన్సులోని ఫ్రెంచి సైన్యానికి ఏలాటి సంబంధంలేకుండా, రాకపోకలన్నీ అరికట్ట బడ్డాయి. ఫ్రాన్సులో నుండి ఆహారము, ఫిరంగులు, మందుగుండు సామగ్రి సప్లయిరాకుండా చేయబడింది. ఈ పరిస్థితుల్లో మిత్రమండలి సైన్యాలు రెండు వారాలు తీవ్రముగ పోరాటం సలిపినాయి.

ఈరెండువారాల్లో బెల్జియంసేన 8 లక్షలకుగాను 5 లక్షలు హతమైపోయింది. తే 27 దీన బెల్జియంరాజు నాయకత్వాన యీ రంగంలో యుద్ధంచేస్తుండిన సైనికులను బెల్జియం రాజు అస్త్రసన్యాసం చేయమన్నాడు. బెల్జియనులు యుద్ధంమానుకోవడంతోకూడా మిత్రమండలిసేనల స్థితి ప్రమాదకరంగా యేర్పడింది. తలవని తలంపుగా గావించబడిన బెల్జియంరాజు నిర్ణయమువలన యేర్పడిన పరిస్థితులను ఎదుర్కొనడం కష్టమైపోయింది. మిత్రమండలి సేనలు ఒంటరియై పోయినాయి. 30 మైళ్ళ సముద్రతీర ప్రదేశాన్ని అవ్యవధిగా రక్షించుకోవాల్సి వచ్చింది.

ఎప్పుడైతే బెల్జియంరాజు అస్త్రసన్యాసం చేశాడో జర్మనీ మరొక 10 లక్షలమంది సైన్యాలను దూకించింది. బెల్జియం మంత్రివర్గం రాజుగారి వుత్తర్వును ధిక్కరించి మిత్రమండలివారితో పోరాడినా లాభంలేకపోయింది.

యుద్ధరంగాన్ని సంకుచిత పరచుకొనుటవలన తమసంఖ్యాలోపమును భర్తీ చేసుకొన మిత్రమండలిసైన్యం ప్రయత్నించిందిగాని లాభం లేకపోయింది. కడకు యుద్ధాన్ని విరమించి బ్రిటనుకు వెళ్లిపోడానికి నిశ్చయించుకొన్నాయి ఇందుకే డన్‌కర్కు రేవుపట్టణానికి వెళ్లాయి. జర్మనుసేనలు డన్‌కర్కుమీదికి రాకుండుటకై డన్‌కర్కు చుట్టూ రెండు మూడు మైళ్లు జలమయం చేయబడింది. 24 గంటల్లో 35 మైళ్లు వెనక్కు వెళ్ళవలసి వచ్చిందట.

### డన్‌కర్కునుండి సేనలు వెళ్లిపోవుట:

మిత్రమండలిసేనలు మిట్టప్రదేశాల్లో ఫిరంగులనుంచి శత్రుసేన నెదుర్కొనిసిద్ధంగా వుండిరి పట్టణంచుట్టూ జలమయం చేయబడింది. లాకులు తెరచి నగరవీధులన్నీ నీటితో నింపివేయబడ్డాయి. ఈ కారణాలవల్ల టాంకీలతో జర్మనుసేనలు నగరంలోకి వెంటనే ప్రవేశింప వీలులేకపోయింది. యీవిధంగా జర్మన్ సేనల దాటిని ప్రతిఘటించి మిత్రమండలిసేనలు రేవునందుండే స్టీమర్ల నెక్కి డన్‌కర్కు వదలివెళ్లాయి.

డన్‌కర్కు రేవునుండి మిత్రమండలిసైన్యాలు 335 వేలమంది బ్రిటనుకు సురక్షితంగా చేరారని బ్రిటిషుప్రధాని తెలుపుచున్నాడు. వీరు శత్రువుల చేతుల్లో పడకుండా తప్పించుకొని వెళ్లడం చాల ప్రశంసనీయమైందని బ్రిటిషువారు చెప్పుకొనుచున్నారు.

జర్మను విమానాలు అసంఖ్యాకంగా డన్‌కర్కు రేవుపై తాండవమాడ మొదలుపెట్టాయి. సముద్రతీరంపై గుండ్లవర్షం కురిపించాయి.

బ్రిటిషు విమానాలుజర్మను విమానాలను ఎదిరించాయి. జర్మనులకు అమితభయం కలుగునటుల చేయబడుటచేత, ఒక్కొక్క బ్రిటిషు విమానానికి 4 జర్మను విమానాలు పడగొట్ట బడుటచేత ఇంగ్లండుకు సైనికులను తీసుకొని వెళ్ళుచుండిన ఓడలపై జర్మనులు ఆ తరువాత బాంబులు వేయ లేక పోవుటవలన మిత్రమండలి సైన్యాలు సురక్షితంగా వెళ్ళగలిగాయని బ్రిటిషు ప్రధాని అంటున్నాడు.

220 చిన్న యుద్ధనావలమీదను 650 ఇతర ఓడలమీదను, 600 చిన్న పడవలు మీదను యీ సేనలు ఇంగ్లాండుకు చేర్చబడ్డాయి. బెల్జియం నుండి సైనికులను బ్రిటనుకు తెప్పించుట మహాద్భుత కార్యమని, దీనికి కారణం బ్రిటిషువారి బల పరాక్రమాలేనని బ్రిటిషు ప్రధాని ప్రశంసించినాడు.

బ్రిటిషు ప్రధాని లెఖ్ఖప్రకారం బెల్జియంలో మృత్యువైనవారు, గాయపడినవారు, జాడతెలియనివారు మొత్తం 30 వేలమంది.

### డన్‌కర్కు రేవు జర్మనుల వశమైంది:

డన్‌కర్కు ప్రాంతాన్ని సంరక్షిస్తుండిన మిత్రమండలి సైనికులు, నావికులు, నగరాన్ని 4 తేది రాత్రితో పూర్తిగా ఖాళీచేశారు. ఈ నగరం జర్మనుల స్వాధీనమైంది. ఈరేవు జర్మనీ వశమగుట వలన సోమునది వరకుండే బెల్జియం, ఫ్రాన్సు రాజ్యాలలోని ఇంగ్లీషు ఛానల్ రేవులన్నీ జర్మన్ సేనల వశమైనవన్నమాట.

కొరవ 7-వ పేజీలో

# సువమంగళి:

## చిన్న చిన్న లోపాలున్నా చిత్రము బాగనే ఉంది-

—జి. సత్యనారాయణ.

ఏ రాహుకాలంలో ప్రవేశించిందోకాని, ఈ 1940 వ సంవత్సరము, అన్నీ తలక్రిందులుగానే యున్నవి. యూరపులో యుద్ధము చావుబ్రతుకుల్లో యున్నది; సత్యాగ్రహము ఈరోజా, రేపా యంటున్నది; రెండడుగులు ముందుకు వెళ్లిన మన సినిమా పరిశ్రమ చప్పబడింది. ఈ అయిదుమాసాల్లో రిలీజయిన చిత్రాలను చూస్తే, యింతటితో తెలుగు చిత్రాలకు నీళ్లు వదలుకో వలయునా అని యనిపించింది. కాని, సుమంగళి దర్శనము ఈ దారిలోని నీటిమడుగులా కనుపించింది. ఇది వాహినివారి రెండో చిత్రము.

వాహినివారు "వందేమాతరమ్"ను తీసి ఆంధ్ర సినిమారంగములో క్రొత్త పోకడలను చూపించారు. అదియు నేక తికమకలతో నిండి యున్నప్పటికీ, మంచి చిత్రమనిపించుకోవటమే కాకుండా, వాహినివారి భవిష్యత్తును సూచించింది. దాంతో వారిప్పటికైనా ఆంధ్రులోకానికి మంచి చిత్రాలను సమర్పించుకోగలరని నమ్మకము స్ఫురించింది అనుకున్న విధంగానే, సుమంగళిని వందేమాతరములను తికమకలను విడచిపెట్టి, ఆంధ్రసినిమా పరిశ్రమ వెనుకబడలేదనిపించింది. ఇందులో కొన్ని ఘట్టాలు పేరెన్నికగన్న హిందీ చిత్రరాజములతో తులదూగు చున్నాయి. కావున, భవిష్యత్తులో వాహినివారు హిందీచిత్ర రాజములతో సరిసమానమైన చిత్రములను తీయగలరని ఆశను ఆంధ్రదేశములో కలుగజేసింది.

ఇంక చిత్రములో లోపాలోపములను విచారించుదాము:—

### కథానిక:

అందరివలె కాకుండా, వాహినివారు కథల నెంచుకోవటములో గూడ క్రొత్తదారిని త్రొక్కుచున్నారు. సుమంగళిని చూడంగనే, ఇదియొక కథా లేక రెండా? సమస్యను పరిష్కరించారా లేక ఆత్మత్యాగాన్ని చాటారా యని, సంశయము కలుగుతుంది. దూరదృష్టికి, సుమంగళిలో కథకు వ్యక్తిత్వము లేదనాలి. రెండు కథలను జోడించినట్లు తోస్తుంది. పార్వతీ సరస్వతులు సత్యాన్ని ప్రేమించారు; కాని, సత్యం సరస్వతిని ప్రేమించాడు. ఇది తెలిసి పార్వతి ఆత్మత్యాగ మొనరించితుంది... ఈవిధంగా కథను అవలోకించుతే, పంతులు, విధవావివాహపు ఉపన్యాసములు, పిచ్చయ్యవాళ్లు అనవసరము లౌతాయి. విధవావివాహపు సమస్య ముఖ్యంగా తీసుకుంటే, వివంతు వివాహము కొరకు యొక ఉన్నత్యమైన ప్రేమమూర్తి యగు ముగ్ధ ఆత్మార్పణ మొనరించుట అవ్యక్తంగా కనుపించుతుంది. దానివల్ల సమస్యకు అడ్డుతగులుతుంది. ఈవిధంగా రెండుకథలు జోడించుటవల్లనే కథ తికమకలు బడింది.

పార్వతి పిచ్చయ్యతో వివాహమునకు అంగీకరించలేక మరణించినదా లేక సత్యం సరస్వతుల వివాహము కొరకు త్యాగమొనరించినదా యని సందేహము కలుగుతుంది. వివాహము జరుగనున్నప్పుడు మరణించుట వల్ల మొదటి సంశయము ధృఢమవుతుంది. అప్పుడు పార్వతి త్యాగము రాణించదు. గోపాలకృష్ణయ్య కఠినమనస్సు కరుగుటకే పార్వతి ప్రాణాన్ని కల్పించినట్లుగాతోస్తుంది. లేకుంటే పార్వతి ఆత్మహత్య యొనరించుకొనవలసినంత అవసరము గోచరించదు. పార్వతీ సరస్వతులు యొకరినొకరు ప్రేమించుకొని, యొకరికొరకు మరియొకరు త్యాగమొనరించుటకు సిద్ధపడ్డారు. ఇరువురలో యింత అన్యోన్యత యున్నప్పుడు, పార్వతి నిష్కల్మష ప్రేమ Tragedy గా మారకుండా, విధవావివాహపు సమస్య తీర్పుటకు, సరస్వతి ప్రేమ నిష్ఫలము కాకుండా యుండుటకు యిరువురను సత్యము వివాహమాడి యుండిన బాగుండేది. పార్వతీ సరస్వతులమన్న యున్న యుదార ప్రేమవలన యిది క్లిష్టమైన సమస్యకాదు. అందువల్ల కథకేమియు లోపము రాదు! అవసరంగా, విధవా వివాహపుసమస్య తీర్పు సందర్భమున గోపాలకృష్ణయ్యమనస్సు కరుగుటకు ప్రబల కారణము చూపించవలసి, నిష్కల్మష ప్రేమమూర్తియగు యొక బాలిక ప్రాణాన్ని బలియొనరించినందువల్ల కథ రాణించలేకపోయింది. ఈ నరబలి లేకుండా యుంటే సుమంగళి యింకా బాగుండేది.

నాగేశ్వరరావు మరణించగనే తండ్రితో సమానుడైన పంతులుగారిని వదలి, యున్నదు యెరుగని మేనత్త గారింటికి సరస్వతివెళ్లి అచ్చట విద్యాధికురాలై యుండికూడ గయ్యాళిగంగమ్మ మాటలకులోబడి గాజులు పగులగొట్టుకొని, ఇల్లలుకుట బాగుండలేదు. ఆమెకు వారింటిలో అయిష్టంగా యుంటే పంతులుగారున్నాడు కదా! అలాంటప్పుడు సరస్వతి యింతదూరము వచ్చి యెందుకు అష్టకష్టాలు పడవలసివచ్చిందో! బహుశా, పార్వతీ సరస్వతులకు సన్నివేశము కలిగించుటకై అవ్యక్తంగా సరస్వతిని ఈపల్లెకొంపకు తీసుకవచ్చినట్లు గోచరించుతుంది.

కథలోయింకా చిన్న లోపములున్నాయి. రాత్రివేళ వంటరిగా పార్వతివెళ్లి రాగలిగిన పోలీసు స్టేషనునుండి పెండ్లింటికి చేరుటకు పోలీసువారు కారులో Over Speed తో యెందుకు ప్రయాణము చేయాలసి వచ్చింది? పెండ్లికి పది నిమిషముల ముందువరకు పెండ్లికొడుకు పిచ్చయ్య బ్రహ్మముతో యెలాయుండగలిగినాడు?...... ఇలాంటి చిన్నలోపములను సవరించుకొని వుంటే కథయింతో బాగుండి యుండేది.

### నటీనటులు.

ఇందులో పార్వతీ సరస్వతులకు చాలవరకు సమాన అవకాశములున్నవి. సాధ్యమైనంత వరకు యిద్దరు బాగానే తృప్తిచేశారు.

మాలతి పార్వతిపాత్రను బాగా నటించింది. ఇందులో మాలతిదే ప్రథమస్థానము. ఈమెకిది ప్రథమ పర్యాయమనికూడ తోచకుండ జేసింది. "మాల" లేనిలోపము "మాలతి" తీర్చిందనుటలో సందేహము లేదు. ప్రథమ ఫిలింలోనే తారామండలాన్ని అలంకరించగలిగిన మాలతి, కృషిచేస్తే అనతి కాలంలోనే ప్రథమస్థాన మలంకరించుటకు సందేహమేముంది? కాని మాలతి, ప్రస్తుతకొందరి తారలవలె డైరెక్టర్లను మార్చకుండా, రెడ్డిగారి చేతుల్లోనే యుండి కొద్దిలోపములను సవరించుకోగలుగుతే ఆంధ్రుల ఆశయము ఈడేరుతుంది.

"వస్తాడే - మాబావ..." అని పాడుతూ, నటించుతూ చేసిన మాలతి సహజనటన హృదయానందంగాయుండి, అనేకాలము లతతోపాటు ప్రేక్షకులనుగూడ యూగించింది. మామిడిచెట్టు క్రింద మాలతి మూతి విరుపులు, బావిమొద్ద యొనరించిన యుత్తి పోతుపులు, సత్యం సరస్వతిని ప్రేమించు చున్నాడని తెలిసినపుడు మాలతి యొనరించిన ఈర్ష్యా పూరితమైన హృదయములో భావస్ఫురణ, చివర మరణశయ్యమీద బాధను చూడంగనే విచార మల్లా ఆనందంగా మార్చుకోవటము, యెంతో ప్రకృతి సిద్ధంగాయుండి. మాలతి వుత్తమ నటీమణి యని నిరూపించుతుంది. సంగీతముగూడ శ్రావ్యంగానేయుంది. కష్టపడితే భవిష్యత్తులో, మాలతి ఆంధ్రుల యేకైక తారయనుపించుకోగలదు.

రెండోస్థానము కుమారికి యివ్వాలి. ఈమె అమ్మలో కాలుపెట్టి, ఊపలో పైకెగిరి, సుమంగళిలో క్రిందపడకుండా తారామండలానికి చేరుకొనుటకు రెడ్డిగారికృతజ్ఞమని చెప్పాలి. కుమారి అవకాశమున్నంతవరకు బాగానే నటించింది. అక్కడక్కడా సవరించుకోదగ్గ లోపాలున్నాయి. కుమారి, రైలులో మేనత్త తనకు పూర్వచరిత్ర చెప్పుచున్నప్పుడు చేసిన భావ ప్రకటన కొనియాడదగియుంది.

సుమంగళి చూడంగనే పంతులకొరకు నాగయ్య సృష్టింపబడినాడా లేక నాగయ్య కొరకు పంతులు సృష్టింపబడినాడాయని తోస్తుంది. నాగయ్య సినిమారంగములో ఆరితేరిన నెయ్యి. ఈతడు డ్రామాకు ముందిచ్చిన వుపన్యాసము, సీనిమాలోని ప్రేక్షకులనే కాకుండా, హాలులోని ప్రేక్షకులను గూడా, యెంతో భావయుక్తంగా యుండి, ఆకర్షించింది. పంతులుపాడిన గీతము దేహాన్ని పులకరింప జేసింది. మిగత పాటలు బాగుగానే యున్నవి.

Hero గా నటించిన గిరికి Personality యేమీ బాగుండలేదు. ఆచిన్ని కండ్లు, గరుత్మంతుని ముక్కు స్క్రీనుకు తగియుండలేదు. ఈ పాత్రకు వ్యక్తిత్వమే గోచరించదు. మన కర్మమేమోకాని, తగిన Hero చిక్కుటలేదు. మొత్తముమీద ఈతని పాత్ర అసంతృప్తిగా యుంది.

గోపాలకృష్ణయ్య, నాగేశ్వరరావులు బాగుగానే యున్నారు. నాగేశ్వరరావు పంతులతో చెప్పిన సంభాషణ, గోపాలకృష్ణయ్య పిచ్చికోపము కొనియాడ తగియున్నాయి. పిచ్చయ్య చార్లీ మాదిరి యున్నాడు. ప్రమేయము లేదు. గంగమ్మ నిజంగా రూపంలో, నటనలో గయ్యాళిగంగే! జమీందారు పాత్ర చంద్రశేఖరానికి తగియుండ లేదు. ఇంకొకటయితే సన్నగా యుండేదేమో! అయినా, నిరుత్సాహపడ నవసరంలేదు.

చిత్రములో కొనియాడ తగిన సన్నివేశాలు కొన్ని యున్నాయి. భావిమొద్ద జరిగిన అమ్మలక్కల ముచ్చట్లు నిత్యము జరుగుచుండు కదా యవే! అదియెంతో సహజంగాయుంది. మామిడిచెట్టుమొద్ద జరిగిన పార్వతీ సత్యాల సంభాషణ, సంగీతము, కొంటెచేష్టలు బాగుగా యున్నవి. బుడిబుక్కలవాని ఆట, నాగేశ్వరరావు. పంతులు సంభాషణ, పార్వతి తిరుగుబాటు, ఆమె మరణశయ్య ఘట్టాలు కొనియాడతగినవి. కాని పెద్దలను పంతులు నాగేశ్వరరావుల యొద్ద, కాబోవు వధూవరులకు సరస్వతీ సత్యముల ప్రేమ సంభాషణలు అసందర్భంగా యుంది. సత్యము యిచ్చిన ప్రేమమీది వుపన్యాసము తొలగించిన యెంతో బాగుండేది.

సౌండు రికార్డింగ్, ఫోటోగ్రఫీ బాగుగా యున్నవి. కొన్నిచోట్ల ఫోటోగ్రఫీ చాలా బాగుంది.

మొత్తముమీద సుమంగళిలో చిన్నలోపము లున్నా ఫిలిము బాగున్నది. బి. యన్. రెడ్డిగారు యెంతో కొనియాడ తగియున్నారు. అందరి డైరెక్టర్లవలె కాకుండా రెడ్డిగారిలో యొక మానవశక్తి గోచరించుచున్నది. రెడ్డిగారు అనవసరంగా పాతతారల కొరకు ప్రాకులాడి మార్కెటు రేటు పెంచకుండా, ఇదివరకు పూర్వానుభవము లేని కుమారిని, సినిమారంగానికి క్రొత్తయగు మాలతిని బాగా సానబెట్టి వృద్ధికి తెచ్చారు. సుమంగళితో రెడ్డిగారు ఆంధ్రులోకానికి యిరువురు క్రొత్త తారలను యిచ్చినారు. అందువల్ల వారు కొనియాడ తగియున్నారు. రెడ్డిగారిని చూచిఅయినా, యితర డైరెక్టరులు క్రొత్త తారలను సృష్టించుటకు పూనుకొని ఆంధ్రసినిమా రంగాన్ని వృద్ధిపరచాలి.

## దక్షిణాఫ్రికా భారతీయుల దుస్థితి

ట్రాన్స్వాల్ ఇండియన్ కాంగ్రెస్ జాతీయపక్ష నాయకుడయిన డాక్టరు వై. ఎం. దాదూ గారు తంతిద్వారా ఒక ప్రకటన చేశారు. నేటాల్, ట్రాన్స్వాల్ రాష్ట్రాలలో యూరోపియనుల నివాస ప్రదేశాలను ఏషియాటిక్ ప్రజలు ఆక్రమిస్తున్నట్లు ఆరోపణపై ప్రభుత్వం విచారణ కమీషన్ నియమించినందుకు భారత జాతీయపక్షం తీవ్రంగా నిరసిస్తూ స్వదేశమంత్రికి తెలియపరిచినట్లు డాక్టరు దాదూ గారు ప్రకటిస్తున్నారు.

విచారణ కమీషన్‌ను నియమించడంలో ఉద్దేశం, ఈరెండు రాష్ట్రాలలో భారతీయ ప్రజల నివాస, రాకపోకల, వర్తకహక్కులను యింకా తొలగించడానికే అనీ, భారతీయులను వేరుచెయ్యడానికి ప్రస్తుతప్రభుత్వం వెనకటి ప్రభుత్వాల పద్ధతినే సాగించవలెనని వుంటే ఇందువల్ల భారతీయసంఘం అంతకంతకూ అంతరించే పరిస్థితి ఏర్పడుతుందనీ భారతీయసంఘం యిక్కడ మర్యాదగా జీవించాలంటే యిలాంటి అవమానాలకు లోబడకూడదనీ డాక్టరు దాదూగారంటున్నారు.

——

## ఆంధ్రసిమెంటు కంపెనీ పనివారల సంఘం

ఈ నెల 1 వ తేదీన పైసంఘం బెజవాడలో సమావేశమై యీక్రింది తీర్మానములు గావించింది.

యుద్ధం ప్రారంభమైన 9 నెలలనుండి ఆహారపదార్థముల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, యింతవరకూ సిమెంటు కంపెనీవారు యీవిషయమై తలపెట్టలేదు, కాబట్టి నెలకు రు 50 లకు పైన జీతము పుచ్చుకొనువారికి రూపాయకు అణాచొప్పునను రు 25 లకు, పైవారికి రెండణాల వంతునను, రు 15 లోపలవారికి పావలా వంతునను, అలవెన్సు నిర్ణయించాలని కోరుచున్నాము. కూలీలకు గూడా రు 0-6-0 ల నుండి 0-8-0 లకు రోజు జీతం హెచ్చించాలి,

ఫ్యాక్టరీ కూలీలందరికీ కంపెనీవారు ప్రావిడెంటు ఫండు వసతి కలుగజేయాలి.

టి. వెంకటేశ్వరరావు,
అధ్యక్షుడు.

——

## ప్రకటన.

మద్రాసు కోడంబాకం ఇండస్ట్రియల్ స్కూలులో చేరదలచుచున్న విద్యార్థులు 7-6-40 తేదిలోగా అప్లికేషనులు పంపుకొనవలెను. భోజనము, నివాస ముచితము. అప్లికేషను పెట్టువారు 12—15 సం॥ మధ్యవయస్సుగలవారై, 5వ క్లాసు ప్యాసైయుండవలెను. పై స్కూలు తే 17—6—40 న తెరువబడును.

లేబూరు సుబ్బరామిరెడ్డి,
కార్యదర్శి.

# భారతదేశానికి స్వాతంత్ర్యమివ్వండి:

—హెచ్. యన్. బ్రెయిల్స్ ఫర్డ్.

సుప్రసిద్ధ ఆంగ్లరచయిత బ్రెయిల్సుఫర్డు నేటి భారత సమస్యనుగూర్చి "న్యూస్టేట్సుమన్ అండ్ నేషన్" అనే పత్రికలో యిలా వ్రాశారు.

మనమీ యుద్ధంలో గెలవాలంటే రాజకీయ పరిష్కారమే గాకుండా, రాజ్యాంగ తంత్రంకూడా కావాలి. భారతదేశము యీ సమస్యలో ముఖ్య స్థానము వహిస్తుంది. అక్కడ మనంచేసే పనుల మీదనే మనదేశ గౌరవం ఆధారపడి వున్నది. కొద్దిరోజుల్లోనే మన రాయబారాల ఫలితంగా గాంధీగారు భారతదేశం తనకు తృప్తికరంగా ఉండేటట్లు బ్రిటను చేతుల్లోనుండి స్వాతంత్ర్యం పొందిందని ప్రపంచానికంతకు వెల్లడించాడనుకోండి. అప్పుడు మానవజాతిఅంతా మనలగూర్చి ప్రస్తుతం అనుకునే ధోరణి సంపూర్ణంగా మారుతుంది. అప్పుడు మన పెద్ద ఆదర్శాల మాటలు నమ్మవచ్చని ప్రతివాడు అంటాడు. మాస్కో కూడా మనలనికమీద 'సామ్రాజ్య యుద్ధాలోలురు' అని అంటానికి తటపటాయిస్తుంది.

## ప్రతిష్టంభన.

ఇప్పుడు మనం యిండియాలోని ప్రతిష్టంభనను తొలగించలేకున్నామంటే దాని కారణము మనము యెన్నటికీ నెరవేరని షరతొకటి తగిలించడమే. హిందువులు మహమ్మదీయులు ఒడంబడిక చేసుకోవాలంటే కాంగ్రెసు ముస్లింలీగు ఒడంబడిక చేసుకోవలెననే అర్థాన్ని వైస్రాయిగారు చెప్పారు. ఇది జరిగేదికాదు. మహమ్మదీయులు ఒక ప్రత్యేకజాతివారని, వారికి ప్రత్యేకంగా రాజ్యమేర్పడాలని ముస్లింలీగు యిప్పుడు గట్టిగా పట్టుపట్టియున్నది. ఈ ఆలోచన ఆక్షేపణీయమైందే గాకుండా, ఆచరణీయం కూడాకాదు. అయితే దీనినొక బ్రహ్మాండమైన అడ్డుగా పెట్టటానికి బాగా ఉపయోగిస్తుంది.

## మతకక్షలు.

అసలు భారతదేశంలోని శాసన సభలలో రైతు - జమీందారు; షాహుకారు - రైతు; ధనికులు - పేదలు అనే వర్గదృక్పథంతో శాసనాలు చేస్తున్నారు. మతదృష్టి లేనేలేదు. పైనా ఆటీ రక్షణ పాకిస్థాన్ వివాదాలను లేవదీసేదల్లా స్వంత పలుకుబడి సంపాదించుకోవాలనే దేశీయ పురోభివృద్ధి విముఖులే. భారతదేశంలో మతసామరస్యంవుంటే మనకిందు నిలువ తావు లేదని, మనఅధికారాన్ని నిలబెట్టుకొనుటకై మతకలహాలు పోషించుకుంటూ వచ్చాము. కాని యిప్పుడు పరిస్థితులన్నీ తారుమారైనవి. అధినివేశ స్వాతంత్ర్యం యివ్వవలసిన సమయం వచ్చింది.

## స్వాతంత్ర్య నిర్ణయం.

భారతదేశ స్వాతంత్ర్య రూపాన్ని నిర్ణయించుకునే అధికారం భారతీయులకే వదలాలి. ప్రస్తుత వివిధ రాష్ట్రాలలోని శాసనసభ్యులచే యెన్నుకోబడిన ఒక కార్యసంఘము చిత్తుచట్టాన్ని తయారుచేసి, శాసనసభ్యుల సమావేశానికి అందజేయాలి. వారు దాన్ని అంగీకరించుటో, త్యజించుటో జరిగిన పిదప, దానిని యుద్ధం ముగిసిన సంవత్సరంలోగా అమలు జరపాలి. వెస్టుమినిస్టరు శాసనములో నిర్వచించినట్లు అధినివేశరాజ్యపు హోదాను భారతదేశానికి సాధ్యమైనంత త్వరలో నిస్తామని, యిప్పుడు బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించాలి.

పైవిధంగా రాజ్యాంగాన్ని నిర్ణయించుకొనుటలో మైనారిటీ హక్కులకు తగినరక్షణ ముండాలి. సంఖ్యంగా తమ్ము తాము రక్షించుకుండే స్థితికి వచ్చేంతవరకు, రక్షణయేర్పాటుల అజమాయిషీ మనదైయుండాలి.

ఈవిధానమును ముందు బ్రిటిషుయిండియాకు వర్తింపజేసిన తర్వాత భారతదేశసంస్థానాలిందులో చేరవచ్చు.

ఈ షరతులన్నిటితో ప్రస్తుతం మనమున్న కష్టాల్లో భారతదేశ స్నేహాన్ని సంపాదించవచ్చు. అట్లాకాకుండా ఆదేశాన్ని విధలించి బాధించతలచుకుంటే, మన ఆశయాల పరీక్షలో మనం ఓడిపోతాము.

---

## నెల్లూరు జిల్లా వ్యవసాయ కూలీల సంఘం.

జిల్లావ్యవసాయ కూలీలసంఘ కార్యవర్గ సమావేశం 8 తేదీ సాయంత్రం నెల్లూరుజిల్లా కాంగ్రెసు మందిరమున జరుగును. సభ్యులెల్లరు రావలెను.

కోరాబత్తిన చిన్నయ్య,
కార్యదర్శి.

# శాసనోల్లంఘనము.

## యుద్ధసమయమున పనికిరాదు.

ఈక్రింది విధముగా గాంధీమహాత్ముడు శాసనోల్లంఘనము ప్రస్తుతం కూడదంటూ హరిజన పత్రికలో ఒకవ్యాసం యిటీవల వ్రాశాడు.

"బ్రిటిషు ప్రభుత్వంవారు తమంతట తాము భారతదేశమును స్వతంత్ర దేశముగా ప్రకటించుటనో, భారతదేశమునకు స్వయంనిర్ణయసూత్రము వర్తింపజేయుటనో, మిత్రమండలివారి ముంగిలిలో జరుగుచున్న యుద్ధము తగ్గువరకు, ధీనస్థితి యిచ్చుటకంటే స్పష్టముగా తెలియువరకు మనము వేచియుండవలెనని నా యుద్దేశ్యము. బ్రిటను నాశనము కావలెనని, మనకు స్వతంత్రము రావలెనని మనము కోరము. అది అహింస అనిపించుకొనదు. మనకే నిజముగా శక్తియున్నచో దానిని ప్రదర్శించుటకు మనకు అనేక అవకాశములు కలుగును. ఎవరు జయించినను సంధి జరుగవలెనుగదా! అప్పుడుమనబలమును మనముప్రదర్శింతము.

మనదేశంలో చాలామంది దౌర్జన్యరాహిత్యముతో చెరలాట లాడుచున్నారు. శాసనోల్లంఘనమన్న చెరసాలలను నింపుట మాత్రమే యని వారియుద్దేశ్యము. నిజమైన నిర్మాణకార్యక్రమము లేకుండ, అధర్మముగా ప్రవర్తించువారి రొండల సద్భావము లేకుండ చెరసాలలను నింపుట దౌర్జన్యమే. సత్యాగ్రహమున కిది విరుద్ధము. కాబట్టి అహింసద్వారా భారతదేశము తన గమ్యస్థానము చేరవలెనను వారందరును, శాసనోల్లంఘన విషయమై ఆలోచించకుండ, తమకుగల శక్తిసామర్థ్యముల నన్నిటిని నిర్మాణ కార్యక్రమమునకు వినియోగించవలెను."

# ఇండియాలో యుద్ధసన్నాహము.

ఇండియాలో జరుగుచున్న యుద్ధసన్నాహముల గురించి యిండియా సెక్రటరీ జెట్లండు లార్డు యిటీవల యీక్రింది విధముగా ఉపన్యసించాడు.

ప్రస్తుత యుద్ధపరిస్థితుల దృష్ట్యా మనము భారతదేశంలో యెట్టి సన్నాహములు జరుగుచున్నవో చెప్పవలసినంత వరకు చెప్పుట నా ముఖ్యోద్దేశం. కొన్ని రహస్యాంగములు తెలుపము. అవి శత్రువులకు తెలిసిపోవును. గడచిన 9 నెలలనుండి సైన్యమును హెచ్చించుటకు తగిన ప్రయత్నము చేశాము.

ఈదేశములో సైన్యమునకు తగినంత జనసంఖ్య చిక్కదను లోటులేదుగాని నేటియుద్ధంలో కేవలం బలగం చాలదు. ఆయుధసామగ్రి అత్యవసరము. వీటిని సమకూర్చుటకు తగిన ప్రయత్నము గావించాము. ఆర్డినెన్సు మాస్టరు జనరలు యాజమాన్యమున నడుచుచున్న ఫ్యాక్టరీలు 9 నెలల ముందటికన్న ఆరేడింత లెక్కువగా తయారు చేయుచున్నవి. ఫిరంగిగుండ్ల తయారు 20 రెట్లు అధికమైనది. 40 వేల రకముల యితరసామగ్రిని జాగ్రత్తగా నిలువ చేయుచున్నాము. ఈ 40 వేలలో 20 వేలు యీదేశంలోనే తయారవుచున్నది.

## లక్షమంది సైనికులు.

సైన్యమును హెచ్చించవలసిన ఘడియలువచ్చినవి. యుద్ధం మొదలుపెట్టిన తర్వాత 53 వేలమందిని చేర్చుకున్నాము. ఇంకను టాంకుల దళము, మోటారు దళములు, కాల్బలము, తుపాకుల సేవల దళములు సృజింపవలెను. గనుక యింకా ఒక లక్షమంది భారతీయులను చేర్చుకొనవలెను.

వర్తకపు టోడలకు సహాయముగా పోవు నావలుగాక, జలాంతర్గాములను ధ్వంసముచేయు నావలు చాలా తయారైనవి. మనరేవులకు భయం లేకుండ యివి కాపాడగలవు.

అన్నిటికన్న విమాన దళముల విస్తరణమే చాలా కష్టంగానున్నది. ఇచ్చట విమానముల నడుపువారు తగినంతమంది చిక్కరను, యంత్ర నిపుణులు దొరకుట కష్టము. అయినప్పటికీ 4 రెట్లు విమానదళమును వృద్ధి చేయ ప్రయత్నిస్తున్నాము.

సైనికాధికార పదవులకు అర్హులగునట్లుగా భారతీయుల తయారు చేయుటకుగాను బెల్గాం, డెహరాడూనులలో శిక్షణకేంద్రము లేర్పరుపబడినవి. అందుత్తీర్ణులైనవారికి అధికారపదవులిస్తురు.

ఈయుద్ధ సన్నాహములకొరకు సైనికవ్యయము హెచ్చించవలసివచ్చును. ప్రజలీవ్యయభారమును సంతోష పూర్వకముగా భరింతురని నమ్ముచున్నాను.

---

## ప్రభుత్వంవారి అభయము.

ఇంగ్లండులో యిటీవల కేరగతిశాసనము వల్లముగ చేసినప్పటినుండి, వ్యక్తులఆస్తులను యుద్ధావసరముల కొరకు వినియోగించుకొనుట, జప్తు చేయబడుట ఇండియాలో జరుగునని ప్రజలు ప్రభుత్వసెక్యూరిటీలను అమ్మివేయుట, బ్యాంకులలో నిలువవున్న డబ్బును యింటికి తెచ్చుకొనుట, స్త్రీపాలా క్యాష్ సర్టిఫికేట్లను డబ్బుగా మార్చుట, యీమొదలైనపనులకు తేగిరపాటుతో నుపక్రమించుచున్నారు. ఈచర్యలు నాలకలకు నష్టదాయకమైనను ననుటయుట లేదు. వ్యక్తుల ఆస్తిని డబ్బును స్వాధీనపరచుకొను చట్టము చేయు ఉద్దేశము యిండియాప్రభుత్వంవారి కెంత మాత్రం లేదు. ఇట్టి భయములు నిరాధారములు, అనర్థదాయకములు.

---


## జమీన్ రైతు పాఠకులకు కానుక!

గ్యారంటీ 100 రూ. గెలవండి: ముగింపు తేదీ 25-6-40.

## పది నిముషాల యోచనకు రు 100 ల బహుమానం!

మీ అదృష్టానికి యిదొక దృష్టాంతము.

### మొదట ఇది చదవండి.

15

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

1 మొదలు 10 వరకుగల సంఖ్యలతో ఏవరుస చూచినా 15 రావలయును. వేసిన అంకె వేయకూడదు. కీసాల్యూషనులో ఏవరుస రైటుగా వున్నా బహుమతి వుంటుంది. కీ సొల్యూషను రైటు అన్సరుకు రు 100 గ్యారంటీగ సమానంగ బహుమానం యివ్వబడును. చతురము 1.కి ప్రవేశ రుసుము ఒక రూపాయి ఎన్ని చతురములైన పంపుకోవచ్చును. ఎన్నిచతురములు పంపితే చతురానికి రూపాయివంతున అన్నిరూపాయలు పంపాలి. ఎక్కువ చతురములు పంపిన స్త్రీలకు, విద్యార్థులకు, వుద్యోగులకు ప్రత్యేక బహుమతులివ్వబడును. ప్రతి చతురానికి మీఅడ్రసు స్పష్టంగా తెలిసేలాగ వ్రాయవలయును. మద్రాసులో వున్నవారు స్వయంగా కార్యాలయానికి వచ్చి చతురములుకట్టి రసీదు పొందవచ్చును. మనీయార్డరు రసీదులు చతురములతో కవర్లోపెట్టి మా కార్యాలయానికి పంపవలయును. మీవూరునుంచి ముగింపుతేదీ ఆఖరునకూడా మనీయార్డరు చేయవచ్చును. కాని ముగింపు ఆయిన మరుతేదీని మనీయార్డరు చేయకూడదు. ఎవరును కీ సాల్యూషనుకు సరియైన ఆన్సరు పంపకపోతే సాధ్యమైనంతవరకు కీ సాల్యూషను దగ్గిర దానికి బహుమతులివ్వబడును. మేము అనుకున్నంత ప్రవేశరుసుము వచ్చినా రాకపోయినా రు 100 లు గ్యారంటీగ రొక్కం యివ్వబడును. పజిలు సంబంధమైన వుత్తర ప్రత్యుత్తరాలు పోటీ ముగిసిన 15 రోజులతర్వాత నేటికి జరుపబడవు. ఈపజిలు పరిష్కారాల్లో సర్వహక్కులు మేనేజరువి. మీరుపంపే చతురములలో నోటీసులలో మాచినది ఏ కవర్లో మాచినది వివరించవలెను. ఫలితములు జూలై 5 వ తేదీన వెలువడే యీ పత్రికలో తెలుపబడును.

ముగింపు తేది జూన్ 25. ఫలితములు జూలై 1 వ తేదీ. ఫలితాలకు ప్రైజులిస్టులకు ఒక అణాబిళ్ల పంపవలయును. చతురములు, మనీయార్డర్లు యీఅడ్రసుకు పంపాలి.

మేనేజరు,

నవజీవన్ ప్రైజ్ పజుల్స్,

142 తిరువత్తియూర్ హైరోడ్డు, చాకలపేట, మద్రాసు.

# లఘు విమర్శలు:

—పి. వి. సుబ్బారావు.

## జమీందారీ పద్ధతి దేశానర్థకమైంది.

కులతత్వవాదియగు సర్ ఫజలుల్‌హక్కు మహమ్మదీయప్రధాని వుండే బెంగాల్ రాష్ట్రంలో నిష్పక్షపాతియగు యూరోపియన్ ఉద్యోగి సర్. ఫ్రాన్సిస్ ఫ్లౌడ్ గారి అధ్యక్షతన పర్మనెంటు సెటిల్‌మెంటు పద్ధతిని గురించి విచారణ రిపోర్టు తయారుచేయ నియమించబడిన కమిటీవారు "జమీందారీపద్ధతి దేశానర్థకమైనదనీ, జమీందారీలను ప్రభుత్వంవారే కొనెయ్యాలనీ" సిఫార్సుచేశారు. ఒక్క బెంగాలురాష్ట్రంలోనే కాదు, ప్రతిరాష్ట్రంలోను జమీందారీపద్ధతి యీ విధంగానే వుంది. వెంకటగిరి ఎస్టేటువారి కేసులో గూడూరు సబ్ కలెక్టరుగారు యిచ్చిన తీర్పులో "ఎస్టేటులోని భూమిశిస్తు వసూలువిధానం ఎస్టేటునౌకరులకే తెలియదు" అని సర్టిఫికేటు యిచ్చాడు. ఇటువంటి ఎస్టేటులు వుంటేనేమి, పోతేనేమి? అందుకనే కాంగ్రెసు మంత్రులు జమీందారీలను సంస్కరించడానికి పూనుకొన్నారు. వీరివిధానం చాలా మితవాదంగా వుండినా కాంగ్రెసువారు విప్లవకరమగు బోల్షివిజం సిద్ధాంతాలను ప్రవేశపెట్టుచున్నారని జమీందారీవర్గమంతా ఘోషపెట్టింది. ఒరిస్సా జమీందారీబిల్లు స్యాసయిన రెండేండ్లదాకా రాజప్రతినిధి అంగీకారం తెల్పలేదు. కాంగ్రెసువారి మితవాదత్వాన్ని నిరసించిన జమీందారులు బెంగాలు కమిటీరిపోర్టును గురించి ఏమంటారు? ఈ కమిటీకూడ విప్లవకరమైందే నంటారా? అంబరిచేత వాలు గనిపించుకోని, వగుబాట్లు అయ్యేదానికన్నా, ఇకనైనా జమీందారులు హృదయ పరివర్తనం కలిగి, ఆత్మవినాశకరమగు పద్ధతులను విసర్జించి మంచిపేరు సంపాదించుకోవడం శ్రేయస్కరం.

★

## బ్రిటను బేరసారాలు.

ప్రతివిషయంలోనూ, దాని ప్రాముఖ్యతను గమనించక, బ్రిటను బేరసారాల పద్ధతిని విడనాడకుండుట వలన పరిస్థితులు విషమించి పోతున్నాయి. 1939 లో రష్యాతో నెలల కొలది సంధి సంప్రతింపులు విఫలమై హిట్లరుమూడు రోజుల్లో రష్యాతో ఒడంబడిక గావించుకొన్నాడు. ఇప్పుడు రష్యాకు సర్ స్టాఫర్డుక్రిప్సు రాయబారం భిగ్నమైంది. బేరాల పద్ధతి ఫలితాలు ఒకవంక అనుభవిస్తుండిన బ్రిటను ఇకనైనా ఇండియా సమస్యపట్ల విశాలహృదయం కలిగి, పరిస్థితులు విషమించకముందే పరిష్కరించడం శ్రేయస్కరం అని గుర్తిస్తుందా?

★

## సరిపడని సంగతులు.

ఒక వారపత్రికలో సంపాదకీయ వ్యాసానికి "మిత్రమండలే గెలవాలి" అని హెడ్డింగు యిచ్చారు. ఈ హెడ్డింగుచూచి వ్యాసం క్రింది రెండువిధాల్లో ఒకమాదిరిగా వుంటుందని అనుకున్నా. (1) ఫలాని యుద్ధపరిస్థితులు మిత్రమండలివారికి అనుకూలంగా వున్నాయి కాబట్టి జర్మనీ జయించలేదు, మిత్రమండలే జయించాలి. (2) మిత్రమండలివారు ఓడిపోతే ఫలాని కారణాలవల్ల ఫలాని విధంగా అపాయకరం గనక జర్మనీ జయించకూడదు, తప్పక మిత్రమండలే గెలవాలి.

కాని వ్యాసంఅంతా చూస్తే ఏకో ఒక కల గూరగంపగా వుంది. హెడ్డింగుకు సపోర్టుచేసే వాదన వ్యర్థం. ఇది సరియైన జర్నలిజం అని పించుకోంటుందా?

ప్రజాబంధు పత్రిక సంపాదకీయంలో "మిలిటరీ కళాశాలల స్థాపన విషయమై గాంధీమహాత్ముడు వైస్రాయితో ముచ్చటిస్తే మంచిది" అని వ్రాసింది.

అహింసాయుతమైన కార్యక్రమ పూజితుడగు గాంధీజీ యిటువంటి సంప్రతింపులు ఎలా జరుపగలడు?

★

## పంచాయతీబోర్డులు.

పంచాయతీబోర్డులు ఎంత అధ్వాన్నంగా, అక్రమంగా ప్రవర్తిస్తుండినా పార్టీబలం కోసం జిల్లాబోర్డు ప్రెసిడెంట్లు దౌర్బల్యం కలిగించుకోని పంచాయతీ ఆఫీసర్లు యేలాటి చర్య తీసుకోనకుండా చేస్తున్నారు. పంచాయతీ ఆఫీసర్లమీద జిల్లాబోర్డువారికి కొంతపెత్తనం వుండడంచేత జిల్లాబోర్డుప్రెసిడెంటు అడుగులకు మడుగులొత్తుతుంటారు యీ పంచాయతీ ఆఫీసర్లు. తాముకూడా ఎంతటి అక్రమాలు చేయడానికైనా వెనుదీయరు. కాబట్టి పంచాయతీబోర్డులు బాగుపడాలంటే పంచాయతీ ఆఫీసర్లకు జిల్లాబోర్డువారికి యేలాటి సంబంధం వుండకూడదు. గుమాస్తాలమీద ఆధారపడేటువంటివారిని డైరెక్టుగా పంచాయతీ ఆఫీసర్లుగా రిక్రూట్ చేయకూడదు.

★

## కృపాలిని కొరడా.

రాంఘర్ కాంగ్రెస్ తీర్మానానికి ప్రతికూలంగా మనసాంబార్ సత్యమూర్తి గారు యిటీవల డబ్బాబాయించడం మొదలు పెట్టారు. రాజీనామాలు యిచ్చిన, యివ్వకుండా (యింకా అధికారంలో వున్నటువంటి ప్రధాన మంత్రులను, గాంధీజీని వైస్రాయిగారు ఆహ్వానించి కాన్ఫరెన్సు జరిపి ప్రస్తుత ప్రతిష్టంభిన తొలగుమార్గాన్ని ఆలోచించాలని ఒక ప్రకటన గావించాడు.

భారత అసెంబ్లీపార్టీ కార్యదర్శి అసఫాలీ గారు గత నెల 10 తేదిన గావించిన ప్రకటనలో "దేశంలో అన్ని జాతీయ పార్టీలవారు తమనిరోధాలను, తమ పట్టుదలలను, అభిప్రాయ భేదాలను పూర్తిగా మరచిపోవాలి, గౌరవ ప్రదమైన సమాధానం కుదిరితే జాతీయ కొయలిషన్ ప్రభుత్వం యేర్పడాలి" అని అన్నాడు.

రాజగోపాలాచారిగారుకూడా గౌరవ ప్రదమగు రాజీకి ప్రయత్నించాలన్నాడు.

రాంఘర్ కాంగ్రెస్ సత్యాగ్రహ సమరతీర్మానం గావించియుండగా, రాజీసూచకమగు ప్రకటనలు యీ ప్రముఖులు చేయడం తప్పు. అందుకని కాంగ్రెసు కార్యదర్శియగు కృపాలినిగారు మందలించారు. కబడ్దార్, ఇటువంటి అప్రస్తుత ప్రసంగాలు చేయవద్దన్నారు.

సత్యమూర్తిగారికి యీలా కొరడాదెబ్బలు తినడం యిది క్రొత్తకాదు. వాగేవోటికి ఎంతకాలమని 144 యివ్వగలరు?

★

## కూర్మాగారి దేశసేవ.

దేశసేవకు పిలుపువచ్చినప్పుడు నేను విడుదల చేయాలన్న షరత్తుతో సర్. కె. వి. రెడ్డి నాయుడుగారు అన్నామలై విశ్వ విద్యాలయ వైస్‌చాన్సలర్ పదవి స్వీకరించారు. అంటే అ పిలుపు వచ్చినదాకా ఆత్మసేవ చేసుకుంటూ వుంటాడన్నమాట. నిజమైన దేశసేవ చేసేవారికి ఒకవేళ్ళ పిలుపుఅవసరంలేదు. లోంటిలో ప్రాణం వున్నంతవరకు అహోరాత్రిస్య యథోచితంగా సేవ చూస్తూనేవుండొచ్చు. కాని కూర్మాగారి దేశసేవ అలాంటిది కాదు. వీరిసేవ కాంగ్రెసువారు తొలుత మంత్రిపదవులు స్వీకరించ నిరాకరించగా కూర్మావతార మెత్తి పదమంత్రిపు మంత్రివర్గం నడిపించినటువంటిది. ఇటువంటిది కాబట్టే "పిలుపు వచ్చినప్పుడు" అని అన్నాడు.

★

## బ్రెయిల్స్‌ఫర్డు హితవు.

సుప్రసిద్ధ ఆంగ్లరచయిత హెచ్. యన్. బ్రెయిల్సుఫర్డుగారు బ్రిటనుకొక హితవొసంగాడు. "భారతదేశానికి స్వాతంత్ర్యమివ్వాలి. మనం వారిని నిర్బంధింప జూచినదల్లా మనల పరీక్షించుచున్న శత్రువర్గానికే బలం కలిగిస్తుంది." అన్నాడు. ప్రపంచచరిత్రలో ఒకదేశం మరోదేశానికి హృదయపూర్వకంగా స్వాతంత్ర్యం యిచ్చిన నిదర్శన మెక్కడైనా ఉందా?

★

## కాలచక్రం.

కాలచక్రం ఫిలింను ప్రజాబంధు పత్రిక విమర్శిస్తు యీలా వ్రాసింది. "కాలచక్రం యిప్పటికీ ప్రస్తుతంకన్నా యింపుగా చేయడానికి అవకాశం వుంది. అచిత్రాన్ని సమర్థులైన యెవ్వరిచేతనైనా ఎడిట్ చేయిస్తే డబ్బు రాబట్టవచ్చు."

దీనివల్ల యిప్పుడు ఎడిట్ చేసినవారు అసమర్థులని, రీ ఎడిట్ చేయించకపోతే డబ్బు రాదనేనా? అయ్యో పాపం.

★

## రాఘవయ్యగారికి వార్నింగు

నెల్లూరులో ఒక యానాదివాని రిక్రూటింగు విషయమై జిల్లాకలెక్టరు వారికిని, అఖిలభారత కాంగ్రెసుకమిటీ సభ్యుడగు వెన్నెలకంటి రాఘవయ్యగారికిని వ్యవహారం వచ్చింది. జిల్లాకలెక్టరుగారు రాఘవయ్యగారికి వార్నింగుయిస్తూ యీ నెల 1 తేదిన పంపినజాబులో క్రిందివిధంగా తెలిపాడు.

"31 తేదిన నీవు రిక్రూటింగుఆఫీసరు ఆఫీసుకు వెళ్లి రిక్రూటు అయిన ఒకయేనాదిని వెళ్లిపోవు నటుల చేసినావని రిక్రూటింగు ఆఫీసరు తెలిపినాడు ఆయన పనికి ఎవరును ఆటంకము కలుగ చేయకూడదు, ఇండియా డిఫెన్సురూల్సులో ఇది వున్నది.........నీవేగనక జర్మనీలో వుండి రిక్రూటింగు ఆఫీసరుకు ప్రతికూలంగా ప్రవర్తించినట్లయితే వెంటనే కాల్చివేయబడుదువనుటలో యేమాత్రం సందేహంలేదు. వాదనకు గాని, డిఫెన్సుకుగాని అవకాశంవుండదు..........శాంతివాతావరణంలో ఇండియా ప్రజలకు వుండిన వాక్‌స్వాతంత్ర్యము ప్రస్తుతపరిస్థితులలో ఆశించజాలరు. కాబట్టి కేసీవార్నింగు నీకు యిస్తున్నాను. మరచిపోకుండా జ్ఞాపకముంచుకోవాలి"

పై వార్నింగుకు రాఘవయ్యగారు 2 తేదీన యిచ్చిన జవాబులో యిటుల తెల్పారు.

"మీ వార్నింగు జాబులో తెలిపినటుల నేనేమియు చేయలేదు...... యానాదివాని భార్య ఏడ్చుకుంటూ నావద్దకు వచ్చి రంగూనులో కూలిపనికై ఎవరో తన భర్తను పిలుచుకపోయినారనీ, మాడనివ్వడం లేదనీ నాతో మొత్తుకుంది. అంతట నేను, ఆమె, టవున్ కాంగ్రెసు ప్రెసిడెంటు, పరుశురామయ్యగారు వెళ్లి వెంకటాచలపురంలో ఒక యింటిలో యున్నవానిని చూచినాము. కూలీల ఏజన్సీకి పనిచేస్తున్నారా లేక యుద్ధానికి రిక్రూటు చేస్తున్నారా అని వారి నాయకుని నేను ప్రశ్నించినాను... యానాది భార్య అతన్ని చూడవలెనని వున్నదని తెలిపినాను... వెంటనే ఆయన యానాది వానిని గదిలోనికి పిలువనంపి, తాను యుద్ధ రిక్రూటింగు ఆఫీసరని ఇంగ్లీషులో నాకుతెలిపినాడు. అంతట తనమొగుడ్నిపిలుచుకవచ్చింది రంగూను పనికికాదు యుద్ధపు పనికని ఆమెతో తెలుగులో నేను చెప్పినాను. ఈమాటలువిని యానాది దిక్కునిను చెందినాడు. రంగూనులో పనికని తిమ్మ పిలుచుక వచ్చారనీ, నెలలోపుగ మరలవచ్చి భార్యాబిడ్డలను రంగూనుకు పిలుచుకపోవచ్చని ఆశకల్పించారని, యుద్ధపు ప్రస్తావన చేయనేలేదని యానాది తెలిపినాడు. వెంటనే భార్యాబిడ్డల దగ్గరకు మరుగత్తి యింటికి వెళ్లినాడు... నేను యానాదిని యుద్ధపు పనికి వెళ్లవద్దని అతనియిచ్ఛకు వ్యతిరేకంగా చేసినానని ఎవరైనా మీతో చెప్పి వుండిన అది సర్వఅబద్ధము."

పై రెండు జాబులు పరస్పర విరుద్ధంగా వున్నాయి. జిల్లాకలెక్టరుగారు వార్నింగు యివ్వడానికి ముందు విచారణ సల్పియుండవలసినది. ఇంగ్లాండులో ప్రస్తుత యుద్ధకల్లోలకాలంలో కూడ దేశద్రోహ నేరం చేశారన్నవారికి కూడ విచారణకు అవకాశం యిస్తున్నారు. విచారణ చేయక నే రిక్రూటింగు ఆఫీసరు మాట నమ్మి కలెక్టరుగారు అంత కఠినభాష వాడడం సమంజసంగా లేదు.

—

## తిరువాన్కూరు త్యాగం.

తిరువాన్కూరు సాయుధసైన్యము అంతా యుద్ధసందర్భమున వినియోగించబడుటకు బ్రిటనుకు అర్పణ చేయబడినది. ఈవరకు యుద్ధమునకు ఆరు లక్షల రూపాయల విరాళమును తిరువాంకూరు మహారాజాగారు ఇచ్చిరి. యుద్ధ నిర్వహణము నందు తిరువాంకూరు ప్రభుత్వము బ్రిటిషు ప్రభుత్వమునకు అనేకవిధాల సహాయం చేస్తున్నది. ముఖ్యంగా కాల్చిన బెంకాయచిప్పలు 4 వేల టన్నుల పంపినది. ఇంకా యితర విషయములు చెప్పకూడదు. అయినా మాశక్తికొద్ది మేము సహాయం చేస్తున్నాము అని తిరువాంకూరు దివాను సర్. సి. పి. రామస్వామి అయ్యరుగారు తిరువాన్కూరులో ప్లాంటర్లసంఘమునకు ఉపన్యసిస్తూ చెప్పారు.

—

## సత్యాగ్రహ విరమణం

అఖిలభారత సంస్థానప్రజల మహాసభాధ్యక్షుడు పండిత జవహర్‌లాల్ నెహ్రూగారు వడోద సంస్థానంలో సత్యాగ్రహాన్ని విరమించాలని, ఢిల్లీరాష్ట్రీయ కాంగ్రెసుకమిటీవారికి తంతి వార్త పంపారు.

—

## ఊటకలాలపై నిషేధము

యుద్ధం కాలంలో అధిక ధనవ్యయం జరగకుండా చెయ్యడానికి కరాచీలో విద్యాశాఖవారు పాఠశాలలలో ఫౌంటెన్ పేనాలను ఉపయోగించడం నిషేధించారు.

కాకితానికికూడా ధర విపరీతంగా పెరిగినందువలన, పుస్తకాలకు బదులు పలకలు ఉపయోగించవలసివస్తున్నారు.

—

కథ:

# మాయలుగా మగవారి కృత్యముల్:

—బాలకవి, మైసూరు చంద్రశేఖరరావు.

ఏం? ఆడవాళ్లకుమాత్రం కోరిక లుండవూ? ప్రపంచజ్ఞానం తెలీని పదేండ్లపిల్లప్పుడు ఏ ముసలి వాడో మంగళసూత్రం గట్టితేమాత్రం సుఖాన్ని అనుభవించాల్సిన యీలేత వయస్సులో అదారమే మహానిర్బంధమా? ఆ ముసలి మంగళసూత్రం ముడితల గొంతువురికేగాని, సంతోష పెట్టడానిక్కాదు. ఏదో నాలుగు రూకలువున్నాయని యీ మూఢ తల్లి దండ్రులు పిల్లల్ని ముసలాడి కంట గట్టడమా? కంటగట్టితే మాత్రం అన్ని ఆశల్ని అడుగుపడ్రొక్కి అపారనరకాన్ని అనుభవించాల్సిందేనా? యెప్పుడు స్త్రీలకు యీదారుణ సమస్యనుండి తరుణోపాయం? వారిదీ మానవహృదయం గాదూ? మానవ జన్మం గాదూ? ఆడవాళ్లకు యీస్వల్ప స్వాతంత్ర్యమే యీని యీఅమానుష సంఘానికి దేశస్వాతంత్ర్యం మాత్రం యెల్లా వొస్తుంది. తన్నుగిల్లుకోనిగదూ మరొకర్ని గిల్లాల్సింది? పెండ్లిఅంటే ధనమనాఅర్థం. ముసలి ముండా వాళ్లకిచ్చేదేనా విధానం. ఆడవాళ్ళ యీచిచ్చును అర్థం చేసుకోలేని సంఘంయేమి సంఘం గ్రుడ్డిసంఘం. ఏం, దేముడు నా కిచ్చిన సౌభాగ్యాన్ని నేననుభవించేదానికి యీ పప్పెట్ సంఘం ఆర్డరివ్వాల్నా. సంఘీయులు మాత్రం పుష్పపులుమా తినేమానవులుకారూ? యీసంఘానికి కండ్లూ, చెవులూలేవూ? నాయిష్టం. నేను కోరిన చోట్లోనే, నా ప్రేమనగరాన్ని నిర్మిస్తాను. నేను కోరినవాణ్ణే దానికి పట్టాభిషిక్తుణ్ణి చేస్తాను. నేడో, రేపో, యీముసలాడి ప్రాణంకాస్తా కొడెక్కిందంటే నాకు 'విధవ' అనీ ఓకొత్త పేరు పెట్తారు. అప్పుడే సంఘం అడ్డం వొస్తుందా. అమ్మవారి జుట్టుకూ, అయ్యగారి గడ్డాని కీముడి పెట్టే యీ పెండ్లింఢ్ల పేరయ్యల్ని నమ్మి, పడుచు పిల్లల్ని ముసలాళ్ళకు ముడెట్టి, వాళ్ళ గొంతులు గొయ్యడమా? అంతకంటే ఒక్కసారే మెడ నులిమేసి భావిలో పడేస్తే పీడవొదిలి పోదూ, యీతలి దండ్రులుకి? స్త్రీజన్మ అంత పాపభూయిష్ట మైందనా వీళ్లమతం. ఆడవాళ్లే లేకుంటే యీ మగవాళ్లెక్కణ్ణుంచి పుట్టుకొచ్చారోమరి! యీవిశాల ప్రపంచంలో నా యీ భావాలకు దోహదానిచ్చే దానికి ఒక్క వ్యక్తైనా వుండదూ? భారత కవులందరూ నిద్రబోతున్నారా! నాదుఃఖాన్ని యీ హృదయంలేని లోకానికి తెలీజేయరేరూ. కృష్ణమూర్తే నా ప్రేమరాజ్యాని కధిపతి. అతడే నా జీవిత నిధానికి అలంకారం. నేనతన్నే ప్రేమిస్తా. కానీ, యెవరడ్డొస్తారో చూస్తాను.

యీలా పలువిధాలుగా భవిష్యత్తును ఆలోచిస్తోంది. రమాదేవి. అప్పుడే రాత్రి 9 అయింది. ఆయన రమ్మనింది ఇంకో రెండుగంటలకే గదూ? అని అనుకుంటూ జమీన్‌రైతులోని కథ చదువుతూంది. రెప్పలపూద నిద్రాదేవి నిశాన్రుత్యం చేస్తోంది. కండ్లుమూతలు పడుతున్నాయి. కథ చదువుతూంటే తన భావిజీవితానికి పలు పలు విధాలుగా ఐడియాస్ ఫారమవుతోన్నాయి. రమ హృదయంలో. సాధారణంగా యేదైనా కథ చదువుతోంటే ఆనవస్థలోనే తనను కోని అల్లాడే పాఠకహృదయాలకు ఆ కథ ఆదర్శాన్నిస్తూటుంది. భవిష్యత్తుకు దారితీస్తూవుతూంటుంది. అప్పుడే కవికృతికృత్యుడౌతాడు. తన ప్రతిభ అక్కడే వెల్లడౌతుంది. తనకలం అక్కడే చిందులు తొక్కుతుంది. తననుకొన్నదానికీకవిశయలో చేయూతనిస్తోన్నాడు రమకు. అమితోత్సాహంతో కర్తవ్యాన్నాలోచిస్తూంది. ఇంటిలోనూం తలుపుల్ని యెవరో తెరవడంవల్ల అక్కడి నిశ్శబ్దానికిభంగం అంతరాయంగలిగింది.

వెంటనే లోనికొచ్చింది రమతల్లి కామేశ్వరమ్మ. అమ్మాయ్, రమా! మాకందరికీ భోజనాలయ్యాయి మేం సినిమా కెడుతూన్నాము. పార్వతమ్మ ఒడ్డిస్తోందిగాని, నువ్వుభోంచేసి...... అక్కడే కామేశ్వరమ్మ నోటికి బీగాలుపడ్డాయి. అక్కణ్ణుంచి కంటిన్యూ చేయిలేక పోయింది... భోంచేసి? రమకుగూడా సినిమాకురమ్మని రాఘవయ్యగారి దగ్గర కపాలమోక్షాన్ని పొందడమా లేక రమాన్నే రావొద్దనడమా!

తల్లిమీమాంస నగ్రహించింది రమ. కడుపులో చిచ్చుయింకా ద్విగుణీకృతమైంది. ఒక్కవేడి నిట్టూర్పును విడిచింది. పడుచుపిల్లలు సినీమాకొస్తే అల్లరి చిల్లర వెధవలంతా యీలలు వేస్తారట. రాళ్లురువ్వుతారట. పడుచు పిల్లలు సినిమాలు చూడడం గొప్పతప్పట. మగవాళ్లే అన్ని సౌఖ్యాలనూ అనుభవించేవానికి అర్హులట. ఇదీ రాఘవయ్యగారి సనాతన సిద్ధాంతం. విడవమంటే పాముకోపం. కరవమంటే కప్పకుకోపం. భర్త సనాతన సిద్ధాంతాలలోనూ ఓవిధమైన హితమూ కనిపిస్తుంది. కామేశ్వరమ్మకు కూతురి నవనాగరిక సిద్ధాంతాల్లోనూ, ఓన్యాయమూ కనిపిస్తుంది. ఏం చేస్తుంది పాపం! వీళ్లిద్దరి మధ్యా నలిగిపుక్కిరిబిక్కిరౌతోంది. రమ సంగతంతా గ్రహించినకే అల్లాగే పొండిఅంది. మానంతో వెళ్లిపోయింది కామేశ్వరమ్మ. హుఁ! యేమి నిర్బంధం యీపాడు జన్మానికి అంది ఓవిషపు నవ్వు నవ్వుతూ, దీర్ఘనిశ్వాసంతో.

గడియారం టంగుటంగుమని 11 గొట్టింది. గబగబా లేచి స్లిప్పర్స్ తొడిగి పైట సవరించుకొని అందం చూసుకొంటోంది. ఇంతలో ముసుగు పెద్దమ్మ పార్వతమ్మవచ్చి అమ్మాయ్! భోజనానికి లేమ్మా! వాళ్లూగూడా సినిమా కెళ్లారు. లేమ్మా! అనిపిలిచింది. ఆమె అయింట్లో I. C. S. కాండిడేట్ లేండి! ఆకలి కాలేదండీ అవ్వగారూ మీరు భోంచెయ్యండి! అని అతివినయంగా సమాధానం చెప్పింది దీనంగాచూస్తూ. రమ లలాట ఫలకంలో ఆకలను నోచుకోని యీ అభాగ్యురాలికిగూడా భోజనమా? అన్న భావాక్షరాల్ని చదివింది పార్వతమ్మ. చక్కావెళ్లి పోయింది. అది బ్రహ్మాండమైన మేడ గావడంవల్ల ముందు వరండాలోవున్న రమ రూముకూ, వంటింటికీ చాలాదూరంవుంది. ఇక్కడేం జరిగినా అక్కడివారికి తెలీదు. కృష్ణమూర్తిని రాత్రికి సంతోషపెట్టడంకోసం మేకప్ యిచ్చుకోవడంలో అద్దం ముందు చాలా శ్రద్ధచూపుతూంది. ప్రపంచంలోని నిశ్శబ్దానికి వీధిలో అక్కడక్కడా మఖ సంబదంబతులుపాంటూ సంతోషిస్తోన్న గ్రామఫోను పాటలు భంగం కలిగిస్తున్నాయి. ఇంటిముందు తోపచెట్టుమాత్రం కైమనిగాలిలీస్తూ, అవ్యక్తమైన ఆందోళన చేస్తూ రమకు సిగ్నలిస్తోంది. అప్పుడే యెదురింటి మేడపై కిలకిలా నవ్వుకుంటున్నారు ప్లీడరూ, ఆయనభార్య సుందరమ్మా. వాళ్లనవ్వుకు రమకొంచెం అసూయ కెందింది. పాపం! తనపాటివాళ్లు అనుభవించే సౌభాగ్యానికి నోచుకోని అభాగినిరమ. లోకంలో తగిన భర్తలుగలిగిన ఆడవాళ్ల హృదయాలలో సుధాతరంగాలు ప్రవహిస్తోంటే మనరమ హృదయంలో నిరాశాగ్నికీలలు నాలుకలు చాపుతూన్నాయి. అందరూ సుఖాను భవనంతో ధన్యులౌతూంటే రమ అంసంమాత్రం అడవిగాచిన వెన్నెల్లాగవుతోంది. తలుపుతీసే వుండడంవల్ల అతిస్వతంత్రంగా, మెల్లగా, చిరునవ్వు మొగంతో, కండ్లద్దాల కళకళలతో లోనికి ప్రవేశించాడొకాయన. ఆయనే మన కథానాయకుడు కృష్ణమూర్తి. మహా షోకీలామనిషి. అవస్తపడి మొన్ననే 5 రూపాయలెట్టి హేయిరు కర్లింగ్స్ తీయించుకున్నాడు. స్లిమ్‌సోల్జర్స్, స్లిపోస్థోడత, అంతా పెద్దమనిషి తరహా. మద్రాసులోనే B. A. సీనియర్ చదువుతున్నాడు. తిన్నగావచ్చి వెనకాలే కండ్లుమూశాడు. కోపంతో రమ కనుబొమలు ముడిబడ్డాయి. నిర్ఘాంతపోయి చేతులు విదిల్చేసి భర్ననుకొని వెనకతిరిగి చూచింది. ప్రత్యక్షమయ్యాడు. తన ప్రేమమూర్తి... "అట్లయితే నీయిష్టం" అన్నట్లు యేదైవు కనుబొమ్మలా క్రైపుకు తొలగిపొయ్యాయి. రమ మనస్సు కుదుటబడింది. వెతకబోయిన తీగకాళ్ళకు చుట్టుకుంటే ఎంత ఆనందమౌ అంత ఆనందం కలిగింది. గుండెల్లోవున్న వేడిగాలినంతా ఒక్కసారిబయటికి విడిచేసి కృష్ణమూర్తినుండివొచ్చే సెంటెక్ గాలిని పీల్చింది.

ఆసమయంలో ఏం మాట్లాడాల్నో తోచలేదు. అప్పటిరమ సంతోషాన్ని మాటల్లో తెలపడానికి పదాలులేక నా కలం వెనక్కి జంకుతూంది. అపళంగా మూర్తి కౌగిట్లో ఒదిగిపోయింది. మూర్తి చొక్కా గుండెల్లో రిపెక్ట్ అయ్యేకాంతులు రమ చెక్కిళ్ళ బంగారురేకుల్లో రత్నాలు చెక్కుతూన్నాయి. ఆలింగనంతోనే తన్మయత్వం కెందారు ఉభయులు...

రమ కొంతసేపటికి ప్రక్కకు తిరిగిచూచింది. కృష్ణమూర్తి మందహాసంతో, ముంగుర్లుదువ్వుతూ విసురుతూన్నాడు. కండ్లల్లోంచి ఆనంద బాష్పాలు రాలుస్తూ మూర్తీ! వచ్చావా! నన్నే రమ్మన్నావుగదూ అంది రమ.

ఔను! నిన్నువిడిచి నేనొక్క నిముషమైనా వుండలేను రమా! రూంలో వున్నంతసేపూ చదవనే బుద్ధిపుట్టలేదు. పిచ్చిబట్టినవాడికి మల్లేయిల్లా చక్కా వొచ్చేశాను.

మూర్తీ! మనిద్దరం యెప్పు డొకటౌతామో చెప్పగలుగుతావా?

ఆ! ఇదిగో! యిప్పుడూ... అంటూ ఒక్క ముద్దెట్టుకున్నాడు రమని.

మూర్తీ! నీకోసం యిప్పటివరకూ యెంత తపించిపోయానో తెల్సా?

పిచ్చిదానా! యెందుకంత పిచ్చి (అన్నాడు నవ్వుతూ)

నీకా? నాకా?...పిచ్చి...

నీకే.

ఆ! అయితే ఆడవాళ్ళకంటే మొగవాళ్ళకు కోరికలు జాస్తిగదూ మూర్తీ.

ఆ చెప్పటికి వుండదు రమా! ఆడవాళ్ళకే కోరిక యెక్కువ. పురుషులకంటే స్త్రీలు యెక్కువ కంట్రోలు చెయ్యగలుగుతారు. కాని కొంచమైనా బైటపడరు.

అదిసరే కాని మూర్తీ! యెల్లుండికే మీ పరీక్షలు పూర్తౌతాయిగదూ పూరికిపాతావేమో?! (అంది హృదయభారంతో తలనంచి అడలిపువు సవరించుకొంటూ)

ఆ! ఆడే ఆలోచిస్తున్నాను రమా! అన్నాడు పరధ్యానంగా.

మూర్తీ!

ఆ.........

యిన్నిదినాలనుంచీ నేనొకటి అడుగుతూంటే చెప్పకుండాలే యేదేదో కబుర్లతోకితింపుతావు. ఇప్పుడన్నా చెప్పవూ?

ఏంటిది నీ కెప్పుడూ యిల్లాంటి ధర్మసంకటాలే వస్తోంటాయి.

మీ ప్రేమలో సహభాగం యింకే అర్ధాంగికైనా పంచిచ్చారా? లేక......

హాఁ, హాఁ, హాఁ, పిచ్చిపిల్లా! అంతా నీ స్వాధీనంచేసి నీకావులా క్రిందనే నీ ప్రేమరాజ్యాన్నేలుతూన్నాగా!

యేమో! పట్టభద్రులౌతూండగానే యెల్లా మర్చుతుందో మీగాలి "సందు సుడిమాయలుగా మగవారి కృత్యముల్" అని వూరికే అన్నారా పెద్దన్న.

లేదు రమా! నీకోసమన్నా మళ్ళా తిరిగివస్తా.

ఏం? పోతుంటే, అక్కడ భార్యా పిల్లలా?

............ (మూర్తి మౌనందాల్చేడు.)

పై ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు మూర్తి. పరధ్యానంగా వున్నట్లుండి రమ చెంపలు నిమురుతూ "రమా! యింట్లో మీవాళ్ళెవరూ లేనట్లుంటే..."

"వాళ్ళంతా సినీమా కెళ్ళారు"

"ఇంకో స్లోక్ హౌడెక్ వెధవవుంటిగదూ?"

"ఆ! ...పాపం! ఆవిడ యేవంటరలోనో పడుకోనుంటుంది లేండి!"

మూర్తి చేతిగడియారంచూస్తూ 11½ అయింది యింకా టైముందిగదూ మావాళ్లు వచ్చేదానికి?" అంటూ లేచి తలుపులు బిడాయించాడు. తర్వాత.........

★

అవ్వే ఇంతెందుకండి. అసలు ఫలానా పంతులు మాన్నేహితుడని చెప్పుకునేదానికే నాకు సిగ్గేస్తుంది. వూరంతా గబ్బుపట్టిపోతోంది. రాత్రి యెదురింటి ప్లీడరుగారుగూడా యిక్కడ వీళ్ల కిలకిలలూ, కిలకిలలూ విన్నారట. నలుగుర్లో పరువు పొయ్యేట్టుగా వుందే. ఛీ! ఛీ! యింత బ్రతుకూ బ్రతికే యింటివెనకాల చావటమా? రాఘవయ్యగారూ! మీరు దీన్నిగురించి తీక్షణంగా యోచించకపోతే మనకేవుండే పరువుగూడా దక్కదు సుమండీ! అసలాపిల్లకు యింతవరకూ చదువు చెప్పించిందే గొప్పపొరపాటు. పైన యీ విషయంగూడానా. అని పేరావధాన్లు యేదో రమపైన గ్యాస్ యెక్కిచ్చేస్తున్నాడు పంతులికి. అసలు యీ ముండాకొడుకే రమను యీ ముసలి సంబంధం మాట్లాడి మధ్య కమీషన్ ఏ 5 వందలదాకా గుంజేశాడు; పీడమ్మా కడుపుగాల. యింత తంతూ జరిపి రమను ద్రోహం చేశాడని ఒకవాడు వీధిలో ఒంటరిగా చూచి పేరయ్యను చావా చితకా తన్నేడు మూర్తి. యీలాంటి వ్యవహారాలు యింకెక్కడ కి చెయ్యవుగదా అంటూ అందుకే వీళ్ళిద్దరిపైనా పగసాధిస్తున్నాడు పేరయ్య. అరచేతిలో స్వర్గంచూపించాడు పంతులికి, మన బిడ్డ పదికాలాలూ చల్లగా వుండేట్టునని, వరుడి దగ్గర బంగారు చింతపండు ముద్దలావుందని వచ్చిచెప్పాడు. పంతులు ఆమాటలకు లేలపోయిదబ్బుకక్కుర్తిపడ్డాడు. కడుపు చించుకుంటే కాళ్లమీదపడుతుందని నుక్కుమిక్కురనకుండా పాకాళ్లమీద చేత్తో తలబట్టుకొని మహాతీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఇదో! యేమేవ్ యిల్లారా"!

కామేశ్వరమ్మ పైటచెరుగుతో కళ్లు తుడుచుకుంటూ ఏమండీ అంటూవచ్చింది.

కొరవ 13 పేజిలో—

# మందసా, రంగా దినోత్సవం

## మద్రాసు

దక్షిణయిండియా కార్మిక ఫెడరేషనువారి యాజమాన్యమున జూన్ 1 వ తేదీన హైకోర్టు బీచిలో 'మందసాదినము' "రంగా అరెస్టుదినము" జరుప బడినవి. అధ్యక్షులు "ఆంధ్రప్రభ" సంపాదకులు న్యాయపతి నారాయణమూర్తి గారు.

అఖిలభారత రైతునాయకుడగు రంగాగారి యెడల ప్రభుత్వచర్యను నిరసించుచూ, పక్షపాత రహితమైన విచారణ సంఘాన్ని నెలకొల్పి మందసా నేరస్థులపైనున్న నేరాలను ఉపసంహరించవలెనని తీర్మానములు చేయబడినవి.

## రాచపూడి

ఒంగోలుతాలూకా పై గ్రామంలో మందసా దినం, రంగా నిర్బంధదినము జూన్ 1 వ తేదీన జరుపబడినవి. రంగాగారిని తదితర నాయకులను వెంటనే ఎట్టిషరతులు లేకుండ విడుదల చేయవలెనని, మందసాకాల్పులలో మరణించినవారి కుటుంబములకు నష్ట పరిహారమును ప్రభుత్వంవారు యివ్వవలెనని, తీర్మానములు గావింపబడినవి.

## ప్రొద్దుటూరు

ఆచార్య రంగా నిర్బంధ దినోత్సవము, మందసా దినోత్సవము పైగ్రామంలోని చెన్న కేశవస్వామి ఆలయము ఎదుట జరుపబడినవి.

రంగాగారిని అరెస్టు చేయుట సమంజసము కాదనియు, ఆయన అస్వస్థతగా నున్నందువలన వెంటనే విడుదల చేయవలెననియు, మందసా గ్రామాలకు పలాసా కిసాన్‌సభ కారణమనుటకు అర్థము లేదనియు తీర్మానములు చేయబడినవి.

## నూజెళ్ల పల్లె

ఇచ్చట 200 మంది రైతులుసభచేసి మందసా, రంగా దినముల జయప్రదముగా జరిపారు. క. శ్రీనివాస రావు గారు మందసాలో మొదటినుండీ జరిగిన విషయమును విపులంగా ముచ్చటించారు. జయ జయ ధ్వనులతో సభముగిసింది.

## కుర్రనిపాలెం

ఇచ్చటకూడా యర్రగుంట సుబ్బరాయుడు గారి అధ్యక్షతన మందసా, రంగా దినములు జరుపబడినవి.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధానకార్యదర్శి చేగిరెడ్డి బాలిరెడ్డిగారు గంటసేపు చక్కగా నుపన్యసించారు. తీర్మానములతో జయ జయ ధ్వానముల మేళవించి సభ ముగించారు.

## నాయుడుపేట

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘంవారి ఆదేశాను సారంగా జూన్ 1 తేది పై గ్రామములో సా॥ 6 గం॥ యినకులంతా బొమ్మ రామలింగయ్య శెట్టిగారి అధ్యక్షతన సభజరిపారు.

మందసా కాల్పులకునూ, రంగా, శ్యాంబాబు, రామలింగయ్యా నిర్బంధనలకు నిరసనము దెల్పుచూ అరెస్టు చేసిన మందసారైతులను వెంటనే విడుదల చేయవలసినదని యీసభవారు తీర్మానించారు.

## పమిడిపాడు

1 తేది రాత్రి కావినూతల వెంకటేశ్వర్లుగారి అధ్యక్షతక్రింద సభ జరిగెను. నాగినేని వెంకయ్యగారు ఉపన్యసించిరి. రంగాగారి నిర్బంధమును గూర్చి, మందసా కాల్పులనుగూర్చి ప్రభుత్వ చర్యను నిరసిస్తున్నూ మందసా విషయంలో విచారణ సంఘాన్ని నియమించాల్సిందని కోరుతూ తీర్మానముల గావింపబడెను.

## ముద్దుకూరు

రాష్ట్ర రైతుసంఘమువారి ఆదేశానుసారం మందసాదినం రంగా నిర్బంధదినం పై గ్రామంలో జయప్రదంగా జరిగినవి. రాత్రి 8 గం॥ గొప్ప బహిరంగసభ జరిగింది. రైతులు చాలా మంది వచ్చారు. శ్రీ కె. అమ్మయ్యగారు అధ్యక్షత వహించారు.

అధ్యక్షులు మందసా ఉదంతాన్ని విపులంగా తెలియబర్చారు. రంగాగారు రైతు కూలీ రాజ్య స్థాపనకై యేవిధంగా కృషిచేయుచున్నది వివరించారు.

శ్యాంబాబు, రామలింగయ్య వగైరాల నిర్బంధనపట్ల ప్రభుత్వచర్యను ఖండించుచూ, మందసాలో నష్టపడినవారికి నష్టపరిహారమివ్వవలెనని, చనిపోయినవారి కుటుంబములకు సానుభూతిని తెల్పుచూ, ఈసంవత్సరంలో అరెస్టుచేయబడిన వారినందరిని విడుదల చెయ్యాలనీ, రంగా మొదలైన నాయకులే మందసా కాల్పులకు కారణమనుట అక్రమమనీ అన్యాయమని, రంగాగారిని వెంటనే విడుదల చేయాలనీ తీర్మానించిరి.

## తురిమెళ్ల

ఇచ్చట కర్నూలు జిల్లా కాంగ్రెసుసంఘ ఆధ్వర్యమున ఒక బహిరంగసభ జరిగింది. టి. సుబ్బయ్యగారు అధ్యక్షులు.

మందసా కాల్పుల విచారణకై రైతుసంఘ ప్రతినిధులతోకూడిన ఒక నిష్పాక్షిక విచారణ కమిటీని ప్రభుత్వం యేర్పరచవలెననియు, చనిపోయిన రైతుకుటుంబాలకు నష్ట పరిహారమివ్వవలెనని, రంగాగారిని తదితర అరెస్టయిన రైతునాయకులను రైతుసేవకులను వెంటనే విడుదల చేయాలనీ తీర్మానించారు.

## దగ్గుపాడు

యీగ్రామములో జరిగిన బహిరంగ సభకు పెక్కుమంది ప్రజలు వచ్చారు. శ్రీయుత నెమ్మాని వెంకట్రామయ్యశర్మ గారు అధ్యక్షత వహించారు షేఖు అస్సాను, చుండిరామమూర్తి గార్లు రంగా గారి జీవితమును గురించి వివరించారు. మహమ్మదు గాలిబుగారు మాట్లాడుచూ ఆచార్య రంగాగారిని అరెస్టు చేయడము కష్టజీవుల అభివృద్ధిని అరికట్టుటనియు, చెప్పెను. అధ్యక్షోపన్యాసంతో సభముగింపబడెను.

— మొహమ్మద్ గాలిబ్.

## టెక్కలి తాలూకా

1-6-40 తేదీన పై తాలూకాలోని రెంటికోట, లొద్దభద్ర, అంతరకుడ్డ, వజ్రపుకొత్తూరు, బెండి, వంకటాపురం, హరిదాసపురం మున్నగు గ్రామములలో రైతుసభలు జయప్రదముగా జరుపబడెను. యీసభావేశములకు జిల్లారైతు నాయకులైన శ్రీ పల్లిపెద్ది కృష్ణమూర్తి గారు, జిల్లా ఫార్వర్డుబ్లాకు కార్యదర్శియగు జనాబ్ అబ్దుల్ రహిమాన్ ఖాన్ సాహెబుగారు, తర్లాకోటస్టేటు రైతు సేవకులగు శ్రీ దువ్వాడ కోదండముగారు హాజరైనారు.

రైతుపుద్యమమును అణచివేయుటకు మందసా కాల్పుల సందర్భములలో ప్రభుత్వంచేసిన ప్రకటన తీవ్రంగా నిరసించుచూ శ్యాంబాబు నిర్బంధమును గూర్చి, ఆచార్య రంగా యిందులాల్ యాజ్ఞిక్ స్వామి తీ, రామలింగయ్యాగార్ల అరెస్టుపట్ల తీవ్ర అసమ్మతిని తెలియపరుస్తూ త్వరలోనే ఎట్టి షరతు లేకుండా ప్రభుత్వము విడుదలచేయాలని తీర్మానించిరి.

—స్వ. వి.

## బోగోలు

కావలి తా॥ బోగోలు గ్రామ రైతు సంఘ యాజమాన్యమున 1 తేది సాయంత్రం బహిరంగ సభ బచ్చువెంకటకృష్ణయ్యగారి అధ్యక్షతను జరిగింది. తీర్మానాలు.

1. కొమ్మారెడ్డిగారి అకాలమరణమునకు ఈ సభవారు సానుభూతి జూపుచున్నారు.

2. మందసా కాల్పులను యీసభవారు నిరసిస్తూ ప్రాణాలు గోల్పోయిన రైతులకు సానుభూతి జూపుచున్నారు.

3. అఖిలభారత రైతునాయకులైన రంగాగారి నిర్బంధమునకు ప్రభుత్వచర్యనిరసిస్తున్నారు.

4. భర్తను సామ్రాజ్యవాద కారాగారమున కర్పించి భర్తస్థానాన్నలంకరించి సేవచేస్తున్న భారతీదేవిగారికి యీసభవారు కృతజ్ఞత తెలుపుచున్నారు. —లోగురు వెంకయ్య.

## వీరగున్నమ్మపురం

పైగ్రామం మందసాయెస్టేటులోనిది. ఇచ్చట మందసాకాల్పుల సందర్భంలో నెలరోజులు జైలు అనుభవించి విడుదల అయిన కామ్రేడ్ మార్పు పద్మనాభంగారి అధ్యక్షతన అనేకమంది రైతులు సభ జరిపారు.

ఆచార్య రంగా, రామలింగయ్య, యాజ్ఞిక్, స్వామితీ గారల నిర్బంధముల నిరసించుచూ, మందసాకాల్పులలో నష్టపడిన సంసారాలకు పరిహారం ప్రభుత్వ మివ్వవలెనని తీర్మానించారు.

## పోతినవారిపాలెం

ఆం. రా. రై. సం. వారి ఆదేశానుసారముగా యీగ్రామములో ప్రొఫెసరు రంగాగారి నిర్బంధ దినోత్సవము జరిపిరి.

సభకు రైతులు షుమారు 500 మందికి పైగా వచ్చారు. శ్రీయుత కొత్తపల్లి వెంకటసుబ్బయ్యగారు అధ్యక్షత వహించారు. మహమ్మదుగాలిబు సాహెబుగారు ఉపన్యసించుచూ రైతు కూలీ క్షేమముకొరకై తన సర్వస్వమును గోల్పోయిన త్యాగమూర్తియగు శ్రీ ఆచార్య రంగాగారికి ప్రభుత్వము చేసిన అక్రమచర్యనుఖండించుచు, తీర్మానము ప్రజలకు వినిపించారు. అభివందనములతో సభ ముగించారు.

## కంభం తాలూకా

గాంధీనగర్, జేస్తవారపేట, పాపాయిపల్లె సోమవారపుపేట, చెటిచెర్ల, వొందుట్ల, పూసలపాడు, పందిళ్లపల్లె, మోక్షగుండము, మున్నగు చోట్ల 1 తేదీ సలుభ జరిగినవి. ఆసభల్లో యీ క్రింది తీర్మానము లామోదింపబడెను.

మందసా కాల్పులను నిరసిస్తూ, కాల్పులకు గురియైన రైతుల నభినందిస్తూ రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుంటూ విచారణకు నిష్పాక్షిక సంఘాన్ని నియమించాలని కోరుచున్నారు.

రైతు బాంధవులు రంగాగారు, శ్యామసుందరరావు, కొన్నలగడ్డ రామలింగయ్యగార్ల నిర్బంధమునకు అసమ్మతి తెలుపుచూ వారినభినందిస్తు తీర్మానించారు.

## మాలెంపాటివారిపాళెం

1 తేది సాయంత్రం మాలెంపాటి వీరరాఘవయ్యగారి అధ్యక్షతను సభజరిగెను. నాగినేని వెంకయ్యగారు ప్రస్తుత రాజకీయముల గూర్చి జమీందారి సమస్య మున్నగు విషయములగూర్చి మాట్లాడిరి. రంగాగారి నిర్బంధమునుగూర్చి మందసా కాల్పులగూర్చి ప్రభుత్వచర్యను నిరసిస్తూ తీర్మానములు చేయబడెను.

—ఒక విలేఖరి.


# గుండాల

బంగారు, వెండి నగలు సిద్ధంగా ఉన్నవి—
❋
నమ్మకమైన నగల వర్తకులు—

వెంకటసుబ్బారెడ్డి

❋
మీ కోరిక ప్రకారు యిస్తే అన్నీ చేసి యిస్తాము—
❋

బజారు - నెల్లూరు.

# వశీకర లేహ్యాం

మునలితనము లేకుండచేయుటకు, వీర్యపటుత్వము లేనివారికి లేపనశక్తి కలిగించుటకు, సంతానప్రాప్తి లేని స్త్రీలకు పుత్రలాభము పెట్టుటకు ఈ మహాయోగరాజము నెల్లడి గెయుట కవకాశము గలిగించితిమి. వాడి తీరుడు. లేదా విచారించిన లాభమున్నదా? గుణములేనిచో దల్పు వాసను చేయును. అరగంటలో వీర్యము రాయివలె చేయును. రమించే శక్తి తిమ్ము 30 దినములకు రు. 3-0-0.

(రతిశాస్త్రం ఉచితం)

**Pandit A. V. Asram,**
***CHICACOLE.***

# లకోటా ప్రశ్నలు

ప్రత్యక్ష నిదర్శనం

అయిదు ప్రశ్నలువ్రాసి, కవరులో యుంచి సీల్లువేసి పంపిన దేవీ మహిమచే ఫలితములను వ్రాసి, మీసీల్లకవరుసహాపంపుటకు రు 1-5-0 సంవత్సర ఫలితం ప్రతి నెలలోను జరిగెడి కష్టసుఖములతో వ్రాయుటకు రు 1-8-0 నాడి గ్రంథముల రీత్యా దశలుగల పూర్తి జాతకం రు 5-8-0, నవగ్రహశాంతియంత్రం వ్యాపార వ్యవహార కుటుంబ చిక్కులు ధననష్టం శరీర పీడ కల్గుచున్న దోషపరిహారమునకు రు 3-5-0

శ్రీ సరస్వతీ జ్యోతిషాలయం,
పండిత నేమాని సామేశంశర్మ అండ్ సన్,
దేవాలయంవీధి, కాకినాడ.

# మదనమోహన లేహ్యాం

అఖండ శక్తిగలది. యిందు రస, విష, గంధకాదులుగాని, నిషా పదార్థములుగాని చేర్పలేదు. ఆకేవలమూలికలు కూడికచేత తయారు కాబడినవని. ఇందుగల మూలికా ప్రభావమే నన మునలివాండ్రను సహితము నూతన యవ్వనులుగా చేసి, సత్సంతాన వంతులగుదురు. శరీరపుష్టి, బలము, ధాతువృద్ధి, శరీర కాంతి, మనుకుతనము, జ్ఞాపకశక్తి, కలిగి యీను పురుషాయవమునకు మిక్కిలి బలము కలిగించి సంభోగేచ్ఛలేనివానికి సంభోగశక్తి కలిగించి, మరియు రెక్కు వగానిలిపి, స్త్రీ పురుషుల కావలసిన కలిగించుటలో దీనికి మించినదింకొకటి లేదని ఘంటాపథముగా చెప్పగలము. తినినములలో గుణముయిచ్చును. శాంపిలు 3 రు. మర్పి నాలుగణాలు పోస్టేజి టిక్కెల పంపిన పంపబడును.

22 రు. డబ్బా రు 2—0—0

44 రు, డబ్బా రు 3—12—0

పోస్టుఖర్చులు ప్రత్యేకం.

**Dr. P. Satyanarayana,**
***Kundanagiri Street,***
CHICACOLE, Vizag Dt.

# బ్రిటను ముందు జాగ్రత్తలు:

మొదటి పేజీ కొరవ

## తిరిగివచ్చిన సైనికులకథలు:

మిత్రమండలి సైనికులకు విమానాలు తక్కువగా వుండినాయని, కొన్నిరోజులనుండి తిండి లేదని, విరామంలేకుండా బాంబులవల్ల చాలా కష్టం కలిగిందనీ, శత్రువులదాడి నరికట్టడానికి యిష్టందువల్లె అడ్డంకి యిదివరకెన్నడునూ కట్టబడలేదుకాని, జర్మనులు ఛేదించుకొని వచ్చారనీ, సైనికులు స్టీమరులోకి ఎక్కేవంతసేపు జర్మనులు బాంబులు, మరఫిరంగులు ప్రేల్చు చుండిరనీ, తెల్పిరి.

## ఫ్లాండర్సు యుద్ధఫలితం:

ఫ్లాండర్సు యుద్ధంలో మిత్రమండలివారు పలాయనమవడం చాల ప్రమాదకరమైంది. మిత్రమండలి వారికి విశేష ఆయుధసామగ్రి నష్టమైంది. భూమి పై సైనికులను, సైనికసామగ్రిని ఒకచోటనుండి మరొకచోటికి కొనిపోవుటకు సాధనాలు, సాయుధ శకటాలు అన్నీ వదలివెళ్లారు. ఫ్రెంచి సైన్యం చాలా దుర్బలమైనది. బెల్జియం సైన్యం విధ్వంసమైంది. బెల్జియంలోని అమూల్యమగు లోహపు గనులుగల ప్రదేశాలు జర్మనుల స్వాధీనమైనాయి. ఇంగ్లీషు ఛానల్ లోవుండే రేవుస్థలాలన్నీ, శత్రువుల హస్తగతమైనాయి. ఈ రేవుల వద్దనుండి జర్మనులు బ్రిటను మీదికిగాని, ఫ్రాంసు మీదికిగాని, సులభంగావచ్చి ప్రమాదం కలుగజేయ ప్రయత్నించ వచ్చును.

## బ్రిటిష్ మంత్రుల ప్రకటనలు:

యుద్ధతీవ్రతను బ్రిటిషు మంత్రివర్గంవారు ప్రజలకు దాచిపెట్టుటలేదు. క్లిష్టపరిస్థితుల గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు పార్లమెంటు సభ్యులకు ఎరుకపరచుచు శత్రుప్రమాదమునుండి తప్పించుకొనుటకై ప్రజలందరును ఎక్కువగ తోడ్పడవలెననియు, అంత్యవిజయము తమదేననీ ఉద్బోధించుచున్నారు. ఆహారపదార్థాల విషయంలోనేమి, దేశసంరక్షణ విషయంలోనేమి, ఆయుధ వుత్పత్తి విషయంలోనేమి క్రొత్తక్రొత్తచట్టాలు గావిస్తున్నారు. 4 తేదీన ప్రధాని పార్లమెంటులో యుద్ధపరిస్థితులను పైన తెలిపినవాటిని పూర్తిగా విశదపరచి యిట్లన్నాడు.

"తక్షణమే మనమీదగాని ఫ్రాన్సుమీదగాని మరొకదెబ్బ పడబోతున్నదని గుర్తించాలి"

29 తేదీన ప్రచారణశాఖా కార్యదర్శి క్రిందివిధంగా హెచ్చరించాడు:—

"ముమ్ముందు యింకను ప్రతికూలమగు వార్తలు రాగలవు. జర్మనీ యింకా కొత్తమార్గాలు వెతకవచ్చు. కాని అంత్యవిజయం మనది."

## బ్రిటనుముందు జాగ్రత్తలు:

బ్రిటను తూర్పు దక్షిణ ప్రాంతాల్లో వుండు 18 నగరాల్లోని బాలురను 47 వేల మందిని, మరి 8 వేలమందిని రక్షణకొరకు 2 వ తేదీన 100 రైళ్లలో వేల్సుకు, మిడ్ ల్యాండ్సుకు తీసుకెళ్లారు.

తీవ్రమగు క్లిష్టపరిస్థితులు యేర్పడి, జర్మను దాడి బ్రిటనుమీదికి వచ్చినా ఎదుర్కొనడానికి బ్రిటను జాగ్రత్తగా తగు యేర్పాట్లు గావించుకొనుచున్నది.

విదేశీయులు 16 సం॥ పైబడిన వారెవరును పోలీసువారిసెలవు లేకనే సైకిళ్లు, మోటారుబండి, నావ, విమానముల నుంచుకొనకూడదు రాత్రివేళ లండనులో 12 గంటలనుండి 6 గంటల వరకును, ఇతరచోట్ల 10½ గం॥ మొదలు 6½ గం॥ వరకును ఇండ్లను కదలి వెళ్లరాదని వుత్తర్వు గావించబడెను. పంచమపంక్తి వారిపై ఈవుత్తర్వు ఉద్దేశింపబడినది.

పార్లమెంటు సభలున్న వెస్టుమినిస్టరు భవనాలను సంరక్షించడానికి యేర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంటుసభ్యులకు, పార్లమెంటు కార్యాలయాల్లో పనిచేయు ఉద్యోగులకు పాసులు యిచ్చారు. ఇవి లేనివారిని లోనికి రానివ్వరు.

ఆహారపదార్థాల వుత్పత్తి అభివృద్ధికై యేర్పాట్లు గావించారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా యూనియను, మారిషస్, పి. జి. బ్రిటిష్ వెస్టుఇండీసులలో ఎగుమతికి సిద్ధంగా వుండే చక్కెరను కొనేశారు. వ్యవసాయవుత్పత్తి వృద్ధికి ప్రత్యేకంగా గోధుమపంటకు యేర్పాట్లు చేస్తున్నారు.

కార్మికులు సెలవులు లేకుండా పనిచేయాలన్నారు. టాంకుల నిర్మాణానికి పూనుకొనబడుచున్నది.

యుద్ధనిర్వహణానికి వ్యతిరేకభావాలు పురికొల్పువిషయాలు ప్రకటించు పత్రికలను అణచివేయడానికి, కరపత్రాలు, పత్రికలు ముద్రించు ముద్రణాలయాల గురించి వ్యవహరించడానికి దేశాంగమంత్రికి అధికారమివ్వబడింది.

రస్తాలమీద తిరిగే ఏబండిలోను పోస్టుమాస్టరు జనరల్ మినహాయించిన తప్ప రేడియోసెట్లను వుంచుకొనకూడదని 30 తేదిన ఒక వుత్తర్వు చేయబడింది.

గుమ్మట సైనికుల ప్రమాదం తప్పించుకొనుటకు తగు యేర్పాట్లు చేస్తున్నారు.

దండయాత్ర జరిగితే శత్రువుకు ప్రయోజనకరంగా మండల దిక్సూచక ఫలకములను తీసివేయాలని రాజమార్గాధికారులకు వుత్తర్వులిచ్చారు.

బ్రిటనులో జర్మనులు, ఆస్ట్రియనులుచేరి 31 వేలు పురుషులు, 42 వేలు స్త్రీలు వున్నారు. వీరిలో 5800 పురుషులను, 3200 స్త్రీలను నిర్బంధించారు.

3 తేదీన విదేశీయులను గురించి కఠినమగు నియమములు చేశారు. అనేక భాగాలను రక్షిత భాగాలుగా చేశారు. ఈ భాగాలలో విదేశీయులు వ్రాతమూలకముగ అనుమతి లేనిదే ప్రవేశించరాదు. వుండకూడదు ఫోటోసామగ్రి తీసుకపోరాదు, వాడరాదు. కామెరా, టెలిస్కోపు, ఫీల్డుగ్లాసులు, నౌకామార్గపటాలు వుంచుకోరాదు.

ఓడలను యుద్ధ సామగ్రులకు వినియోగించుకొనడంచేత, పశువులను దిగుమతియ్యే ఆహార విషయంలో తగ్గించారు.

ఆహార పదార్థాలు కొన్నిప్రదేశాల్లోనే నిలువ వుంచబడిన నష్టమై పోవచ్చునియు, దేశమంతటా సులభంగా సప్లయి చేయడానికి యిబ్బందియేర్పడునని దేశమంతటా 800 డిపోలను పెట్టారు.

దేశంలో ఆగ్నేయభాగంలో కొన్ని ప్రదేశాలనుండి పశువులసంఖ్యను తగ్గిస్తున్నారు. ఈభాగాలలో దొరకు పశువులలో పెంటనే వధ కుపకరించువాటిని ఆహారమంత్రివర్గంవారు కొనెదరు. కొన్ని పశువులు ఇతరదేశాలకు పంపబడుచున్నవి.

దేశరక్షణకుగాను అతివేగంగా నడువగలిగి, ఆయుధాలుగల "పరిక్షా సైన్యు" అనే దళాలను యేర్పాటు చేస్తున్నారు. సైన్యంనుండి యిటువంటివి అనేకవందలకొలది దళాలు ఉండును.

సైనికులు హెచ్చుగా చేర్పబడుచున్నారు. ఈసెలలో మామూలుకంటే రెండింతలు చేర్పబడెదరు.

## పారిసుపై విమానదాడి:

ఉత్తర ఫ్రాన్సు, ఫ్లాండర్సుయుద్ధరంగాల్లోనుంచి మిత్రమండలి సేనలు వెళ్లినతరువాత జర్మను విమానాలు ఫ్రాంసు ముఖ్యపట్టణమగు పారిసునగరంపై దాడి సలుప నిశ్చయించాయి. 3 తేది మధ్యాహ్నం 45 నిమిషముల కాలము 300 వందల విమానాలు 1000 బాంబులవర్షం కురిపించినాయి. సైనికప్రదేశములకు చాలా దూరానవుండే ప్రయివేటు గృహాలపైనగూడ బాంబులు వేయబడ్డాయి. 906 మందికి అపాయం కలిగింది. 254 మంది హతులైనారు. హతులైన వారిలో 195 మంది సాధారణపౌరులు, సైనికులు 59 మంది మాత్రమే. గాయపడినవారిలో సాధారణపౌరులు, 543 మంది, సైనికోద్యోగులు 107 మంది.

చాల బాంబులు నగరమధ్యభాగాన పడినాయి. శత్రువిమానాలు కన్పించిన తోడనే క్రిందనుండి విమాన విధ్వంసక శతఘ్నులు గుండ్లవర్షాన్ని పైకికురిపించినాయి. ఫ్రాన్సు విమానాలు పైకెగిరి జర్మను విమానాలను ఎదుర్కొన్నాయి. ఈదాడిలో ఫ్రెంచి విమానాలు నాలుగుమాత్రమే పడగొట్ట బడగా జర్మనువాటివి 17 పడగొట్టబడినాయట. జర్మనీకి తిరిగి పోతున్నవి. మరికొన్ని ధ్వంసంచేయబడినాయట.

సైనిక ప్రదేశాలు, సివిలియన్ ప్రదేశాలు అనే విచక్షణలేక బాంబులు వేయబడినాయి. శిథిలమైన భవనాలలో పాఠశాలలు అనేకమున్నాయి.

పారిసుమీదనే గాకుండా, పారిస్ప్రాంతంమీద రాత్రి 10-15 గం॥ 1.30 గం॥ మధ్య బాంబులు వేయబడ్డాయి. ప్రయివేటు ఆసాముల యిండ్లకు ప్రమాదం సంభవించింది.

ఈయుద్ధంలో పారిస్ నగరంమీద బాంబులు వేయడం యిదే ప్రథమము.

## జర్మనీపై బ్రిటిషు విమానదాడి

బ్రిటిష్ విమానాలు జర్మనీలోని రాత్రి సర్వి బాంబులు వేయడం ఆరంభించినాయి. జర్మను సేనలకు సరకులను సేనలను తీసుకొనిపోతుండిన రైళ్లమీద 2 వ తేదీ బాంబులు వేశాయి. జర్మనీలో వాయువ్య ప్రాంతీయంలో చాలాభాగం తిరిగినాయి. సౌహెస్టు అను ముఖ్యమగు రైల్వే జంక్షనుమీదను నడచుచుండిన రైలుబండ్లమీదను సరకుల బండ్లమీదను యింకను అనేకప్రదేశాల్లో బాంబులు వేయబడ్డాయి.

జర్మని ఫ్రాన్సుపై దండెత్తి అమానుషంగా ప్రయివేటుయిండ్లమీద భీభత్సం కలిగించినందుకు ప్రతీకారంగా ఫ్రాన్సు కూడా యిదేవిధంగా ప్రవర్తిస్తుందని ఫ్రాన్సు ప్రకటించింది.

మ్యూనిక్, ఫ్రాంక్ ఫోర్టు, ఆన్ మెయిన్ రూర్ జర్మన్ నగరాలలోని మిలిటరీ కేంద్రాలపై మిత్రమండలి విమానదాడి జరిగినదని ఆఫిషియల్ జోనాస్ ఏజన్సీవారు ప్రకటించారు.

## బ్రిటనుకు సామ్రాజ్యదేశాల సహాయం:

బ్రిటనుకు విశాలమగు సామ్రాజ్యదేశాలుండుట వలన ప్రతిదేశం శక్తికొలది సహాయం చేస్తున్నది అవసర యుద్ధసన్నాహాలు గావిస్తున్నది.

అవసరమేర్పడినప్పుడు వ్యక్తులను, వ్యక్తుల ఆస్తిని స్వాధీనపరచుకొని ఉపయోగించుకొనుటకు న్యూజీలాండువారు 25 వేల బ్రిటిష్ బాలురకు ఆశ్రయమిస్తామన్నారు

ఆస్ట్రేలియాలో పరిశ్రమలన్నీ ప్రభుత్వస్వాధీనమైనాయి. యుద్ధం సాగుచున్నంత కాలం 12 సం॥ లోబడిన బ్రిటిష్ బాలురకు ఆశ్రయమొసంగ సిద్ధంగావున్నామని తెలిపారు.

సౌత్ ఆఫ్రికావారు కొనవరకు యుద్ధంలో మిత్రమండలివారి పక్షం నిలబడియుండెదమని జనరల్ స్మట్స్ సేనాని ప్రకటించాడు.

ఇండియానుండియు సైన్యాలు, ధనం సహాయం చేయబడింది.

ప్రతిదేశం యీ విధంగా సహాయం చేస్తున్నది. ఇటువంటి సంపత్తి జర్మనీకి లేదు.

## రష్యా సఖ్యతకై బ్రిటను ప్రయత్నము:

రష్యా మైత్రిని పొందలేకపోయినందుకు బ్రిటనిప్పుడు విచారపడుచున్నది. మునుపటి ప్రధాని ఛేంబర్లేను గావించిన పొరపాట్లలో గొప్పది రష్యా స్నేహం పొందజాలకపోవడమే. రష్యా బోల్షివిజమును జూచి ఛేంబర్లేను బెదరి యుద్ధంలో రష్యాయొక్క మిలిటరీప్రాముఖ్యతను గుర్తించలేకపోయినాడు. హిట్లరు యీ మిలిటరీప్రాముఖ్యతను బాగాగుర్తెరిగి, సెలపర్యంతము బ్రిటను రష్యాతో బేరసారాలు చేస్తుండగా, మూడు రోజుల్లో రష్యాతో మిలిటరీసంధి చేసుకున్నాడు. తూర్పువైపున జర్మనీకి రష్యా మిత్రుడుగ వుండడంచేత యేలాటి భయంలేకుండా పశ్చిమరంగమున విజృంభించుటకు అవకాశం యేర్పడింది. ప్రస్తుత బ్రిటిషుప్రధాని చర్చిల్ దీనిని బాగా గుర్తించాడు. బ్రిటను, ఫ్రాన్సులపై దండెత్తనున్న జర్మనీవారి విజృంభణను అరికట్టాలంటే జర్మనీ రష్యాల మైత్రికి భంగపాటు కలిగించడం చాలా ముఖ్యమని నిశ్చయించాడు. అందుకని రష్యాతో వర్తక సంప్రతింపులకు ప్రత్యేక రాయబారి సర్ స్టాఫర్డు క్రిప్సును పంపుటకు బ్రిటను యేర్పాటు చేసినది. కాని రష్యాక్రిప్సు ప్రత్యేక రాయబారాన్ని తిరస్కరించి, ప్రస్తుతం రష్యాలో వుండే బ్రిటిషు రాయబారితో సంప్రతింపులు జరుపవచ్చునంది. దీనితో బ్రిటనుకు కొంత ఆశాభంగం కలిగింది. క్రిప్సు ప్రత్యేకరాయబారం భగ్నమైంది. ఈపరిస్థితుల్లో బ్రిటను మరొక ఎత్తుఎత్తింది. రష్యాలో వుండే రాయబారిని యింటికి పిలువనంపి ఆయనస్థానే సర్ స్టాఫర్డుక్రిప్సును సాధారణ రాయబారిగా పంపింది. రష్యా, జర్మనీ మైత్రిని యిత డెంతవరకు భగ్నము చేయగలడో చూడవలసి యున్నది.

## ఇటలీ సమరసన్నాహం:

మధ్యధరాసముద్రంపై ఆధిపత్యం సంపాదించాలని ఇటలీకి వుద్దేశమున్నది. ఆఫ్రికాలోని ట్యూనిస్, కార్సికా ప్రదేశాలుగూడ స్వాధీనపరచుకొనవాలని కన్నుకలదు.

ఫ్లాండర్సు యుద్ధంలో జర్మనీకి విజయం చేకూరినందున ఇకను బ్రిటను, ఫ్రాన్సుల మీద దాడిసలుపవలసి వచ్చింది. మధ్యధరాసముద్రంలో చిచ్చు యేర్పరచి నట్లయితే మిత్రమండలివారి దృష్టి, సైన్యాలు కొంతవరకు మరల్పవచ్చునియు, తన దాడులకు ప్రతిఘటన కొంత తగ్గగలదనియు భావించి ఇటలీని యుద్ధంలో దింపడానికి జర్మనీ ఒత్తిడిచేయ మొదలుపెట్టింది.

దీనిమీద అధికముట్టడి విషయంలో ఇంగ్లండుతో ఇటలీచేసుకొన దలచిన రాయబారములను ముసులోనీ నిరాకరించాడు.

ఇటలీ యుద్ధంలోకి కాలుపెట్టకుండ చేయడానికి అమెరికా అధ్యక్షుడు రూజువెల్టుగారు ప్రయత్నిస్తుండిరి. హిట్లరు వత్తిడిని తోసివేయజాలక, అన్నివిధాల ఇటలీ జర్మనీకి సహాయపడుకుందని ముసులోనీ రూజువెల్టుకు - స్పష్టంగా యీవారంలో తెలిపినటుల తెలుస్తున్నది.

3 తేదీన ముసోలినీ అధ్యక్షతను మంత్రివర్గం సమావేశమైందిగాని, యుద్ధంగురించి యేనిర్ణయానికి రాలేదు. కాని, ఇటలీయుద్ధ సన్నాహాలను సాగిస్తూనే వుంది.

కొరవ 10 వ పేజీలో—

## పెండ్లి కట్నాలు.

### రావూరివారి కండ్రిగ
### పెండ్లి కట్నము రు 30 లు.

రావూరువారి కండ్రిగ వాస్తవ్యులు పార్లపల్లి సుబ్బరామరెడ్డిగారి పుత్రిక చిరంజీవి సౌభాగ్యవతి వజ్రావతిమ్మగారిని, పెనుబర్తి వాస్తవ్యులు పోతువరపు బలరామరెడ్డిగారి కుమారుడు పిచ్చిరెడ్డిగారికిచ్చి తే 31-5-40 దిన రావూరువారి కండ్రిగలో వధువు గృహమున వివాహమహోత్సవము జరిగెను.

ఈ వివాహ సందర్భమున వధువు తండ్రి రు 20 లును, వరుని తండ్రి రు 10 లును "జమీన్ రైతు" పత్రికకు కానుకగా నొసంగి చరితార్థులైరి.

వధూవరులకు చిరాయురోన్నతుల నొసంగి భగవంతుడు కాపాడుగాక.

★

### పాపిరెడ్డిపాళెం
### పెండ్లికట్నము రు 10 లు.

పాపిరెడ్డిపాళెము వాస్తవ్యులు అల్లూరు ఆదినారాయణరెడ్డిగారి ద్వితీయ పుత్రులు రామసుబ్బారెడ్డిగారికి స్వర్గీయ పాణకాగమణారెడ్డిగారి ప్రథమ పుత్రిక చి॥ సౌ॥ సుశీలమ్మగారినిచ్చి తే 1—6—40 దిన పాణిగ్రహణ మహోత్సవ మొనర్చిరి. ఏతన్ముహూర్తమున వరుడు రు 10 లు "జమీన్ రైతు"కు కానుక సమర్పించిరి.

వధూవరులకు సర్వేశ్వరుడు శుభాశీస్సుల నొసంగి సర్వదా కాపాడుగాక.

—పత్రికాధికారి.

# జమీన్ రైతు

**7-6-1940**

## యుద్ధ సహకారము

ఈ దేశంలో యీనాడు సైన్యసమీకరణ ఎక్కువగాజరుగుతోంది. యుద్ధ పరికరాలుగూడాతయారుజేస్తున్నారు. యుద్ధ ఋణపత్రాలుగూడ ప్రవేశ పడనున్నవి. దేశంలోని ప్రజలందరును దేశరక్షణ పనులకు తోడ్పడాలని ప్రభుత్వం కోరుతున్నది. ఈకార్యాలు దిగ్విజయంగా జరగాలంటే ప్రజలలో నొక అపూర్వ ఉత్సాహం ప్రజ్వరిల్లాలెగదా! అది నేడు దేశంలో నిజంగా ఉన్నదా?

ఈకార్యాలు సర్వతోముఖంగా జరగాలంటే ప్రజలు తమ దేశంకోసం, తమ స్వాతంత్ర్యం కోసం — సిద్ధపడాలె, దుముకాలె, ఎగరాలె, సర్వస్వం పణంగా ఒడ్డాలె, అనే పిపాస ప్రజల్లో కలిగినపుడే యిది సాధ్యమౌతుంది.

ఈనాటికైనా బ్రిటీషు ప్రభుత్వం భారతీయులకు యీ స్వాతంత్ర్య తృష్ణను కలిగించ నుద్దేశించిందా?

గాంధిజీ రెండుచేతులూ చాచి స్నేహం స్నేహం అంటున్నాడు. పోనీ ప్రజా పరిమత్తుకు పూర్వాం ఆ కొద్దిమంది సమాలోచనకైనా సరేనంటున్నాడు. బ్రిటీషుప్రభుత్వం ఆపదలో ఉండేటప్పుడు సత్యాగ్రహం నేను ప్రారంభించను. అని దేశాన్ని అడక్కుండానే తానే స్వంతపూచీమీద గట్టిగా, చివర మాటగా హామీ గూడా యిచ్చాడు.

ఏదీ హృదయపరివర్తన? లేదే! యీసంక్షోభంలో భారతీయులరక్తనాళాలన్నీ ఉడికిపోతున్నవి. ప్రపంచ ప్రళయతాండవం నగ్ననృత్యం జేస్తున్న ఈ మహా విలయ దుర్నిరీక్ష్య సమయాన వీరాధివీరులైన భారతీయులు చేతులు ముడుచుకొని కూర్చోవడమంటే ఇంతకంటె భారతీయులకు విచారకార్యముండబోదు.

ఓ బ్రిటీషు ప్రభుత్వమా! వీరాధివీరులకు పుట్టినిల్లయి, యింతపెద్ద జనసముద్రంగల భారతదేశం నీచేతిలో బెట్టుకొని మాత్రం వాడుకొనుటకు చేతగాని పరిస్థితుల్లో ఏమిలాభం?

ఇంతటనైనా హృదయ పరివర్తన గలిగి భారతదేశానికి స్వాతంత్ర్య వాగ్దానమిచ్చి భారతీయుల సర్వసహాయాలు బొంది నాజీదుష్టరాక్షస కౄరకృత్యాలనుండి ప్రపంచాన్నుద్ధరించుటకు పూనుకోనవలసినదని బ్రిటీషు ప్రభుత్వాన్ని హృదయపూర్వకంగా కోరుచున్నాము.

—

## నేటి యుద్ధవార్తలు.

### జర్మనీ కొత్తదండయాత్ర:

ఫ్రాన్సులో కొత్తదండయాత్ర జర్మనులచే 5 తేదీన ఆరంభించబడినది. 120 మైళ్లు విస్తరించిన జర్మన్ సేనలు అతిఉగ్రంగా పారిసునగరము వైపు దండయాత్ర ప్రారంభించినాయి. సాయంకాలమువరకు ఫ్రెంచిసేనలు జర్మనుసేనలతో తీవ్రముగా ఎదుర్కొన్నాయి. కాని కొన్ని ముఖ్యము, అవసరమైన ప్రదేశాలను విడవాడి పోనలసివచ్చునని పారిసువార్త. యీపోరాటం ఫ్రెంచివారికే అనుకూలమట.

★

5 తేదిన జర్మనీపై మిత్రమండలి విమానదాడి జరిగి విశేషనష్టం కలిగించినదట.

★

బ్రిటను తూర్పు కోస్తాలో 5 తేది రాత్రి విమానదాడి జరిగింది. తెలిసినంతవరకును గొప్ప నష్టం కలుగలేదని రూటరు సంజయుడు తెలుపుచున్నాడు.

★

ఫ్రాంసు ముఖ్యపట్టణమగు పారిసు నగరంపై జర్మనులు బాంబులువేసినందున ఈప్రాంతంలో వుండే పాఠశాలలన్నీ మూసేశారు.

★

ఫ్రెంచి మంత్రివర్గంలో మరల మార్పుజరిగింది. ప్రధాని రేనాడుగారు విదేశాంగ, రక్షణ మంత్రిత్వాలు కూడా స్వీకరించాడు.

★

ఇటలీ, ఆస్ట్రేలియా, ఇటాలియన్ కాలనీల తీరాలలో 12 మైళ్ల దూరందాకా ఉన్న సముద్ర ప్రాంతం నౌకాసంచారానికి ప్రమాదకరమని ప్రకటించబడింది. ఈతీరానవుండే రేవులలో ప్రవేశింపదలచిన స్టీమర్లు ప్రత్యేకంగా అనుమతిపొందాలి.

★

బ్రిటనులోని పసిబిడ్డలను రక్షణకై కెనడా, ఆస్ట్రేలియా దేశాలకు పంపువిషయమై ప్రభుత్వంవారు ఆలోచిస్తున్నారు.

★

ఇండియాలో ప్రతిజిల్లాలోను "యుద్ధ కమిటీలు" ప్రతిరాష్ట్రంలోను "పౌరరక్షక దళాలు" యేర్పడాలని 5 తేదీన వైస్రాయి ఒక ప్రకటన గావించాడు.

—

## ముఖా ముఖి:

### సాంబమూర్తి.

సాంబమూర్తి అంటే కాలరుద్రుడు అన్నమాట. ఏవిషయమైనంటే అది జరిగితీరాలె. ఇప్పుడు మద్రాసులో ఆంధ్రమహాజనసభకు వీరు అధిష్టానదేవత. నెలకు రెండువందలకు పైన అద్దె చెల్లిస్తూ ఆంధ్రమహాసభను విక్టోరియా టవునుహాలుకు మార్చి దాన్ని నానా కళాశోభితంగా చేస్తున్నారు. ఇంతవరకు యీ యాంధ్రాభిమానానికి అందరు సంతోషిస్తారు.

కాని మాకొకభయం దినదినాభివృద్ధిగా పెరుగుతోంది. ఆంధ్రమహాజనసభయొక్క మేలుకోసం జస్టిసుపార్టీవారిని ఆశ్రయించడం తప్పనిసరైంది. ఈవిధంగా చల్లపల్లి, పిఠాపురం యిత్యాది వర్గమంతా పంతులవారి స్నేహకోటిలోకి చేరుతున్నారు!

ఆ స్నేహపు రుచే చల్లపల్లివారి జిల్లాబోర్డు ఆక్రమణాలపై సౌమ్యదృష్టుల, పిఠాపురంవారి కేంద్రశాసనసభా ఎన్నికల సందర్భంలో ప్రేమ దృష్టులగా మారిందేమోనని మాభయం.

నీలాంబూరు జమీందారు కాంగ్రెసులో చేరిక పోయినా కాంగ్రెసు ఆశీర్వాదాన్ని పొందాడు. పతేలంతటి వాడిచేత విజ్ఞాపన చేయించాడు. అల్లంత్రీ కైలుకుపంపాడు. కాంగ్రెసు సానుభూతిపొందాడు. కానీదీనికి నెల్లూర్లో 8 ఓట్లు రాలినవి. అంతేకాని ఆంధ్రదేశమంతా నవ్వ జాట్టింది. దీనికి మనపంతులవారి పలుకుబడి ఉదాసీనం వహించిందంటారు. ఉదాసీనమే గాదు కొంచెం అటకైనైతిక దృష్టికూడ ఉండివుండాలంటారు.

ఇంత వరకైతే నేనుకూడా ఆంధ్ర, తమిళ, శైలంవల్ల జరిగి ఉంటుందని ఆత్మతృప్తి పడతా.

కాని యీస్నేహ మర్యాదలు యిలా పెరిగితే రేపు ఎస్టేట్సులాండు రివిన్యూఆక్టు శాసనసభకు వచ్చినవాడు జమీన్ రైతులు గుండెపగిలి చస్తారనే విషయం జ్ఞప్తికి రెస్తున్నా.

★

ప్రకాశంపంతులు "స్వరాజ్యపత్రిక"ను విసర్జించినట్లే సాంబమూర్తి పంతులుగూడా "ఆంధ్రమహాజనసభ"ను విసర్జించమని మా వినయపూర్వక విజ్ఞాపన.

—

## పెన్నపడవ ప్రమాదం.

మే నెల 24 తేదీన నెల్లూరువద్ద పెన్నానదిలో జరిగిన పడవ ప్రమాదంలో పడవలో 100 మంది దాకా వుండిరనీ, 65 మంది వరకూ మరణించి వుండవచ్చనీ హిందూవిలేఖరి రిపోర్టు. 25 తేదీన జిల్లాకలెక్టరుగారు ప్రభుత్వానికి పంపిన రిపోర్టులో తప్పించుకున్నవారు 23 మందనీ, చనిపోయినవారు 25 మందికిపయిగా వుండవచ్చనీ తెల్పినాడు. రెండవ రిపోర్టులో పడవలో 70 మందికి పయిగా పట్టిరని తెల్పినటుల తెలుస్తున్నది. పోలీసువారి లెఖలప్రకారం చనిపోయినవారు 34 మందనీ, బ్రతికినవారు 56 మందని తేలినదట. ఈవిధంగా పరస్పర విరుద్ధ నిర్ణయాలు గావించబడి వున్నాయి. కాబట్టి ఇటువంటి ప్రమాదం సంభవించినపుడు ఇది జరుగుటకు కారణమేమో, ఎంతమంది చనిపోయినారో నిర్ధారణ చేయుటకు ప్రభుత్వంవారు బహిరంగ విచారణ జరుపుట అవసరం.

—

రాజకోట సంస్థానాధీశుడు తన భృతిని 18 లక్షలనుండి 9 లక్షలకు తగ్గించుకొనెను.

# యుద్ధ ద్వితీయాధ్యాయము-

బెల్జియంరాజు ఆత్మసన్యాసంవల్ల ఫ్లాండర్సు రణరంగంనుండి మిత్రమండలి సేనలు మృత్యుముఖమునుండి తప్పించుకొని మెళకువగా నష్టపడకుండా బ్రిటనుకు చేరవలసి వచ్చింది. దీనితో కూడా యుద్ధ ప్రథమాధ్యాయం ముగిసింది. చిన్న దేశాలగు ఆస్ట్రియా, పోలెండు, హాలెండు, డెన్మార్కు, లక్జెంబర్గు, బెల్జియం, నార్వేలో కొంతభాగం, ఫ్రాంసులో సోమునది మొదలుహాలెండు వరకుగల ఇంగ్లీషు ఛానల్‌లోని ముఖ్యమగు రేవులు జర్మనీకి ఇంతవరకును ఆహుతిఅయినాయి.

ఇకను రెండో అధ్యాయం బలీయమగు బ్రిటను, ఫ్రాన్సులతో జరుగవలసివుంది. ఇంగ్లీషు ఛానల్‌లోని రేవు పట్టణాలను ఆక్రమించిన జర్మనీ తన బలాన్నంతా బ్రిటనుపై కేంద్రీకరిస్తుందని వూహించబడిందిగాని, అట్లుగాక 120 మైళ్ళపొడుగున ఫ్రాన్సులో పారిస్ నగరంవైపు జర్మన్ సైన్యాలు 5 వ తేదీన దాడి ప్రారంభించినవని నేటివార్తలు తెలుపుచున్నాయి. మిత్రమండలివారు జర్మనీపైకి విమానదాడులు సలిపి మిలిటరీ ప్రదేశాలపైనను, నగరాలపైనను, బాంబులువేయ నారంభించారు. జర్మన్ బలం బ్రిటన్‌పయి కేంద్రీకరింప బడినట్లయితే, ఫ్రాన్సు విమానాలకు జర్మనీపయి అడ్డులేని రహదారి యేర్పడి, జర్మనీలో ప్రమాదం కలుగ చేయుటకు అవకాశం యేర్పడుతుంది. ఇప్పటికే జర్మనీలో యుద్ధంవైపు విముఖతయేర్పడివుంది. హిట్లరు త్వరలో యుద్ధాన్ని యిటో, అటో తేల్చ ప్రయత్నిస్తున్నాడు. రేవు పట్టణాలు జర్మనుల వశమైయున్నందున బ్రిటనునుంచి ఫ్రాన్సుకు సహాయంవచ్చుటకు అడ్డుయేర్పడియున్నది. మొదట బ్రిటనుమీద కేపోయినట్లయితే బ్రిటను, ఫ్రాన్సులమధ్య జర్మన్ సేనలు పత్తివేయబడగలవు కూడాను. ఇదంతేయు జర్మనీ బాగుగ గుర్తించి ఇంగ్లీషుఛానల్ తూర్పువైపున ప్రతిఘటించువారెవ్వరు లేకుండా చేసుకొని తరువాత బ్రిటనుపైకిపోవ నిశ్చయించుకొనినటులున్నది.

కాని యిదికూడా ఒకందుకు మంచిదే. ఫ్లాండర్సు యుద్ధంలో బ్రిటను విశేష ఆయుధ సామగ్రి నష్టపడిపోయింది. ఈనష్టాన్నంతా సవరుకొనడానికి కొంత వ్యవధి యేర్పడిందన్నమాట.

మధ్యధరాసముద్రంలో యిటలీని యుద్ధంలోకి దింపి ఫ్రాన్సు దృష్టిని మరల్చ హిట్లరు ప్రయత్నిస్తున్నాడుగాని అదిసాగదు. మధ్యధరాసముద్రంలోని మిత్రమండలి సేనలు ఒక్కదెబ్బతో యిటలీని అణచివేయగలిగినంత బలంతోనున్నవి.

జర్మనీ పూర్వపుయుద్ధం మాదిరే ప్రథమంలో విజయవంతంగా కనుపడ్డా కొంతకాలం యుద్ధం కొనసాగినట్లయితే దెబ్బతినకతప్పదు పి.వి.యస్.

# నెల్లూరు ముచ్చట్లు:

—విమర్శకుడు.

## నాయుడుపేట కంపౌండరు

ఇదొక పెద్దగాథ. 17-5-40 తేది జమీన్ రైతులో నాయుడుపేట కాంపౌండరునుగూర్చిన విమర్శన ప్రకటింపబడ్డది.

ఒక బాధ్యతగల వ్యక్తి ఈ కాంపౌండరును సమర్థిస్తూ పెద్ద లెటరు వ్రాశాడు ప్రకటనార్థం. ఈ బాధ్యతగల వ్యక్తిని కొందరు నిర్బంధిస్తున్నారు పాపం! ఇతను వాండ్ల బాధపడలేక కాంపౌండరును సమర్థిస్తాడేమోనని అంతకుముందే మరొక వ్యక్తి వ్రాస్తాడు.

జమీన్ రైతువారు ఈ అన్ని విషయాలను మరొక బాధ్యతగల వ్యక్తికి నివేదించి దీని నిజానిజాలను విచారించి తెలుపమనికోరారు. ఆవ్యక్తి నాయుడుపేట వెళ్లి విచారించి కాంపౌండరు విషయంలో ప్రథమరిపోర్టు నిజమనీ, దరిమిల్లావచ్చిన వ్రాతలు అబద్ధమనీ వ్రాస్తూ వివరాలు తర్వాత తెలుపుతానన్నాడు. ఇందులో ఎవరి మాటలు నమ్మమంటారు చెప్పండి! ఇంతా నిజం బైటికి రాదు.

మొన్న ముత్తుకూరుడాక్టరు విషయంలో పాపలు తెలుసుకున్న తికమకలే దీనిలోగూడా ఏర్పడ్డవి. పల్లెటూళ్ల నిజాయితీ యీలా ఉంటుంది. కాళ్లుబట్టుకున్నంత మాత్రాన ఎంత బాధ్యతగల వ్యక్తిగూడా తనధర్మాన్ని మరచిపోయి "అబద్ధంవా సుబద్ధంవా సంతోషుత్రో వినాయకః" అన్నట్లు ప్రవర్తించడం కొన్నిచోట్ల చూస్తున్నాము. తప్పు చేసినవారిని రక్షించాలంటే ఇదిగాదుమార్గం. ఉన్న విషయాన్ని బైటపెట్టడం, ఆతన్ని ఇక చేయవద్దని మందలించడం, పైవారికిచెప్పి ఆతన్ని మన్నింప చేయడం, ఇదీమార్గం. దీనితో ఆవ్యక్తి ఇకతప్పు చేయడం మానుకుంటాడు. సిఫార్సుచేసిన వ్యక్తుల వడతలకు భంగంరాదు.

తప్పుచేసినవాణ్ణి చేయలేదని సమర్థించడంతో [illegible]ను నిరంతరం తప్పుచేయడానికి దారిచూపడమేగాక ఆతనికోసరం బాధ్యతగలవ్యక్తిగూడా అబద్ధగాడుగావడం ఏర్పడుతుంది. దీన్తో నీళ్లల్లో మునిగేవాణ్ణి రక్షించబోయి తాను మునిగినట్టుంది. ఇదిత్యాగంగాదు, దయాగాదు, పెద్దమనిషితనంగాదు. గ్రామాల్లో పెద్దలు యీలాంటి విషయాల్లో యదార్థంగా మెలగమని నాప్రార్థన.

ఎవడన్నా "ఓ బాధ్యతగలవ్యక్తి! రేపు స్వరాజ్యం వచ్చినతర్వాతగూడ నీచేతికె పెత్తనమిస్తే యీలా నేచేస్తావా?" అని అడిగితే ఏంకిస్తాంసమాధానం? కాబట్టి యదార్థంగా సంచరించాలె.

ఓకాంపౌండరా! దీన్తో నీకుద్రోహం జరుగుతుందని భయపడవద్దు. ఎవరిమాటలు నేనునమ్మను. నేను స్వయంగావచ్చి పరోక్షంలో విచారించి యదార్థాన్ని తరువాత ప్రకటిస్తాను.

కాని నావ్రాతలు నీ ఉద్యోగాన్ని ఎప్పుడుగూడా ఏం చేయలేవు. అయితే పబ్లికులో నీపేరును మాత్రం క్రిందు పరచవచ్చు. కాబట్టి నాధర్మాన్ని అవిఘ్నాప్రతింగా నిర్వహిస్తాను.

★

## డిష్టి రిజిష్ట్రారు.

వెంకటగిరి దొరతనంవారు యీ మధ్య తన ఎస్టేట్లో కోఆపరేటివ్ సొసైటీలు పెట్టించడానికి కొందరుద్యోగుల్ను ప్రభుత్వాన్ని అడిగి చేబదులు తెచ్చుకొన్నారు. ఆ ఉద్యమాన్ని డిష్టి రిజిష్ట్రారు శతవిధాలా సపోర్టుచేస్తున్నాడు. భేష్! సంతోషింపతగింది!

ఆఎస్టేటుకు సంబంధించిన నెల్లూరు తాలూకా మొల్లూరు సొసైటీవారు అప్పుకోరితే "జమీన్దారీ భూములమీద రైతులకు హక్కు లేదు అప్పు యివ్వకూడదు" అని యి. సి. లో సలహా యిచ్చాడట యీయధికారి.

అక్కడ సపోర్టుచేయడమేమిటి? యిక్కడ వ్యతిరేకించడ మేమిటి? అక్కడ వ్యక్త్యభిమానం సపోర్టుచేయించి, ఇక్కడ వ్యక్తిద్వేషం తిరస్కరింపజేసిందా? అని శంకొకటి బైలుదేరుతుంది.

అక్లైమరొక మాటగూడ చెబుతాను. వెంకటగిరి టవున్లో సొసైటీ వకటుంది. దాన్ని ఎస్టేటు తాబేదార్ల చేతికిందకు తీసుకోవాలని చాలా రోజులుగా కుట్ర. కుర్రేగాదు పెద్ద ప్రయత్నంగగాదాను.

ఈమధ్య యీసొసైటీమీద కంప్లెంటు వచ్చింది. విచారించడానికి రాజాగారి జీతం తీసుకుని వారిక్రింద పనిజేసే కోఆపరేటివ్ ఆఫీసరును విచారించమని సిఫార్సు చేశాడట యీడిష్టి రిజిస్ట్రారుగారు. (దాన్ని పయివారు ఒప్పుకోలేదు లెండి)

ఈ సిఫారసే నిజమైతే డిష్టి రిజిస్ట్రారుగారికి రాజాగారి మీద అభిమానమున్నా ఉండాలె. లేదా యీ సొసైటీ నిర్వాహకుల మీద ద్వేషమన్నా ఉండాలె.

ఉద్యోగులు ఈలాటి దురూహలకు తావియ్యడం బాగుంటుందా?

★

## విద్యార్థినులు

మీ కొక సంతోష వార్త చెవినివేస్తాను వింటారా! నెల్లూరు వి. ఆర్. కాలేజిలో యీ సంవత్సరం 12 మంది విద్యార్థినులు యింటర్మీడియేట్ పరీక్షలకు కూర్చుంటే ఇందులో 9 మంది పరీక్ష అయినారట. ఈ తొమ్మిదిలో 6 గురు ప్రథమ తరగతిలో ప్యాస్ అయినారట. ఇందుకు అభినందించాలసింది కాలేజీనా? విద్యార్థినులనా?

★

తిక్కవరపు రామిరెడ్డిగారి ప్రథమ పుత్రిక శ్యామలా కుమారిగారు బెంగాలు యూనివర్సిటీలో యం. యె. పరీక్షలో ఉత్తీర్ణురాలైందనే సంతోషవార్త మీకు చెబుతున్నాను.

ఈమెంగారు ఇక పొలిటిక్సులోనో, సాంఘిక సేవలోనో, ప్రవేశించి సేవచేస్తే యీమె విద్య, ధనం, లోకకల్యాణార్థం వినియోగపడుతుందని మాయాశ. అరవిందాశ్రమం ఏమంటుందో?

★

## నెల్లూరు తహశీల్దార్.

ఎ. రామచంద్రారెడ్డిగారు కావలికి ట్రాన్సుఫర్ అయినాడు. 7 వ తేది చార్జి యిస్తాడట. వీరి ఆమంత్రణకు తాలూకాలోని ఆబాలగోపాలము కన్నీటిబిందువులతో నీరాజన మిస్తున్నది.

★

## దర్భల వెంకటసుబ్బయ్యగారు.

వీరు 30 సం॥ లుగా ఉపాధ్యాయులుగాను, ఇందులో 18 ఏళ్లు హెడ్మాస్టరు గాను సేవచేసి నేడు రిటైరు అవుతున్నారు. [illegible] ధైరవరును [illegible]

వెం[illegible]

నందు[illegible]

## రాఘవయ్యగారి టీపార్టీ.

మన కైవరకు హనుమంతరావుగారు బొంబాయిలో జర్నలిష్టుగా ఉత్తమ స్థానంలో ఉన్నాడంటే మనమంతా గర్వించతగిందే!

వీరు మొన్న నెల్లూరువచ్చినపుడు మిత్రులు వెన్నెలకంటి రాఘవయ్యగారు వీరికి సుక్కాడు కేసీల్లిచ్చి గౌరవిస్తూ ఆ విందుకు స్థానికంగా జర్నలిష్టుల నెవ్వరినీ ఆహ్వానించలేదట. అందువల్ల జర్నలిష్టులంతా ఆన్యూస్ ప్రకటించకుండా బాయికాట్ చేశారు. ఒకపెద్ద జర్నలిష్టుకు టీపార్టీ యిస్తూ ఇతర జర్నలిష్టుల నాహ్వానించకపోవడం రాఘవయ్యది తప్పే. కాని ఆకారణంతో ఆన్యూస్ ప్రకటించకపోతే రాఘవయ్య చేసిన తప్పుకు హనుమంతరావు పట్ల మనం అవజ్ఞత చేసినవారమౌతాము. కావున జర్నలిష్టు అసోసియేషన్ వార్ని ఆ విషయం మరచిపొమ్మని అడుగుతున్నాను.

★

## రాఘవయ్య, కలెక్టరు.

యుద్ధానికి సైనికులను చేరుస్తుంటే దానికి అడ్డము వచ్చాడని వెన్నెలకంటి రాఘవయ్యగారికి కలెక్టరుగారు వార్నింగ్ యిచ్చారు. ఆ ఉత్తర్వులో వాడబడిన భాష చాలా కఠినంగా ఉంది. విచారించకుండానే రిక్రూటింగ్ ఆఫీసరు మాటమీదనే ఆధారపడి యీభాష వాడడం ఉచితంగాదు.

రిక్రూటింగ్ ఆఫీసరు చేసింది తప్పుఅని తనకు తోచినప్పుడువెంటనే రాఘవయ్యగారు అనదలచిన విషయం కలెక్టరువారికి తెలపివుండే బాగుండేది.

---

## నాయుడుపేట కంపౌండరు

---

గత 17 తేది జమీన్ రైతులో కంపౌండరును గూర్చిన విమర్శ చూచి నేను వెళ్లి ఆసుపత్రి అటెండెన్సు రిజష్టరును పరీక్షించి, చుట్టుప్రక్కల విచారించాను. ఆవ్రాతలు నిరాధారము అని తేలినది.

1938—39 కంటే రోగులసంఖ్య జాస్తిగా ఉంది. డాక్టరుగారు గూడా కాంపౌండరును గూర్చి మంచిఅభిప్రాయమే యిచ్చారు. డాక్టరు మంచివారనీ, వీరే వుండాలనీ యిచ్చట ప్రజల అభిప్రాయంగా గూడా ఉంది.

నాయుడుపేట. 23—5—1940 } శెట్టిపల్లి కోటయ్య, జిల్లాబోర్డు మెంబరు.

★

జమీన్ రైతులో 17-5-40 తేదిన నాయుడుపేట కాంపౌండరును గూర్చి ప్రకటింపబడిన వార్త అబద్ధము

ఈకాంపౌండరు, డాక్టరు, సమర్థులు. వీరు వచ్చినదిమొదలు రోగులసంఖ్య వృద్ధి అయినది. దినానికి 200 మందికి తక్కువలేకుండా రోగులు వస్తున్నారు. ఈవిషయం జిల్లాబోర్డు మెంబరు కోటయ్యగారున్నూ విచారించియున్నారు.

నాయుడుపేట, 6-6-40. } దేవతా చెంచుసుబ్బయ్య

ఈ కాంపౌండరు విషయంలో ఔను, కాదు, అనే రెండు వాదాలున్నట్టున్నవి. వెంకటనారాయణ రెడ్డిగారు నిష్పాక్షికంగా విచారించి ప్రకటించడం బాగుండునని మా సలహా.

(జ. రై. సంపాదకుడు)

---

[illegible]కానుండి 60 లక్షలు రైఫిల్సు, 2500 [illegible]లు అవసరసామగ్రితోకూడా త్వరలో నష్టము చేయబడునని తెలియుచున్నది.

## బుచ్చి ఎలెక్షన్

---

బుచ్చి యూనియన్ బోర్డు ఎన్నికలు జరిగాయి. దొడ్లవారిపక్షము, గ్రామాభివృద్ధి సంఘపక్షము, ఈ యిరువురు పోటీ చేశారు. రెండు వార్డులలో ఒకేవ్యక్తి గెల్చినందున తిరుగా 6 వ వార్డు ఎలెక్షను వొచ్చింది.

దొడ్లవారి పార్టీతరపున మొన్న ఓడిపోయిన పెన్నా రమణారెడ్డిగారున్నూ, గ్రామాభివృద్ధి సంఘపక్షాన గట్టుపల్లి వెంకటప్పయ్యగారున్నూ పోటీచేశారు. 4 తేది సాయంత్రం తేలినసారాంశ మేమిటంటే, వెంకటప్పయ్య గారికి 54 ఓట్లున్నూ, పెన్నా రమణారెడ్డిగారికి 32 ఓట్లున్నూ వచ్చినవి. కావున దొడ్లావారి పార్టీ రమణారెడ్డిగారు అక్షరాలా రెండోమాటు ఓడాడు పాపం!

మరొకవిశేషం ఏమిటంటే? పెన్నా రమణారెడ్డిగారికి గతపర్యాయం 34 ఓట్లు వస్తే, ఈ మాటు 32 మాత్రమే వచ్చినవి. అంటే రెండు ఓట్లు తగ్గిపోయినవి. గ్రామాభివృద్ధి సంఘపక్షానికి గతపర్యాయము 49 ఓట్లు వస్తే ఈమాటు 54 ఓట్లు వచ్చినవి.

దొడ్లవారు యీమాటు యీ ఒక్క వార్డుమీదనే ఆంపిరిబలం, అన్నివిధాలైన బలం వినియోగించిన ఫలితం తమపార్టీకి రెండు తగ్గడం, ఎదుటపార్టీకి 5 హెచ్చడం జరిగింది. దీన్తో టవున్లో దొడ్లావారిబలం శుక్లపక్ష చంద్రునిలాగ క్షీణిస్తున్నదన్నందుకు క్షమించాలె.

ఇప్పుడు బోర్డులో బలం చెరి 6 సీట్లు ఉన్నవన్నమాట. లాటరీవేస్తే కేమడయి నటువంటి కోదండరామస్వామి ఓటు ఎవరికిస్తే వారు గెలుస్తారు. ఆ శుభముహూర్తం 12 తేదిన జరుగబోతుంది.

ఈశ్వరాజ్ఞ ఎట్లున్నదో?

—పౌరుడు.

---

## నూకలపాటి లక్ష్మిరెడ్డి గారి నిర్యాణం

---

అల్లూరు వాస్తవ్యులు నూకలపాటి లక్ష్మిరెడ్డిగారు పక్షవాతముచే మరణించిరని తెలుపుటకు చింతిల్లుచున్నాము.

వీరు కాంగ్రెసు అభిమానులు, జైలుకు సైతం పోయివచ్చినారు, ఉదారు సంపన్నులు. ఆయుర్వేద పరిచయంకర్త.

వీరు స్వంతంగా ఆయుర్వేద వైద్యాలయం పెట్టి ఎల్లరకు ఉచితంగా మందులిచ్చి చికిత్స చేయుచుండిరి. వీరి అకాల మరణమునకు పౌరులు చింతిలుచున్నారు. వీరిసోదరులు వెంకటేశరెడ్డిగారు ఆ ఆయుర్వేద వైద్యాలయాన్ని లక్ష్మిరెడ్డిగారిపేర నిర్వహించడం అవసరం.

—పౌరుడు.

---

## ఉద్ధామసింగుకు ఉరిశిక్ష.

పూర్వపు పంజాబు గవర్నరగు సర్ మైకేల్ ఓడ్వయరును కాల్చిచంపిన ఉద్ధామసింగు దోషియని జూన్ 5 వ తేది లండనులో నిరూపింపబడి, ఉరిశిక్ష విధింపబడినది.

---

భారతీయులపట్ల ఎక్కువ నమ్మిక నుంచి వైస్రాయి కౌన్సిలులో దేశరక్షణ వ్యవహారాలకు భారతీయుని నియమించాలని వైస్రాయికి బొంబాయి యూరోపియన్ రాయబారవర్గము తెలిపెను.

## అరెస్టులు- ఆంక్షలు

### పూనా

చిత్రశాల ముద్రాలయ ప్రొప్రయిటరు వి. జి. జోషి గారు శత్రుకంపెనీలతో వ్యాపారానికి ప్రయత్నించినందుకు రక్షణచట్టంక్రింద 1 సం॥ విడిఖైదు, రు 200 జుల్మానా విధింపబడినది.

### యూపీ

జిల్లాకాంగ్రెసు, పట్టణకాంగ్రెసు, కార్యాలయాలను, 'జాన్ సాన్ గ్రామ్' అనే హిందీవార పత్రిక కార్యాలయాన్ని మరికొన్ని యితర గృహాలను పోలీసువారు సోదా చేశారు.

### కలకత్తా

అ॥ భా॥ కేంద్ర కిసాన్ కార్యవర్గ సభ్యుడయిన ముజఫర్ అహమ్మదుగారికి కలకత్తా, దాని పరిసర ప్రదేశాలను విడిచిపెట్టాలని రక్షణ చట్టం క్రింద నెలరోజుల క్రిందట ఉత్తర్వు చేశారు. వరదియా జిల్లానుగూడా విడిచి పెట్టాలని యింకో వుత్తర్వును గూడా జారీచేశారు.

"రెడ్ ఫ్లాగ్ (ఎర్రజెండా) అను శీర్షికతో నున్న బోల్షివిక్ పత్రికను ప్రభుత్వం నిషేధించింది

కార్మిక పక్షం తరఫున బెంగాల్ శాసనసభ సభ్యుడగు బకిం ముఖర్జీ గారిని అరెస్టు చేశారు.

### అలీఘర్

జిల్లాకాంగ్రెసు కమిటీ కార్యదర్శి మున్షి గజధరసింగుగారు మంచిప్రవర్తనకు పూచీ యివ్వడానికి నిరాకరించినందున 1 సం॥ విడిఖైదు శిక్ష పొందారు.

### లక్నో

స్థానిక కార్మిక నాయకులలో ఒకడైన షఫీద్ అహమ్మద్ నాక్వీని రక్షణ చట్టప్రకారం అరెస్టు చేశారు, ఇల్లుగూడా సోదాచేయ బడినది.

షాఫిక్ అహమ్మద్ సర్వే అనేస్థానిక కార్మిక నాయకుని అరెస్టుచేసి, యిల్లుసోదాచేసి, లక్నో జిల్లా జైలుకు తీసుకవెళ్లి నిర్బంధించారు.

### మదరాసు

గతనెల 27 వ తేదీన కె. యస్. పొన్నుస్వామి వన్‌పై పోలీసువారొక నిర్బంధ వుత్తర్వు జారీచేశారు. 24 గంటలలోపల మద్రాసు విడిచి మలబారు దేశంలోని ఆయన స్వగ్రామమునకు పోవలెనని ఉత్తర్వు సారాంశం. దాని నాయన ఉల్లంఘించినందుకు 9 నెలలు కఠినశిక్ష, రు 250 జుల్మానా, లేకపోతే మరి 3 నెలల శిక్ష, విధించారు.

భారతదేశ కమ్యూనిష్టుపార్టీ కేంద్ర సంఘం వారు ప్రకటించిన "ది ప్రోలెటేరియన్ పాత్" అనే యింగ్లీషు కరపత్రమును ప్రభుత్వం నిషేధించుచూ, వాటిని ప్రభుత్వస్వాధీనం చెయ్యాలని ప్రకటించింది.

### అలహాబాదు

రక్షణచట్టంక్రింద పద్మకాంత మాళవ్యా, కేదార్ నాథ్ మాళవ్యాగార్ల యిండ్లను సోదా చేసి, అరెస్టుచేశారు. మొదటాయన అలహాబాదు ఫార్వర్డుబ్లాకు కార్యదర్శి, మునిసిపల్ బోర్డు వారి శుద్ధిశాఖ అధ్యక్షుడు.

—

## నెల్లూరు సంస్కృత కళాశాల.

**న్యాయము:**

బోర్డింగులోవున్న బ్రాహ్మణులు 30.

బ్రాహ్మణేతరులు 0.

యిదిన్యాయమేనా?

★

**భోజనవసతి:**

5 మందికి పైగా బ్రాహ్మణ విద్యార్థులకు బోర్డింగులున్నూ కలవు. మధూకరము చేసికొను బ్రాహ్మణ విద్యార్థులకు నేయి, మజ్జిగ, కూరలుమున్నగు సౌకర్యముల గల్పించిరి. అదిగాక భోజనశాలలో పూటకు పావుశేరు బియ్యము అర్థణా డబ్బులు యిచ్చినచో బ్రాహ్మణులకు భోజనము పెట్టెదరు.

ఇక బ్రాహ్మణేతర విద్యార్థికి యే సౌకర్యమున్నూ లేదు. కమిటీ సభ్యులారా! యిది మీకు న్యాయమేనా?

—ఒకడు.

—

## నూజవీడు వార్తలు.

### జిల్లాబోర్డు సభ్యత్వాలు

కాంగ్రెసు పక్షాన జిల్లాబోర్డు సభ్యులైన వారన్నా తమతమఫిర్కాల్లో సంచరించి ఆయా గ్రామాల యిబ్బందుల తీర్చడానికి ప్రయత్నించడం అవసర మంటారా కాదంటారా?

### రెస్టేటు ఉద్యోగి

కాంగ్రెసు వాలాగావుండి ఒకతేశ రెస్టేటు వుద్యోగంలో వున్న మాత్రాన్నే లిమిటేషను పట్టిన బాకీలనుగూడా తెమ్మని జబరిస్తున్నాడట నే అరికడు చేయదగినపనేనా?

### అంతఃఛ్ఛిద్రాలు

కాంగ్రెసు వారిలో ఒకరొకరికి వ్యక్తిద్వేషాలుంటేమాత్రం ఆకొట్టుకోవడం న్యాయమేనా? పరాయివాడి ముందర కాలుజారినట్లు యితర పార్టీలకు నవ్వులాటకు కారణంగాదా?

—ఒకవిలేఖరి.

—

## 'ఉదయ భారతి' (గురుకులం)

తిరుగా జూన్ 17 వ తేది ప్రారంభం. వేసంగి తరగతులు జరుగుచున్నవి 941 కాశి ఆడ్మిషన్ పరీక్షకు తరగతులు ప్రారంభమైనవి. విద్యార్థులు వెంటనే ప్రవేశించాలి.

### ఉపాధ్యాయులు.

యీ గురుకులంలో పనిచేయుటకు ఉపాధ్యాయులు కావాలి.

ఆంధ్రులు తమ బిడ్డల్ను యీ గురుకులం ప్రవేశపెట్టమని ప్రార్థన.

—ఉదయభారతి.

తెల్లప్రోలు, కృష్ణజిల్లా.

—

## 7 వ పేజీ కొరవ:

ఇటలీ, జర్మనీలు కలసిరాజీకి మిత్రమండలికి కొన్ని షరత్తులు ప్రకటించవచ్చున్, వారు నిరాకరిస్తే ఇటలీ యుద్ధంలో దిగునని కొందరి వూహ.

కాని ఇటలీ స్వవ్యవహారాలుచూస్తే అంత సుముఖంగాలేవు. సైనికబలమూ తక్కువ. ఇటలీ సామాన్య ప్రజలకు జర్మనీపై అభిమానంలేదు. రోమను కాథలిక్కుల గురువగు పోపుకు ఇటలీ యుద్ధంలో దిగటానికి యేమాత్రం యిష్టంలేదు. రూజ్‌వెల్టు మాటకు కాలతన్నడానికి ముసులోనికి పూర్తి మనస్సులేదు. ఈవిధంగా ముసులోనీ డోలాయమానంలో వున్నాడు.

కాని మిత్రమండలివారు మధ్యధరాసముద్రములో యుద్ధం యేర్పడితే ఎదుర్కొడానికి తగు యేర్పాట్లు చేసుకొనివున్నారు.

### స్పెయినుకు హోరు ప్రయాణం:

స్పెయిన్ యుద్ధంలో ఇటలీ జర్మనీల సహాయంతో ఫ్రాంకో విజయ మొందినాడు. మధ్యధరాసముద్రంలో యుద్ధమొస్తే స్పెయిన్ యే వైఖరి అవలంబిస్తుందోనని ముందుగనే బ్రిటను సర్ శామ్యుయల్ హోరును ప్రత్యేక రాయబారిగ స్పెయినుకు పంపించింది. జిబ్రాల్టరు స్పెయినుకు చెందాలని కొందరు ఆందోళన చేస్తుంటే గీ స్పెయిను యింతవరకు మిత్రమండలికి వ్యతిరేకంగా నిర్ణయం తెలుపలేదు.

### నార్వే

నార్వేలో నార్విక్ పట్టణాన్ని బ్రిటీషువారు జర్మనులవద్దనుండి స్వాధీనపరచుకొన్నారు.

### అమెరికా

మిత్రమండలివారికి అన్నివిధాలా అవసర సహాయం అమెరికా చేస్తున్నది.

## నోటీసు.

కొవ్వూరు గ్రామంలో వేంచేసి వుండే శ్రీ మల్లికార్జున స్వామివారి దేవస్థానం భూములను కౌల్లకిచ్చుటకుగాను సదరు కౌలు మక్తాలు నిర్ణయించుటకు కొవ్వూరు గ్రామచావడి వద్ద తే 15—6—1940 దిన సాయంకాలం 4 ఘంటలకు పబ్లికు వేలం జరుపబడును. గనుక భూములను కౌలుకు తీసుకొనదలచినవారు సదరు యేలంలో పాట పెట్టవచ్చును. వేలం షరత్తులు ట్రస్టీగారివద్ద తెలుసుకొనవచ్చును.

సన్నపురెడ్డి సుబ్బరామిరెడ్డి.

కొవ్వూరు 6—6—1940. } శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం మేనేజింగ్ ట్రస్టి

## ప్రకటన-

ఇందు మూలకముగా యెల్లరకు తెలియచేయడ మేమనగా కొవ్వూరు తాలూకా ఆలూరుపాడు మజరా రెడ్డిపాలెం గ్రామంలోని యీ క్రింద వివరించిన పెడుష్యాలు దాఖలా కోరు మాగాణి.

| పట్టా నెం. | సర్వే నెం. | విస్తీర్ణం |
|---|---|---|
| 105 | 105-బి | 1—64 ట్లు |
| | 105-సి | 0—58 ,, |
| | 106-ఎ/8 | 2—52 ,, |
| | 107-ఎ/2 | 1—24 ,, |
| | 108-డి | 0—76 ,, |
| | 187-(1) | 0—50 ,, |
| 82 | 187-3/ఏ | |
| | యు 1—47 ట్లలో | 0—70 ,, |

కుల్లు 7—94 ట్ల భూములున్నూ

సదరు గ్రామములోని 3 అంకణముల పెంకుటిల్లు, 6 అంకణములమిద్దె యిల్లు, షుమారు 60 అంకణముల ఖాళీస్థలమున్నూ, యిందులోని నానాజాతి ఫలవృక్షములు, యావత్తు కట్టడములున్నూ, సదరు భూములు వగైరాలకు హక్కుదారులైన ఏకొల్లు సుబ్బారెడ్డిన్నీ అతని అవిభక్త కుమార్డు పాపిరెడ్డిన్నీ యిరువురు కలిసి నాకు తే 17—5—40 దిన రు 7177—8—0 లుకు విక్రయించే యీలాగున స్టాంపుమీద విక్రయంఅగ్రిమెంటు సనాతీకముగా వ్రాసియిచ్చి యింమకు సంచకారంగా రు 500/- లు తీసుకొని సదరు భూములు వగైరాలు నా స్వాధీనపరచి వున్నారు.

ఇప్పుడు నేను వినడంలో యితరుల దుస్సలహాలవల్ల పైఅగ్రిమెంటుకు భంగంగా పైవారలు సదరు ఆస్తిని యితరులకు విక్రయం వగైరా పరాధీనములు చేయదలచియున్నట్లు తెలియుచున్నది. నాపేరిటికి వ్రాయించియివ్వబడిన పై అగ్రిమెంటు ప్రకారం నాకు అములు జరుగవలసినదేకాని అందులకు భిన్నముగా వ్యవహరించుటకు యెవ్వరికి యేలాటి హక్కున్నూలేదు. అట్టివి చేసిన యెడల చెల్లనేరవని తెల్పడమైనది—

...రం } ఇట్లు,

(సం) మున్నెమేల వెంకురెడ్డి.

## రంగాగారిపై మరో కేసు

విశాఖపట్టణజిల్లా కాశీబుగ్గ గ్రామంలో మార్చి 28 తేదిన పళాసా అఖిలభారత రైతు మహాసభలోనిచ్చిన ఉపన్యాసముపై ఇండియా డిఫెన్సు ఆక్టు 38 సెక్షన్ ప్రకారం సి. ఐ. డి స్పెషలు బ్రాంచివారు మద్రా... తేది కేసుపెట్టారంట... ప్రొ... మద్రాసు వస్తున్నారు. లో జూన్ ఇంతకాలం సెలవిచ్చి...

ఆ... ఫెల్లుతుపా... బ్రిటనుకు...

## రాష్ట్ర రైతుసంఘానికి విరాళము.

దుగ్గుకూరు వాస్తవ్యులు శ్రీ చెన్నుపాటి భావయ్యగారి కుమార్తె సుబ్బమ్మగారికిని, మట్టిగుంట కాపురస్థులు సుబ్బారాయుడుగారి కిచ్చి 31-5-40 వ తేదీన వివాహము అతి వైభవముతో జరుపబడెను. ఆసమయంలో వధువు తరఫున భావయ్యగారు రూ 25 లును, సుబ్బారాయుడుగారు (వరుడు) రూ 10 లు ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘానికి విరాళముగానిచ్చి మార్గదర్శకులైరి. వీరికి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం తరఫున మా కృతజ్ఞతాపూర్వక వందనాలు. ఆంధ్ర దేశములో మిగతవారుకూడ ఈపద్ధతినే అవలంబించి రైతుసంఘానికి తోడ్పడ ప్రార్థన.

చేగిరెడ్డి బాలిరెడ్డి,
ప్రధాన కార్యదర్శి

---

## జిల్లా రైతు సంఘాలకు హెచ్చరిక.

30-5-40 తేదీన దుగ్గుకూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్రరైతుసంఘ కార్యవర్గ సమావేశ తీర్మానాను సారం అన్నిజిల్లాలకు కావలసిన రైతుసంఘ ప్రాథమిక సభ్యత్వ ఫారములు రాష్ట్రసంఘమే అచ్చు వేయించి రాష్ట్రరైతుసంఘ ప్రధాన కార్యదర్శి సంతకముతో సప్లయి చేయబడును. రాష్ట్రసంఘ ప్రధానకార్యదర్శి సంతకములేని సభ్యత్వపు ఫారములపై సభ్యులను చేర్పించరాదు. జిల్లా రైతు సంఘాలు వెంటనే ఎవరెవరికి ఎన్నివేల సభ్యత్వపు ఫారాలు కావాలో రాష్ట్రసంఘ ఆఫీసు కార్యదర్శి పేర నిడుబ్రోలుకు వ్రాసి తెప్పించు కొన గోరతాను. వాటిఖరీదు ఎంత అయ్యేది తెలుపుతాం, తమకు కావలసిన సభ్యత్వపు ఫారాలు ఖరీదు రాష్ట్రసంఘానికి చెల్లించి వివిధజిల్లా సంఘాలు తమకు కావలసిన సభ్యత్వపు ఫారాలు తెప్పించుకొన గోరుతాను.

చేగిరెడ్డి బాలిరెడ్డి,
ప్రధానకార్యదర్శి.

---

## పొన్నూరి రైతుల మహాసభ.

పొన్నూరి తాలూకా రైతుమహాసభ గత నెల 27 వ తేదీన మాంజూరులో ఇ. వేణు గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జయప్రదముగా జరిగినది. రైతులు తండోపతండాలుగా వచ్చారు. బులుసు సాంబమూర్తిగారు, సామి వెంకటాచలం సెట్టిగారు, భక్తవత్సలంగారు, మొదలగు ప్రముఖులు హాజరైనారు.

వెంకటాచలం సెట్టిగారు రైతులకు నేటి కష్టములు గలవని చెప్పుచు, తన్నివారణార్థమై ఐకమత్యముతో పాటుబడవలెనని ఉద్బోధించుచు సభను ప్రారంభించారు.

అధ్యక్షులు 2½ సంవత్సరపు కాంగ్రెసు పరిపాలనలో రైతులకు కొంతమేలు కలిగెననియు, మంత్రులు ఆకస్మాత్తుగా రాజీనామా లివ్వవలసి వచ్చినందువలన రైతుల సేవనింకా చేయుటకు వీలుకాకపోయినదనియు, కాంగ్రెసునకు సంపూర్ణముగ తోడ్పడి సంపూర్ణ స్వాతంత్ర్యమునకు కృషి చేయవలెననియు, ప్రస్తుతము బ్రిటను జర్మనుల దారుణ యుద్ధము జరుగు చున్నందువలన కాంగ్రెసువారు మౌనము వహించి యున్నారనియు, ప్రకాశంపంతులుగారి జమీన్ రైతు బిల్లును త్వరలో ప్రభుత్వము చట్టము చేయవలెననియు, ఉపన్యసించారు.

—ఇ. వేణుగోపాలరెడ్డి.

## కర్నూలుజిల్లా కాంగ్రెసు ఎన్నికలు

---

గతనెల 15 తేదీ యెన్నికలు జరిగినవి. అధ్యక్షుడుగా కందుల ఓబులురెడ్డిగారిని ప్రధాన కార్యదర్శిగా చేగిరెడ్డి బాలిరెడ్డిగారిని ఎన్నుకోవడమైనది.

రాత్రి జరిగిన జనరల్ బాడీ మీటింగులో యీక్రింది తీర్మానాల చేసిరి.

1. జిల్లాసంఘాన్ని సత్యాగ్రహ సంఘంగా మార్చడమైనది.

2. కోరం నిర్ణయించిరి.

3. పౌరసత్వహక్కుకు భంగంగా నిర్బంధించుటను నిరసించిరి.

4. కాంగ్రెస్ తీర్మానాలకు వ్యతిరేకంగా యీసామ్రాజ్య యుద్ధంపట్ల వ్యతిరేకంగా ప్రవర్తించిన కాంగ్రెసు సభ్యులపై తగినచర్య పుచ్చుకోవలెను.

5. మందసా కాల్పులమన్నా, ప్రభుత్వ ప్రకటనమన్నా సభవారు నిరసిస్తున్నారు.

6. 46 వ ఫసలీ లాండ్ రివిన్యూ వసూలులో అవుకు, తిమ్మానాయుని పేట గ్రామోద్యోగుల అదనం వసూలులో జరిపిన అక్రమచర్యను ఇంత వరకూ విచారింపకుండుటకు అసమ్మతి తెలుపుచూ, వెంటనే తగుచర్య తీసుకోవ్వమని తెలుపుచున్నారు.

7. జిల్లాసంఘం సత్యాగ్రహ సంఘంగా మారింది. కాబట్టి సభ్యులందరూ సత్యాగ్రహ ప్రమాణపత్రాలమీద చేవ్రాలు చేయవలెను లేదా రాజీనామా నియ్యవలెను. అను తీర్మానము లామోదింపబడెను.

బాలిరెడ్డి,
కార్యదర్శి.

★

## కర్నూలు కాంగ్రెసుసంఘం.

పైసంఘం గతనెల 16 తేది ఓబులురెడ్డి అధ్యక్షతక్రింద సమావేశమై చేసిన తీర్మానాలు.

1. అవుకులో వాలంటీరు శిక్షణాశిబిరాన్ని నెలకొల్పడం.

2. కంభంతాలూకాలో వాలంటీరు శిక్షణాశిబిరాన్ని నెలకొల్పి నిర్వహించుటకు రామయ్య, అల్లూరు సుబ్బారెడ్డి, రంగారెడ్డి గార్లను ఆర్గనైజర్లు నియమింపబడిరి.

3. తాలూకా యెలెక్షన్లు నిర్వహించుటకు ఎన్నికోద్యోగుల్ని నియమించడమైనది. ఎన్నిక జూన్ 10, ఓటు లెక్కించుట 12 వ తేదీ, కార్యనిర్వాహక యెన్నిక 26 వ తేది జరుగును.

—ఓబులురెడ్డి.

---

## కర్నూలు రైతు ప్రయాణీకుల సభ.

జిల్లా రైతు ప్రయాణీకులసభ కంభం తాలూకా గాంధీనగర్ పెద్దవారిపు పేటలో జూన్ 18 తేదీన జరుగును ఎల్లరు విచ్చేయ ప్రార్థన.

—కార్యదర్శి.

---

## ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశం.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశం యీనెల 12 తేది మధ్యాహ్నం 12 గంటలకు బెజవాడలో పశ్చిమకృష్ణజిల్లా కాంగ్రెసు కార్యాలయంలో జరుగుతుంది. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులగూర్చి సమాలోచన చెయ్యడమే ముఖ్యోద్దేశ్యము.

## మద్రాసు శాసనసభ్యుల జీతాల ఆపుదల

---

భారత ప్రభుత్వ చట్టంలోని 93 వ సెక్షన్ ప్రకారము గవర్నరే రాష్ట్ర ప్రభుత్వమును చలాయించుటకు కాలము పెంచ్చించబడినదని, ఇప్పుడు శాసన సభ్యులు చేయుచున్న పని యేమీ లేదుకాబట్టి తే 1-7-40 నుండి వారికివ్వు జీతములు ఆపిచేయబడినవని ప్రభుత్వమువారు ప్రకటించారు.

---

## మదరాసు అసెంబ్లీకి ఎన్నిక జరుగదు.

---

మదరాసు లెజిస్లేటివు అసెంబ్లీలో కడలూరు సాధారణ గ్రామీణ నియోజకవర్గ ప్రతినిధిగా వుండిన శ్రీ క. సీతారామరెడ్డిగారు భారత శాసనసభకు సభ్యులుగా యెన్నుకోబడ్డారు. ఈ మూలంగా యేర్పడిన రాష్ట్రీయ శాసనసభ ఖాళీకి ఎన్నిక యేర్పాటుచేయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలియజేశారు.

---


50 సంవత్సరములుగా ప్రఖ్యాతి చెందిన

**మదనమంజరి మాత్రలు**

ధాతుక్షీణత నులబద్ధకము, స్వప్న స్ఖలితము, నిటికి ఉత్కృష్టమైన గుణమును ఇచ్చును. ఇవి రక్తమును,వీర్యమును, అధికపరచి దేహమునకు క్రొత్త ఉత్సాహముకలిగించును. వెల డబ్బీ రు1.

**రమణి విలాసిని**

కామశక్తిని వృద్ధిపరచి, శీఘ్ర స్ఖలనమును నిలిపి ఎల్లరకును సంభోగములో తృప్తి నొందించును. వెల డబ్బీ రూ 1.


మదనమంజరి ఫార్మసీ,
(/) 184 చైనా బజారురోడ్డు, మదరాసు.
నెల్లూరు: ఆర్యక్ ఫార్మసీ, ట్రంకురోడ్డు.






ఒసారి "వెల్ కమ్" బీడీ కాల్చిచూచిన దాని సువాసన, శ్రేష్ఠత మీకు తెలియగలదు.








## పుస్తకాలు స్టేషనరీ

మేము నూతనముగ నెల్లూరు చిన్నబజారులో క్రిష్ణా & కో., అను పేరుతో పుస్తకముల షాపును స్థాపించియున్నాము. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల, హిందీ, తమిళ పుస్తకములు, స్కూలు పుస్తకములు, స్టేషనరీ సామానులు యెవరికే పుస్తకములు కావలసినను, సరసమైన వెలలకు దొరుకును. గాన తామెల్లరు మా వ్యాపారమునకు తగు ప్రోత్సాహమియ్యగలందులకు ప్రార్థించుచున్నాము.

బజారు నెల్లూరు } క్రిష్ణా & కో., బుక్ సెల్లర్సు & జనరల్ మర్చెంట్సు.

కథ:

# మాయలుగా మగవారి కృత్యముల్:

కే. వేణీ కోరవ.

"ఇంకేముంది! అనుకొన్నంతా అయింది. కథంతా అడ్డంగా తిరిగింది. నాకు తెల్సు. యీ దొంగముండకు స్కూలు ఫైనలుదాకా యెప్పుడు చదువు చెప్పించేనో, అప్పుడే వొచ్చింది ముసలం. ఒక్కెగాడిదా! దానిష్టమొచ్చినట్లల్లా పోనివ్వవాకే అంటే విన్నావా? ఆడాడిందాట, పాడిందిపాట, రేపూ యెల్లుండి చూస్తాను నా యింట్లో వుండకర్లేదట చేస్తాను. అందుకద్దమెచ్చేట్టుగావుండే నువ్వూ బయటికి నడు! అంతే"

"అంత కోపమెందుకండీ! యింకా రెండు దినాలు చూస్తే, దానిబుద్ధే మారుతుందిగా! అదుగో, మళ్లా అదేమాట. యిప్పుడు గడ్డితిన్న దానికేమంటావూ అంటా! మించిపోయింతర్వాత నీతరమా నీయబ్బతరమా!"

అందుకేం బదులు చెప్పలేక గిఱ్ఱున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది కామేశ్వరమ్మ.

★

ఆనాడు శనివారం ఉదయం 8 గంటలయింది. వేరావధాన్లు పంతులూ సైట వరండాలో కూర్చొని యేమేమో మాట్లాడుకుంటున్నారు. ఉన్నట్టుండి పంతులు "వేరయ్యా! ఆ పిల్లవాడు ఇప్పుడీవూళ్లో లేడటుగదూ" అన్నాడు. ఆ! మొన్ననే పరీక్షలు వ్రాసేసి, నెల్లూరు వెళ్లాట్ట. వాడేగాని మొన్న నాకంటబడుంటే, బుఱ్ఱచితక గొట్టేద్దును. అంటూ ఠకీమని సులోచనాల కేసును బల్లపైకి గుద్దేడు అవధాన్లు.

ఏం:- వేరయ్యా! చూడబోతే నిన్నా, యివ్వాళ్టికీ దానిబుద్ధి మారినట్లే తోస్తుందోయ్.

వే:- యేమో? "క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్" ఎల్లా మారుతాయో యీ కుఱ్ఱముండల బుద్ధులు- వినా నిదానించి చూద్దాం-

"అర్నీ, నేననేది" అన్నాడు పంతులు. ఆ మాటల్లో కూతుర్ని గురించి కొంతఆశ అతన్లో యింకా వ్యక్తమౌతోంది. ఇదంతా ప్రక్క రూంలోంచి చప్పుడుచేయకుండా వింటోంది రమ. అప్పుడే పోస్టుప్యూన్ వచ్చి కవరొకటి టేబిల్ పైన వేసి వెళ్ళాడు. పంతులు సులోచనాలు సవరించుకుంటూ పై అడ్రసు చూశాడు.

టు—

మిస్. రమాదేవి,
123, గోడవున్ స్ట్రీట్
మద్రాసు.

అప్పటికే పంతులుగారి కండ్లు జేవురించినయ్. యేంటో కొంప మునిగిందని వేరయ్య యింకా ముందుకు కుర్చీ లాక్కున్నాడు మొహం మీద వున్న సులోచనాల్ని కండ్లపై కద్దుకుంటూ.

పంతులు కవరును ఫర్‌మని చించి యిల్లా చదివేడు.

రమా!

మొన్న బుధవారంనాడు నెల్లూరికి సుఖంగా చేరాను. నిన్ను నేను మరచిపోను. నన్ను నువ్వు మరువవద్దు. నీకక్కడ యేదేనా బాధగావుంటే యీ క్రింది అడ్రసుకు వచ్చేయి. మనకేం భయం లేదు. ఆ వేరావధాన్లుగాడు మీ నాన్నకు యేదేనా ప్రబోధించి నిన్ను బాధించుతాడేమో? జాగ్రత్త!

సి. కె. రావు,
ఛానల్ ప్యూ- నెల్లూరు. } —కృష్ణమూర్తి.

నిశ్చలంతొక్కున కోపయ్యాడు. పంతులు. (పండ్లు పటపట కొరుకుతూ) వేరయ్యా, చూచేవా?

వే:- చూచేదానికేముంది? "స్త్రీషుదుష్టాసు వార్ష్ణేయ, జాయతే వర్ణసంకరః"... పూరికే అన్నారా? సవ్యసాచి.

ఏందో గలభా అని కామేశ్వరమ్మకూడా అక్కడికొచ్చింది.

పం:- చూచేవా మీఅల్లుడి వుత్తరం?

ఇకేంటండీ వేళ్లాకోళం. మీఅల్లుడికి చదువు రాదని మొన్ననేగా చెప్పేరు?!

ఆ అల్లుడుగాడే నీదుంప తెగా ఏ. య్యే అల్లుడు- రెండోఅల్లుడు- తెల్సిందా?

కామేశ్వరమ్మ ముఖంలో యింతకుముందున్న కళ తగ్గిపోయింది. వెంటనే పంతులు చరచరా నడిచి రమాదేవి రూంలో కొచ్చేడు. యీవగారి వెనకాలే మంత్రి వేరయ్యగారూ కూడా కోర బడ్డారు. పంతులు రమను గదమాయిస్తూ.

ఏం చిన్నే! కదులు నా యింట్లోంచి. ఇహ ఒక్క క్షణం కూడా వుంటానికి వీల్లేదు. బజారుముండా! నాయిల్లు గుల్లజేశావు గదే. నన్ను భ్రష్టు పట్టించావుగదే. ఊ! కదులు-

యెందుకు నాన్నా-

ఎందుకా; నువ్వుచేసిన పాపానికి శిక్షకోసం.

మీరు జేసిన పాపానికి శిక్షలేదా- నాన్నా! నేనేం పాపం చేశాం?

నన్ను ముసలాడికంటగట్టి నాగొంతు గొయ్యడం మీపాపం గాదూ-

(శివ! శివ! అంటూ చెవులు మూసుకుంటాడు వేరయ్య)

ఊఁ! వాగుతూనే వుంటావా- మెడబట్టి గెంటించనా- ఛా! వాడు రమ్మన్నచోటికే ఫో- దొంగముండా!

కామేశ్వరమ్మదుఃఖంతో గిలువునా కూలిపోయింది - యేమీ మాట్లాడలేకపోయింది-!

నాన్నా! పెద్దవాండ్లుచేస్తే పెరుమాళ్లుకు జెందుతుందన్నట్లు, మీరుజేసిన పాపానికి శిక్షలేదు. నాబోటి నోరులేని పిల్లలు చేసినదంతా పాపమా...సరే...నేం- పోతానుగాని- మీరేసుఖంగా వుండండి.

కామేశ్వరమ్మ వెంటనే కూతుర్ని కౌగిలించుకొని భోరున యేడ్చింది. రమ కండ్లల్లో నుండి యేకధారగా దుఃఖాశ్రువులు రాల్తున్నాయ్ పాపం! ఆతల్లికడుపు తరుగుకుపోయింది. ఛా... అని మెడబట్టి గెంటేడు రమను- నిర్దాక్షిణ్యుడైన పంతులు.

★

ఆనాడు సాయంకాలం 4 గంటలకు నెల్లూరు స్టేషన్ దిగింది రమ. అక్కణ్ణుంచి విచారించుకుంటూ ఛానల్‌ప్యూలో కొచ్చి దిక్కుతెలీకుండా నిలుచుంది. ఎవరో ఒకాయనవచ్చి "ఎవరమ్మా మీరూ?" అన్నాడు. "ఏమండీ! ఇదేగదూ ఛానల్ ప్యూ?"

"ఆ! ఇదే!ఇదే"

"ఐతే యిక్కడ కృష్ణమూర్తి రావుగారి యిల్లెక్కడండీ"

"అదో అక్కడ్నే. ఆహోటలుంది చూశావూ. అక్కణ్ణుంచి యిల్లాతిరిగితే ఆదే వాళ్ల యిల్లు."

రమ కృష్ణమూర్తి యింటిదగ్గరకెళ్లి తలుపు తట్టింది. కృష్ణమూర్తి తలుపు తెరిచాడు. మూర్తికి గుండె ఝల్లుమనింది.

"ఏం రమా! వచ్చేశావా."

రమ కండ్లల్లో నీళ్ళు కారిపోతున్నాయి. తలొంచుకుంది యేమీ మాట్లాడకుండా. అప్పుడే వీధిలో బిక్షగాడొకడు యిలాపాడుతూన్నాడు.

"నీటముంచినా పాలముంచినా నీదేభారమయ్యా దశరథరామయ్యా," అని.

"రమా! యింట్లోకిరా! అన్నాడు మూర్తి. రమకు గుండె కొంచెం కుదుటబడ్డది. అది మూర్తి వుండేరూంమాత్రమే. అసలిల్లు సింగరాజువీధిలో వుంది. ఇద్దరూ రూంలో చెరొక చేర్‌లో కూర్చున్నారు. మనమూర్తి ధర్మసంకటంతో ఆలోచిస్తున్నాడు. ఇంతలో యెవరో గుమ్మంలో జట్కా దిగారు. కృష్ణమూర్తికి ఒళ్లు ఝల్లుమంది. యింకెవరూ! మామగారు జగన్నాధం, భార్య కృష్ణవేణీ, మూర్తి నాన్నగారూ, యింట్లోకొచ్చారు. రమ నిర్ఘాంతపోయింది స్పెషల్ రూంలోకి వెళ్లొచరూ, యెందుకొచ్చేరో అని.

ఏమండీ మామగారూ యిదేనా రావటం అన్నాడు కృష్ణమూర్తి.

ఔను, బస్సు యిక్కడే దిగడంవల్ల కొంచెంసేపు రెస్టుతీసుకొని తరువాత స్టోర్‌హౌస్‌పేటకు బండికట్టించుకుపోతామని నీరూంయిక్కడే వుండటంవల్ల వచ్చేశాము, ఏం? నీపరీక్షలయ్యాయా? మూర్తి!

ఆ! (అన్నాడు దిక్కుతెలీకుండా)

మూర్తి నాన్నకు రమను చూస్తుండగానే ఒళ్ళు ఛర్‌మని మండింది యెవర్రా ఈఅమ్మాయి మూర్తీ! అన్నాడు. యిక్కడి యస్. ఏ. క్లాస్ మెట్ నాన్నా! చూడ్డానికొచ్చింది. అన్నాడు తేలిగ్గా. రమకు యీతంతు అంతా యేమీ బోధపడలేదు. ఆ క్రొత్తగా వచ్చిన అమ్మాయి ఎవరో అడగాలనుకొని.

యీవిడ యెవరండీ! అని ప్రశ్నించింది కృష్ణమూర్తిని. మూర్తి గుటకలు మ్రింగుతూ బిత్తరి చూపులు చూస్తు.

ఆ...దే...మ-మ-మ్మా అవిదేగదూ!

రమకు గుండెనీరైపోయింది. కండ్లెల్లబడేయి. హృదయంలో పెద్ద సుడిగాలి రేగింది. పెదవులు గడగడా వణుకుతూన్నాయి.

మూర్తిగారి మామా నాన్నా తెల్లబోయి చూస్తున్నారు. కృష్ణవేణి వస్తుండగానే నేరుగా లోపలికెళ్ళి చంకలో బిడ్డను పట్టుకోని కిటికీ పూచలగుండా చూస్తోంది యీనాటకం. రమకు ప్రపంచమంతా చీకటిమయం అయిపోయింది. దూరపుకొండ నునుపనుకొంది పాపమీ అభాగ్యురాలు.

...అంటేః...అని ప్రశ్నించింది కుర్చీలోంచి లేస్తు.

నా వైఫ్.

ఆ!......

—




నమ్మకమైన నగల వర్తకులు
గుండాల పేరారెడ్డి
చిన్నబజారు - నెల్లూరు.
నమ్మకమగు బంగారు, వెండి
నగల వర్తకులు.
మీకు కావలసిన నగలు సిద్ధముగా తయారు చేయబడియున్నవి. లేనివి ఆర్డరుయిస్తే వెంటనేచేసి యివ్వబడును

కుష్ఠు బొల్లి: వగైరా
కుష్ఠు, బొల్లి, మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స: కేటలాగు-ఉచితం
బి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) ప్రొప్రయిటరు
జి. వి. రెడ్డి, గోపాలపురం, తూ॥ గో॥ జిల్లా.

ఆర్టిస్టు-
ప్రకటనలందంగా, ఆకర్షవంతంగా ఉండాలంటే ఆర్టిస్టుచేత బొమ్మలుగాని, అక్షరాలుగాని వ్రాయించి బ్లాకు తీయించి ప్రకటించాలె.
సలీసుగా, ఆకర్షవంతంగా వ్రాసే ఆర్టిస్టు కావాలంటే—
పి. శేషయ్య,
C/o ఆర్టిస్టు,
జమీన్ రైతు, నెల్లూరు.

ఇండియా, బర్మాలో 56000 కుటుంబములు
"జనరల్ అస్యూరెన్సు"
వలన రక్షణ పొందుచున్నవి.
ఈనాటికి రు. 3,70,00,000 పైబడిన భీమాపట్టాలు అమలులో యున్నవి.
రు. 62,00,000 పైగా ప్రజలకు "క్లైయిము" చెల్లింపబడినవి.

| వ్యయము ఎంతో తక్కువ! | పట్టాదారులు పొందే బోనసు రేటు చాల ఎక్కువ! |
|---|---|

1907 లో స్థాపితము — అజ్మీరులో హెడ్డాఫీసు.
జనరల్ అస్యూరెన్సు సొసైటి లిమిటెడ్ మిగుల ప్రఖ్యాతికి వచ్చినది.
నెల్లూరు- చిత్తూరుజిల్లాలలో పనిచేయు ప్రతినిధులు వివరములకు వ్రాయుండి.
బ్రహ్మదత్త ఎస్క్వయిర్, B. Sc., LL. B., F. S. S. (London) జనరల్ మేనేజరు, అజ్మీరు.
బి. జె. ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, నెల్లూరు.

## వార్తావళి.

### ఆనందమోహనుని అస్తమయం.

అఖిలాంధ్ర దేశమునందేకాక అఖిల ప్రపంచ విఖ్యాతిని గడించిన ఆంధ్రచిత్రకారుడైన కొచ్చా ఆనంద మోహనశాస్త్రిగారు గత 25 వ తేదీ నాడు మధ్యరాష్ట్రములందలి దేహానులో కాలధర్మము చెందిరి. వీరు కొలదికాలముగా అనారోగ్యముతో నుండి చికిత్సార్థ మక్కడికి వెళ్లియుండిరి. కాని అకాలమరణము తప్పలేదు. 32 ఏండ్ల పసివయస్సునందే అంతర్జాతీయ యశస్సును ఆర్జించిన ఈ ఆంధ్రచిత్రకారుని మరణము ఆంధ్రలోకమునకు తీరని కొరతను కల్పించినది; ముదుసలియైన ఆతండ్రి - శ్రీ రామశాస్త్రిగారికి కడుపు కోతను కల్పించినది. అమూల్యములైన ఇతని చిత్రము లనేకము విదేశ ప్రదర్శనాలయములలో ప్రదర్శింపబడి అనేకవిధములయిన సత్కారములను బడసినవి. వీరిసోదరులే కొచ్చా రామమోహన శాస్త్రిగారు.

★

### చక్కెర కొనుగోలు

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, మారిటస్, ఫిజి, బ్రిటిష్ వెస్టిండీసు దీవులనుంచి ఎగుమతి అయ్యే పంచదార ఎగుమతినంతనూ, కొనడానికి ఏర్పాట్లు చేయబడినవని బ్రిటిషు ఆహారశాఖామంత్రి వర్గ పార్లమెంటరీ కార్యదర్శి బూత్ బీ కామన్సు సభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలియ పరచాడు. అసలు ఈ పంచదార ఎగుమతి మొత్తం 1750000 టన్నులు. వీటిలో బ్రిటను కొనేది 1250000 టన్నులు.

★

### పాలవర్షము

అనకాపల్లిలో మే 27 వ తేదీన సూర్యరశ్మి లేకుండా ఆకాశభాగం అంతయు నా వితో నిండియుండుటచేత దూమలో దుంపవలె ఉడికి పోవలసి వచ్చింది. రాత్రి ప్రజలందరు గృహములకు వీధులలో నిద్రింపుచుండ 11 గంటల రాత్రి వేళప్పుడు చల్పచల్పగా పాలవర్షము కురిసినది. ఉదయము చూచుసరికి చెట్లాకులపైని యితర [illegible]పములపైనన్ని పాలచినుకులవలె పడి తెల్లని మచ్చలు లేరియున్నవి. ఇదిజూచి పాలవర్షమని ప్రజలు భావించుచున్నారు.

★

### పిడుగుదెబ్బ.

ఆఫ్ఘనిస్థానంలో కుర్రాబాగ్ కొండలమీద పిడుగు పడడంవలన 200 గొర్రెలు వాటికాపరి చనిపోయారు.

★

### ఈజిప్టుకు ఎగుమతులు.

యుద్ధము ప్రారంభమైనప్పటి నుండి యిండియాలోని ఫరములు ఈజిప్టుకు 43 లక్షల 66 వేల రూపాయలు విలువగల యినుప, ఉక్కు సమ్మనులను ఎగుమతి చేసినవి.

★

[illegible]లోని విదేశీయులలో యెవరైనా సరే 16 సం॥ లకు పైబడినవారు పోలీసు లైసెన్సు లేక సైకిలు, మోటారు, నావ, విమానములనుంచుకొనరాదని, రాత్రిళ్ళు 12 గం॥ మొదలు 6 గం॥ వరకు యిండ్లువదలరాదని ఉత్తర్వు చేయబడినది.

★

జయపూరు మహారాజుకు వివాహం జరిగింది. పెండ్లికూతురుకు 3 లక్షల రూపాయల సొమ్ము పెట్టారు.

## వింతలు - విశేషాలు

గ్వాలియర్ సంస్థానములోని మెరనాలో ఒక పర్తకుడికి 16 అంగుళాల గడ్డంవుంది. ఒక జ్యోతిష్కుడు ఒకరోజున నీగడ్డం అదృష్టానికి అడ్డంగా వుందన్నాడు. అంతట వాడిమాట నమ్మి ఒకరోజున గడ్డం గొరిగించాడు. అప్పటి నుంచీ అతని కొత్తముఖం జూస్తానికి చాలా మంది వస్తున్నారు. చేరాలు భాగానాపుతు న్నాయి.

★

సింహళద్వీపానికి పైబుతీమాల సముద్రంలో తెంపల్లా అఘాతంలో ఒక తిమింగిలం కనబడింది. దానిపొడవు 50 అడుగులు.

★

తూర్పు రాజపుటానా మంగళపూరులో ఒక గొప్ప భూస్వామి వున్నాడు. అతనివద్ద ఒక ఆడ యేనుగు ఒక మగయేనుగు చాలాకాలమునుండి కలసి మెలసి వుంటునవి. ఈమధ్య ఆడయేనుగు నెక్కడికో తీసుకవెళ్లారు. అప్పటినుండి మగయేనుగు మావటివాడు యెంతబ్రతిమాలినా తిండి తినడం మానేసింది. దానిమీద యీ సంగతిని మావటివాడు యజమానితో చెప్పాడు. అతడు జమానివచ్చి యేనుగును తెగతిట్టాడు. ఈతిట్ల భావమును గ్రహించి ఆమొగయేనుగుకు చాలా కోపంవచ్చి, పెద్దఅరుపు అరిచి యజమానిని కాలితో తొక్కి చంపేసింది.

★

బుండి ఆనేవూర్లో ఒకచోట రాత్రిపూట కావలివుండేవాడొకడు గలడు. మామూలుగా నడుముకు బెల్టుపెట్టుకుంటుంటాడు. ఒకరోజు రాత్రి ఆబెల్టు వూడిపోయి అతనికాళ్లకు చుట్టుకుంది. ఇదిజూచి అతనికి ఏదోపాము కాళ్ళకు చుట్టుకుందనే భయంకలిగింది. ఈ భయంతోనే ఇంటికి పరుగెత్తిపోయి వెంటనే చనిపోయాడు.

★

స్త్రీలకు, ఆడపిల్లగాని మొగపిల్లవాడుగాని కలుగుట, చాలా యేర్పడ్డది మొందలు వారుతిను ఆహారముపై ఆధారపడి వుంటుందని, అమెరికన్ డాక్టరు మిల్లరుగారు సెప్పతున్నారు.

కార్బొహైడ్రేట్సు హెచ్చుగావున్న పుష్టికరమైన పదార్థాలను తింటూవుండిన స్త్రీలకు ఆడపిల్లలే పుట్టారట, లేక చవుకైనతిండితిను లేద స్త్రీలకు మగబిడ్డలే పుట్టారట.


★

సింహళద్వీపములోని కొట్టియార్ లో మొట్టమొదటి సారిగా స్త్రీలు యెన్నికలలో పాల్గొన్నారు. అందరికీ అతివుత్సాహంగావుంది. కద్దల్ పడీ చాన్ గ్రామస్థుడొకడు తనకు నచ్చిన ఒక అభ్యర్థిని విషయమై ఆమె తప్పకుండా గెలుస్తుందని, గెలవకపోతే తన చెవికోసి యిస్తానని పందెం వేశాడు.

దురదృష్టంవలన ఆ అభ్యర్థిని ఓడిపోయింది. ఆగ్రామస్థు డెంత పిచ్చివాడో చూడండి! తన మాట బుజువు చెయ్యడానికని, తన చెవిలో కొంత ముక్కకోసి, దానిని గ్రామమధ్యభాగం లోని చింతచెట్టుకు మేకువేసి కొట్టినాడు.

★

సింధునదిలో చేపలుపట్టే ఒక మహమ్మదీయ బెస్తవలలో ఒక తళతళ మెరిసే చేప పడ్డది. ఆచేపను వాడు బుట్టలో వేసుకొని యింటికి క్కాడు. ఒక రాత్రివేళ ఆబుట్ట మండుతున్నట్లుగు పడ్డది. చేపను చేతిలో యుంచుకొంటే చేతిలో గూడ వెలుతురు వస్తున్నది. అంతే దాన్ని నీళ్ల తొట్టెలో వదేస్తే ఆనీళ్ళుగూడ తళతళ మెరుస్తున్నాయి ముత్యాలులాగ. యీవింతె చూడ డానికి చుట్టుప్రక్కలజనం ఆ "ఖాన్" గ్రామానికి తండోపతండాలుగా వస్తున్నారు.


సకలుమందులను చూచి
మోసపోకుడు.
40 సంవత్సరములుగా ప్రఖ్యాతి
జెందిన దివ్యామృతము




అమృతాంజనము




తామరమందు
సకలవిధములైన చర్మ
వ్యాధులను రెండేపూతలతో
నిర్మూలము చేయును



డొంగ్రేగారి
బాలామృతము
బలహీనమైన బిడ్డలకు
పుష్టియును బలమును
ఆరోగ్యము నిచ్చును.

రామకృష్ణ ఖాదీభాండారం

★ ట్రంకురోడ్డు— నెల్లూరు. ★

మావద్ద అన్నిరకాల శుద్ధఖద్దరు దొరుకును. సన్నము, జరీపేటు, రాజాపాళెం, పొందూరు కనుపూరు, ముప్పగు అన్నిరకాలేకాదు ఆర్డరిస్తే కోరినమాదిరి నేయించి గూడా యిస్తాం

రాయవరపు జగన్నాథం,
ప్రొప్రయిటరు.

# సంస్థానాలు

## త్రెహ్రీసంస్థానం ఆజ్ఞ

ఈసంస్థాన ప్రజల పరిస్థితులను గమనించి తెలుపవలసిందని జవ్హరిలాల్ గారు సలహా యివ్వగా శ్రీ దేవసుమన్ గారు త్రెహ్రీ గార్వాల్ సంస్థానం వచ్చారు. ఈయన అఖిలభారత సంస్థాన ప్రజాసంఘానికి చెందినవారు. ఈయన ఏపార్టీకి చెందినవారో నిర్ధారణగా తెలియ చెయ్యనిదే సంస్థానంలో, ఎక్కడా ఉపన్యాసాలు చెయ్యకూడదని సంస్థానాధికారులు ఆజ్ఞాపించారు. దీనికి ఆశ్చర్యం తెలుపుతూ సుమన్ గారు సమాధానం పంపారు.

★

## కథియవారులో కరువు నివారణ

కథియవారులో కరువు నివారణ ప్రయత్నాలు వ్యవస్థాపన చెయ్యడానికి దర్బారు గోపాలదాసు దేశాయిగారి అధ్యక్షత క్రింద నిన్నను యిక్కడ కథియవారులోని వర్కరుల సభ జరిగింది. వివిధ స్థలాలలో చవుకగా ధాన్యం అమ్మే దుకాణాలు ఏర్పాటు చెయ్యాలని నిశ్చయించారు. గుజరాతు రాష్ట్రీయ కాంగ్రెస్ సంఘమువారు వసూలు చేసినధనం 75000 రూపాయలనుండి యీధాన్యపు దుకాణాలకు పెట్టుబడి పెట్టవచ్చున్నారు. ఇదివరకే ఇలాంటివి 50 దుకాణాలు తెరిచారనీ, మరికొందురోజులలో ఇంకో 50 ధాన్యం దుకాణాలు తెరుస్తారని తెలుస్తుంది.

★

## మహారాజ కుమార్ దానం

కీ. శే. దీనబంధు సి. ఎఫ్. ఆండ్రూసుగారి స్మారకనిధికోసం గాంధీ మహాత్ముడు విరాళాలు, చందాలూకోరుతూ చేసిన విజయనగరం మహారాజ కుమార్ సర్ విజయాగారు (ఎం. ఎల్. ఏ.) రూ 501/- దానం చేశారు.

★

## మూర్షిదాబాదు సంస్థానంవారి దానం

మూర్షిదాబాదు నవాబు రాజప్రతినిధి యుద్ధ సహాయనిధికిగాను 2 వేల రూపాయలు దానం చేశారు.

★

## స్వత్ సంస్థాన విరాళం

యుద్ధకార్యాలయ నిధికోసం పై సంస్థానం వారు 30 వేలరూపాయల విరాళంచేశారు. ఇంతే గాకుండా, యుద్ధం జరుగు చున్నంత కాలమూ సాలీనా 20 వేల రూపాయ లివ్వడానికి వాగ్దానం చేశారు.

★

## నైజాంప్రభువు విరాళం

తనసేరట రెండు ఫైటర్ విమానదళాలు పోగించటానికిగాను, హైదరాబాదు నైజాం 50 వేల పౌన్ల విరాళంచేశాడు.

★

## ఇండోర్ మహారాజాదానం

వానికుల సహాయార్థం యేర్పాటు చేయబడిన కింగ్ జార్జినిధికి 11 వేల రూపాయలదానం చేశారు.

★

## సంస్థానాధిపతుల సమావేశం.

సంస్థానాధిపతుల స్థాయిసంఘ సభ్యులు బొంబాయిలో యీనెల 21, 22 తేదీలలో సమావేశమవుతారట.

## మందసా కాల్పులు

———

### ఆం॥ రా॥ కాం॥ సబ్ కమిటీ వారి రాక.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు నల్పిన పిమ్మట మిగతా సబ్ కమిటీ సభ్యులగు శ్రీ కళా వెంకట్రావు మాగంటి బాపినీడుగార్లుకూడ మందసా కాల్పులు విచారణకై వచ్చిరి. మొత్తం వారం దినములు విచారణ సాగించారు. అక్రమముగా పైళ్ళకోలకి నరికివేశారని ప్రభుత్వం ప్రకటించిన చౌన్నాళి రిజర్వుఫారెస్టు శ్రీ వెంకటరావు బాపినీడుగార్లు 30 తేదీన ఉదయమువెళ్ళి పరిశీలించి మందసాకోటకు వెళ్లి దివానుగారితో సంప్రతించి అచ్చటి పరిస్థితులు తెలుసుకొని కాల్పులకు, నిర్బంధాలకు గురిఅయిన వీరగున్నమ్మపురం, దబారు, పుచ్చపాడు మున్నగుగ్రామాలు కాల్పులు జరిగిన స్థలం కూడా చూచారు. ప్రజలనుండి అనేక ఫోటోగ్రాఫులు గైకొన్నారు. 31 వ తేదీన చనిపోయిన, గాయపడిన నిర్బంధములో నున్నవారందరి పరిస్థితులుగూర్చి వెంటనే సహాయమవసరంగానుండే కుటుంబాల సంఖ్యలు గైకొన్నారు. రాష్ట్రకాంగ్రెసుపక్షాన పేదల సహాయం కొరకు ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశంపంతులు గారిచే పంపబడిన రు 100-0-0 లు ఖర్చుపెట్టి దబారుగ్రామంలోని పేదలందరకు బట్టలు, ధాన్యము, చొక్కాలు పంచిపెట్టారు.

—ఒక విలేఖరి.

———

## మద్రాసు ఆంధ్ర కాంగ్రెసు వాలంటీరు శిబిరం:

మూడవవారం దయానంద రాజాగారి అధ్యక్ష్యంక్రింద చక్కని శిక్షణ జరుపబడ్డది. ప్రతిరోజు ఉదయం డ్రిల్లు, సాయంత్రం ట్రాప్ మార్చి వుంటున్నది. ఆసనాలు, వ్యాయామము నేర్పబడుతున్నది. జాతీయ గీతాలు, నేర్పబడుచున్నవి. హిందూపత్రిక ఆఫీసు వివరాలు చూపబడ్డవి. వివిధ విషయాలు, మంత్రుల కార్యకలాపాల్ను గూర్చి ఉపన్యసింపబడ్డవి. డా॥ లక్ష్మీపతిగారు వైద్యవిషయాలు, ఆరోగ్య విషయాల్నిగూర్చి వుపన్యసించిరి. రుక్మిణమ్మగారు జపానుయాత్రను గూర్చి, చైనా జపాను యుద్ధాన్నిగూర్చి, ఉపన్యసించిరి. చుండి జగన్నాథం సామ్యవాదము మున్నగు విషయములగూర్చి ఉపన్యసించిరి.

—ప్రచురణాధికారి.

———

## పాలకొండ తాలూకా రైతు ప్రచారము-

రైతు ప్రచారకులు రైతు ఉద్యమాభివృద్ధికిన్ని మందసా కాల్పుల కేసు సందర్భములో యేర్పడిన డిఫెన్సు కమిటీ సహాయార్థమున్నూ యీక్రింది విధంగా సంచారము జరుగును. యెల్లరు సాయపడ ప్రార్థన- సంచార కార్యక్రమం.

జూన్ 9 తేది సిరిపురం, వావాం, 10 తేది తోటివాడ, కండ్యాం, గాంధీనగరం, కిసిరా, 11 తేది రాజాం. సోపేరు, గడిముపురాం, 12 తేది వెలికానివల్స, తలవరం, 13 తేది పాలకొండ మానీ, 14 తేది మొదిళ్ళవలస. ఇక్కడ తాలూకాసభ, జిల్లారైతుసంఘ సమావేశం జరుగును.

—యస్. నరసింహమూర్తి.

———

## విశాఖజిల్లా రైతు సంఘం.

జూన్ 14 తేది పగలు 11 గంటలకు దూసి రైల్వే స్టేషన్ దగ్గర మొదిళ్ళవలసలో కమిటీ మీటింగు జరుగును సభ్యులు విచ్చేయ ప్రార్థన.

—ప్రధాన కార్యదర్శి.




విసుగుకలుగు ఆహారపదార్థములలో

సై సై పిక్ టి టి మిస్కి ఇంగువ

ఉపయోగించండి

కష్మనివాసన, గొప్పరుచిని, జీర్ణశక్తిని, వృద్ధిచేయును

బహుమతి కూపనులతో విక్రయించబడును ధర పౌ 1రూ 1/14

ఎల్లప్పుడు శ్రేష్ఠమైన వాటినికొని తృప్తిపడుడు

మీకు నచ్చినట్లయితే ఇతరులకు సిఫారుచేయండి,


లేనిచో మీకంప్లెయింట్లేవో మాకు తెలుపండి-

అందమైన డిజైను అతి శ్రేష్ఠమైనవి.

చాలాకాలము పనిచేయును.







లివర్ 15 జ్యూయల్స్.

నెం 490 రోల్డుగోల్డు 10 సం॥ రు 23-12-0

నెం 491 9 క్యారట్ సాలిడ్ గోల్డు రు 34-0-0

పోస్టేజి 9 అణాలు ప్రత్యేకము. ఇంకను వివరాలకు మానూతన 16 సెం. క్యాటలాగుకు వ్రాయండి-

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో)

స్విట్జరులాండులో తయారు చేయబడ్డవి.

గ్యారంటీ లివర్ గడియారాలు

సంద్రంగా లేక చదరంగా

| | | |
|---|---|---|
| నె 401 | క్రోమియం కేసు | రు 4-4-0 |
| నె 402 | గోల్డన్ కేసు | 5-2-0 |
| నె 424 | క్రోమియం కేసు | 8-8-0 |
| నె 425 | గోల్డన్ కేసు | 9-6-0 |
| నె 425 | ఆర్. రోల్డుగోల్డు 10 సం॥ | 15-4-0 |

15 జ్యూయల్స్ లివర్ గడియారాలు.

| | | |
|---|---|---|
| నె 458 | క్రోమియం | రు 17-0-0 |
| నె 458 | రోల్డుగోల్డు | 22-2-0 |

లివర్ జ్యూయల్డు మూవెంటు

| | | |
|---|---|---|
| నె 428 | క్రోమియం | రు 10-4-0 |
| నె 430 | రోల్డుగోల్డు | 17-0-0 |

లేడీ గడియారాలు



జనీవా మూవ్మెంటు

| | | |
|---|---|---|
| నె 460 | క్రోమియం కేసు | రు 11-14-0 |
| నె 461 | గోల్డన్ కేసు | రు 13-10-0 |
| నె 462 | రోల్డుగోల్డు సం॥ | రు 17-0-0 |

బాపాలాల్ అండ్ కో., 101 అబ్దుల్ రహిమాన్ వీధి, బొంబాయి 3.

ట్రేడ్ మార్కు



రిజిష్టరు 2480

కాకర్ల కామాక్షయ్యగారి

పక్షవాత నివారిణీ డిపో.

మా భువనేశ్వరి గుళికలు పక్షవాతం, రుద్రవాతం, చన్ను, తిమ్మిర్లు మొదలు కోట్లకొలది జనులకు ఆపత్కాలములో ప్రాణదానమొసగి ప్రపంచ మంతటను ప్రసిద్ధి చెందినవి. కాకర్ల కామాక్షయ్యగారి ఫోటోమార్కుగల సీసాలు మాత్రమే వుపయోగించుడు.

8 రోజులకు భువనేశ్వరి గుళికలు, తైలం, కంటెమును రు 6—0—0

కాకర్ల వెంకటప్పయ్య, నేటివ్ డాక్టరు, పక్షవాత స్పెషలిస్టు.

కాకర్లవారివీధి, కాళహస్తిగుడి ప్రక్క, నెల్లూరు.


# ఆంధ్రుడై జన్మ ఎత్తిన ప్రతివ్యక్తీ చూసి తీరవలసిన చిత్రం

నాల్గు నగరాలలో ఈచిత్రానికి ఆంధ్ర ప్రేక్షక మహాశయులు అఖండస్వాగతం ఇచ్చి సన్మానిస్తున్నారు

**2 వ వారం:** **2 వ వారం:**

| | |
|---|---|
| క్రౌన్ టాకీస్ | కాకినాడ |
| శ్రీ హనుమాన్ పిక్చర్ ప్యాలెస్ | రాజమండ్రి |
| సరస్వతీ టాకీస్ | గుంటూరు |
| వెంకటేశ్వరా టాకీస్ | తెనాలి |

విశాఖపట్టణం, ఏలూరు, బెజవాడ, బందరు, సికింద్రాబాదు నగరాలలో అతి శీఘ్రకాలంలోనే విడుదల.




★

నాట్యకళా ప్రపూర్ణ ముంజులూరి కృష్ణరావుగారి అభినయ కళా కౌశలాన్ని మీరు ఈ రోజే బంధుమిత్ర, కుటుంబ సమేతంగా వెళ్లి చూచి ఆనందించండి!

★

తారాగణం:

లక్ష్మీరాజ్యం-
ఉమాదేవి-
కనకలింగేశ్వరరావు,
ముంజులూరి కృష్ణరావు,
మొదలగువారు.

★

డైరెక్షన్:
గోపాలరావు
రామగోపాల్

★

మ్యూజిక్:
ప్రభల సత్యనారాయణ

★

ప్రొడక్షన్ డైరెక్టర్:
యం. పి. రెడ్డి

కెమెరా:
వెంకట్రామన్.

సౌండ్:
రామచంద్రన్.

*Producers:*
The Naveena Bharath Pictures Ltd.

*STUDIO*
**Prakjyoti**

*For Bookings:*
**K. RAJAGOPALA REDDY Esq.**
*St' Thome High Road, Mylapore, Madras.*

# సుమంగళి

## అంతటా రెండవ వారం



ఈక్రింది సెంటర్లలో
31 తేది నుండి ప్రద
ర్శింప బడి ఆదరింప
బడుచున్నది.

*

| | |
|---|---|
| బెజవాడ: | దుర్గాకళామందిరం |
| తెనాలి: | సత్యనారాయణటాకీస్ |
| బందరు: | బృదావన టాకీస్ |
| కాకినాడ: | మెజెస్టిక్ సినిమా |
| ఏలూరు: | రామకృష్ణ టాకీస్ |
| నెల్లూరు | కొత్తహాల్లో |
| రాజమండ్రి: | జయ టాకీస్ |
| విజయనగరం: | కృష్ణ సినిమా |
| బెంగుళూర్: | సాగర్ టాకీస్ |
| సికింద్రాబాద్: | రాజేశ్వర టాకీస్ |
| గుంటూరు: | బాంబే టాకీస్ |

*

" కొందరకు పాట గుణమగు,
కొందరకును భావ- నటన- గుణమగు, రెండున్
కొందరకు గుణములగు నే
నందర మెప్పింతు ఫిలిము నయ్యుయ్యోడలన్॥ "

—వాహిని.

నిర్మాతలు — మూర్తిత్రయం
రెడ్డి-
రామ్‌నాథ్-
శేఖర్-

మద్రాసు, పారగన్ టాకీసులో **7-6-40**

విశాఖపట్నం, పూర్ణాథియేటర్ లో **15-6-40**

★

**VAUHINI PICTURE,**
43, Acharappan St., G. T. MADRAS.

Printer, Publisher, and Editor: N. V. Ramanaidu, Zamin Ryot Power Press, 168 Danduvari St. Nellore.